శ్రీనివాస ప్రబంధము

(రెండవ భాగం)

Office of the Registrar of Publications-Andhra Pradesh, Hyderabad-12
5 NOV 2002

రచన

సరస్వతీపుత్ర

డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు

SRINIVASA PRABANDHAMU – (*Second Volume*)
A classical Poetry by Dr. Puttaparthi Narayanacharyulu, Mochampet, Cuddapah.

ప్రథమ ముద్రణ :
జనవరి 1987

మూల్యం : రూ. 25-00

ప్రతులకు :
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాదు – 500 001.

ముద్రణ :
పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్
హైదర్‌గూడ, హైదరాబాదు–500 029.

ముందుమాటలు

ఇది "శ్రీనివాస ప్రబంధం" లోని రెండవ భాగం. కథా శరీరమునుబట్టి ప్రథమమూ లేదు, ద్వితీయమూ లేదు. అంతా ఒక్కటే. మరి 'రెండవ భాగ'మని ఎందుకు పిలిచినట్లు? ఈ భేదం నేను చేసినదే. ఇది రెండవ భాగం కావడానికి కారణం నా ఉపేక్ష. ఏ గ్రంథమూ ఎప్పుడూ త్వరగా పూర్తి చేయడం - ఏకధాటిగా వ్రాయడం నాకేనాడూ అభ్యాసం లేనిపని. ఎన్నడో బుద్ధి పుట్టినపుడు నాల్గు పద్యాలు వ్రాసి వూరుకుంటాను. మరలా ఏనాడో లగ్నం కుదిరినపుడే వ్రాత కుదిరేది. దీనికితోడు ఈ నడుమ నా అనారోగ్యం ఒకటి చేరుకుంది. వార్ధక్యమూ. వ్రాత సరిగా చేతకాదు. ఈ గ్రంథం ముగించి ఎందరినో శుద్ధ ప్రతి వ్రాసి ఇవ్వమని బ్రతిమాలడం జరిగింది. ఎవరి పనులు వారివి. భూతపురి సుబ్రహ్మణ్యం పండితుడు, జ్యోతిష్కుడు, వాస్తు శాస్త్రం తెలిసినవాడు. ఆయన కెపుడూ తీరిక వుండదు. ఎవరో ఒకరు పనులకు పిలుచుకుపోతూ వుంటారు. అయినా అతడు నాపైన వుండే అభిమానంతో శుద్ధ ప్రతి వ్రాసి ఇవ్వడానికి అంగీకరించి, త్వరలో వ్రాసి ఇచ్చినాడు. అతను నా శిష్యుడని చెప్పుకుంటాడు. ఎప్పుడో హైస్కూల్లో అతనికి నేను గురువట! అటు తర్వాత ఎక్కడెక్కడో ఎన్నెన్నో చదువుకొనినాడు. ఒక 'మహాకావ్యం' వ్రాస్తున్నాడు. అయినా ఆనాటి గురు భక్తిని పోగొట్టుకోలేదు. అతనిని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నాను. రావినూతల శ్రీనాథరావుగారు ఇక్కడ జడ్జిగా వున్నప్పుడు తఱచు మా ఇంటికి వచ్చేవారు. వారికి నాపైన గొప్ప గౌరవం. వారు దీని ప్రింటుకుగాను రు. 3,000/-లు వసూలు చేసి ఇచ్చినారు. అది సంసారాని కెపుడో ఖర్చయిపోయింది. మరలా దీని ప్రింటుకు అప్పు చేయవలసే వచ్చింది. వారికి నా కృతజ్ఞతలు

అర్పిస్తున్నాను. తెలుగు విశ్వవిద్యాలయంలో పనిచేసే శ్రీ పాండురంగయ్య- నా అన్ని పనులకూ చేయూత. నా ప్రతి పనీ అతడే జాగ్రత్తగా చూచి సాయం చేస్తూంటాడు. దీని ముద్రణ కూడ అతని తోడ్పాటుతోనే సాగింది. అతనికి నా మనః పూర్వకమైన ఆశీర్వాదాలు. శ్రీ దేవులపల్లి రామానుజరావుగారి దృష్టి నాకు శ్రీరామరక్ష. నేను ఏ సహాయం కోరినా వారు కాదన్నది లేదు. వారికి నా నమస్కారాలు. "పద్మావతీ పరిణయం"తో ఈ గ్రంథం ముగిస్తామనుకున్నాను. కానీ చేతకాలేదు. రామాయణం బాలకాండలో మూడు వివాహాలు చెప్పినాను. "అవన్నీ వేంకటేశ్వరుని వివాహాలే కదా! పొమ్మ"నుకున్నాను. మరలా ఎప్పుడయినా బుద్ధి పుట్టి రాస్తానేమో తెలియదు. ఇప్పటి కింతటితో ముగింపు.

కడప — పుట్టపర్తి నారాయణాచార్యులు

తేది. జనవరి 8, 1987

శ్రీనివాస ప్రబంధము

చతుర్థాశ్వాసము

శ్రీ లలితరూప! ధనురా
స్ఫాలన సూత్ర ప్రణష్టపలలాశి! జగ
ల్లీలా కర్మఠ! మునిజన
తాలీన పవిత్రమూర్తి! దశరథరామా! 1

వ. అనంతరంబ శర్కరాతస్కరవచో నిపుణుండగు రోమహర్షణి మునులం జూచి యిట్లనియె.

చం. ఒక శతవృద్ధు, భూమిసురుఁ డూర్జిత పుణ్యుఁడు, వేంకటావనీ
పకపద పల్లవాంక పరిభాసిత మంజుల కుంజపుంజ చి
త్రకమగు శేషశైలము నుదగ్దిశ నాశ్రమ మొందు సేసి, తా
నకలుషవర్తనుండు, త్రిదశౌఘముఁ దన్పుచు నుండెఁ గర్మలన్. 2

తే.గీ. ఆ దశమి కేకసుతుఁడు గుర్వర్థజీవ
నుండు, కౌండిన్యుఁ డనువాఁ డఖండబుద్ధి
పుత్రకుం డొక్కనాఁ డిధ్మములను దేఁ
నడవి తెరువుల కేఁగిన యవసరమున. 3

కం. ముదుసలి యగు తండ్రి జరా
విదళితతనుఁ డేకతంబ, వేల్లిత విటపా
స్పదమై వనమృగ భాంకృతి
పదమై, వెఱఁ గొలుపు విపిన పథమునఁ బడియెన్. 4

మధ్యాక్కర: విధి విధానంబునఁ జిక్కి, యుటజంబు వెడలి యా యంధుఁ
డిది యది యాశ్రమ మంచుఁజేతుల నెద్దియేఁ దడవి,
యడిగాక నోరెండఁ బనవి, "దైవమా!" యంచుఁ గన్నీట
వదనంబు, దడియఁగా బిట్టు పలవించి, పలవించి, కొనుచు. 5

తరువోజ: ఒక పదంబును వైచు నొక్కింత నిలుచు, నూర్పు
ముమ్మరముగా నోడు కన్నీట
శకలితమై గుండె, చాఁచుఁ జేతులను, సదయుఁడౌ తనయు
సంస్పర్శంబు కొఱకు
"నకటకటా!" యంచు నార్చుఁ బల్మాఱు, ననవరత వ్రతాయాస
ఖిన్నంబు;
ప్రకటిత సిరమౌచు వగడాకుఁ బోలు, రదనహీనమ్ము, శిరమ్ము
గంపింప. 6

కం. నడచి, నడచి తన యాయువు
గడఁ దాఁకినయట్లుఁ దోఁచి, "కౌండిన్యా! యో
కొడుకా! వినయాన్విత! యగ
పడవేమిర!" యంచు మరణభయ మెద దన్నన్. 7

సీ. ఘనసారమును శీతకరుని వెన్నెల, చంద
నమ్ము, మందార దామమ్ము, వల్ల
కీస్వరంబును, ప్రేమ క్రిక్కిఱిసిన ప్రియా
లింగనంబును సాధు సంగమంబు
నత్యంత శీతలంబగుఁగాని లోకమ్ము
తనుజాత! నాకు దద్దయును శీత
లమ్ము నీ స్పర్శ, యుల్లమ్ము గఱంచు నీ
సల్లాపమునఁ గల చవు లమృతము.

తే.గీ. నందు లేదని తలపోతు నను(గు కొడుక!
నీవురాని నా(డింకెట్లు నిలువ నేర్తు;
నాదు సత్కర్మ(దనిపెడు నాదితేయ
పితృగణములైన రాని దుర్విధి యిదేమి! 8

కం. అనుసవ మత్యంతాదర
మున హోమము వేల్తు, శాస్త్ర పూతమ్ముగ నా
మనవి వినడొక్కో! స్వాహా
వనితా వల్లభు(డు సుతుని(బనుచుట కొ(ఱకున్. 9

మధ్యాక్కర: అఖిల దైవతముల కీవ యాస్పద మమరౌఘమౌళి!
నిఖిలవేదమ్ములు నీవ తలపోయ నిఖిలశాస్త్రములు;
మఖముఖమ్మున నిన్ను(గొలిచి, శుభములు మర్త్యంబులందు;
సుఖిని(గావింపుము నన్ను నియ్యెడ శుభమొనరించి. 10

మధ్యాక్కర: నీస ప్తజిహ్వలు లోకనివహంబు నిచ్చలు(బ్రోచు
వాసుదేవుం డాదిదైవతమ్ము నీ ప్రకటమ్ము రూపు;
వాసవాదులు దేవగణము వేఱని పల్కుటేగాని,
భూసురముఖపరితోషి! నీయంశభూతులే వారు. 11

మధ్యాక్కర: నిగమమయాత్మ! యొక్కపరి భూదేవనివహంబు నీవు;
ధగద్ధగల్లోక సంతతియు సుక్షత్రధర్మంబు నీవు;
జగదవనంబగు వైశ్యకులవర్తి సత్కర్మ నీవు;
విగుణ! గుణాఽఽభాసి! శూద్రహిత సద్వృత్తియున్నీవు. 12

మధ్యాక్కర: దినమున వెల్గెడు సర్వదిక్కుల దీప్తి(బండించి
మనముల కమృతంబు(జిలికి రాత్రుల మర్త్యంబు(బ్రోతు;
వనఘ! సర్వులయిండ్ల నగ్నివై నిల్చి, యనిశంబు నోమె
దనుపమ జ్ఞానంబు నీకు, నిజము బాహ్యాఽబాహ్యమూర్తి! 13

మధ్యాక్కర: రక్షింపవయ్య! నన్ని యెడను సుదర్శనముగా నిలిచి
యక్షుద్రమతి నింతవఱకుఁ గొల్చినదది సత్యమేని
యక్షీణతేజఃపరీత! మూర్తిత్రయాత్మకదేహా!
రక్షోభయంకర హుంకృతి స్ఫుటద్బ్రహ్మాండగేహా! 14

తే.గీ. అని పనవు వృద్ధుఁడైన యయ్యవనిసురుని
రక్షణము సేయఁదలఁచె నారాయణుండు;
అఖిల దైవతముల హృదయాంతరముల
సతము వెలుఁగొందు శిఖిరూపుఁడతఁడుగాఁడె! 15

ఉ. తేజితబాణహస్తుఁ; డతిదీర్ఘభుజారమణీయుఁ; డంసవి
భ్రాజితరత్నయుక్ఛరధి; రాజసమంతయు నొక్క మానవ
వ్యాజమునన్ ధరాతలికి వచ్చెనొ నాఁ జనుదెంచె, దీప్తధా
త్రీజుఁడు, రాచవాఁడొకఁ డతిప్రియదర్శనుఁడైనవాఁడొగిన్. 16

తే.గీ. ఇట్టు లెదురేఁగుదెంచి సౌహిత్యమొనర
నా బడుగు కేలువట్టి పుల్లాబ్జములకు
నపరజన్మంబు వోలిన యక్షులందుఁ
గరుణ యను తేనె యోడికఁ గట్టఁ బలికె. 17

కం. "పిలిచిన నోయను వెఱపుల
నెలవగు కాఱడవిఁ జిక్కి నెగులునఁ బొక్కన్
వలసిన గతమేమీ! నీ
పలుకుందో డెవరు లేరె? బంధులు తాతా!" 18

కం. అని పలికిన నా పలుకులు
తన చెవులకు నమృతమైన, తన దుఃఖము బో
రన వెలికిరాఁగ నీగతిఁ
బన్నవెను బాలుండు దుఃఖపారిప్లవుఁడై. 19

శా. "ఏ ముప్రౌద్ధులఁ గొల్చు వహ్నియును నన్నే దైవ
మంచెన్నుచున్
నామాటల్ శ్రుతిభంగిగాఁ దలఁచు కన్యాకైన సూనుండు గా
కీ మర్త్యంబున వేఱు బాంధవులు నాకెవ్వారునున్ లేరు; శ్రీ
ధాముండుండఁగఁ దక్కుచుట్టములపైఁ దాత్పర్యముల్ సెల్లునే! 20

శా. నామూర్త్యంతరమెల్ల దేవతలుగా; నాసేవ మోక్షమ్ముగా
భామారత్నముఁ గొల్చి యేఁగె దివికిన్ భార్యాఖ్యపుణ్యంబు; త
త్ప్రేమద్యుద్రుమ మొక్కపండు నొసఁగెన్ విద్యావివేకాశ్రయుం
డా మత్సూనుఁడు నాకు నేడుగడ హవ్యంబందుఁ గవ్యంబునన్. 21

మ. ప్రణతుల్ సేయును వాఁడు వేల్పులకు జీవత్రాతపాదుండుఁ గాఁ
దను జీవింపగఁ నిండటంచు; విధికిన్ దాక్షిణ్యమేమున్న, దీ
వనికిన్ దెచ్చిన దింక వాఁడు బ్రదుకే బాష్పంబులై, యెంతగా
ననుఁ జింతించునో! నిల్చునో పుడమిపై, నాభాగ్య మెట్లున్నదో

కం. పితృ దేవ తర్పణంబులు,
శ్రుతిహితముగ నింతవఱకు సుఖముగ సాఁగెన్
సుతహీనుఁడనై యేగతిఁ,
బతితుఁడనయ్యెదనో! రేపు పరలోకమునన్! 23

తే.గీ. మత్పితరు లగ్నివేల్చి తన్మయములైన
దేహములు దాల్చి దివమునఁ దిరుగుచుంద్రు
వారు నా యన్వయపు శుభవార్త లడుగ
నేమి చెప్పుదు; నీ నెగు లెట్లుఁ ద్రోతు! 24

కం. నాయన! పొదగరి, చిక్కని
ప్రాయమ్మునవాఁడు, శాంతవదనుఁడు దయతో
నీయడవి నెక్కడైన మ
దాయుష్యము సుతుని తెరువుఁ దడవంగలవా! 25

తే.గీ. ఏను సతతమ్మును బ్రదక్షిణించినట్టి
యగ్నిదేవుండు నీపాల నధివసించి
శుభములిడు, పోయిరావన్న! సుతునిఁ దెచ్చి
యియ్యవన్న! సత్కారుణ్యహృద్యమూర్తి! 26

మ. అను పల్కుల్ విని శ్రీధరావిభుఁడు తాతా! రమ్మురమ్మంచుఁ దా
ననుకంపామతిఁ జేయి వట్టికొని, ఫుల్లాబ్జాతసౌగంధ్య శో
భనమై, సుందర చక్ర చక్ర కల నిస్వానంబులన్ శ్రోత్రముల్
దనియంజేసెడు నొక్క నైకటిక తీర్థంబందుఁ గ్రుంకించినన్. 27

కం. మాయము సేసిన యటులై
పోయిన జరతోడఁ గనులు పొలపము లార్చెన్
ఈ యవని దేవలోక
ప్రాయము తెర దీసినటులు ప్రతిభాసించెన్. 28

మధ్యాక్కర: తన కన్నులే తాను నమ్మలేకయుఁ దనయున్కి తాన
మనమున శంకించునట్టులై వేదమార్గానువర్తి!
యనె భూసురుండిది యేమి యచ్చెరు! వౌదువో నీవు
మనుజుండ వికనేల సంశయంబు, నమర్త్యుండవగుదు. 29

తే.గీ. ఈ యెడల దేవతలు చరియింతు రనుచు,
వృద్ధజనములు వలికిన విధము నేఁడు
సత్యమై తోఁచె నో నభశ్చరుఁడ! యెవఁడ
వీవు నాపైని దయఁగొంటి విట్లుసేసి. 30

సీ. దినమును నావేల్మిఁగొని నన్ననుగ్రహ
మునఁ జూచు హవ్యవాహనుఁడవగుదొ!
నా తర్పణంబులఁ బ్రీతులౌ మత్పితృ
గణముల లోన నొక్కరుఁడ వగుదొ!

నాద్వైన యజ్ఞసన్మానంబుతోఁ గృపఁ
జూపు నైగమ పురుషుండవగుదా!
సర్వార్చనముల కాశ్రయుఁ డౌట నానోముఁ
బండిన నారాయణుండవగుదా!

తే.గీ. భయము గొలిపెడు మిన్నులు వడ్డచోట,
నిట్లు గృపసేసితివి, యింక నిసుఁగు నొసఁగి
దేవ పితృకార్యములకైన దిగులు దీర్చి,
నీ స్వరూపంబు దెలిపి మన్నింపవయ్య! 31

వ. అని వినయంబునఁ బ్రార్థించిన నయ్యాదిపురుషుండు కరుణాకం దళిత హృదయుండై, సహస్రాక్షంబును, సహస్రపాదంబును, సహస్ర శీర్షంబును, సహస్రబాహువునగు నిజరూపంబు సూపిన, నవ్వేదవిప్రుండు, సర్వాంగాలింగిత ధరణీతలంబుగాఁ బ్రణామంబొనర్చి, నైగమవచనంబుల నిట్లు నుతియించె. 32

మ. "సతతంబున్నిను వేల్తు నగ్నిమయుగా సర్వార్చనంబుల్ భవ
త్ప్రతలాంశంబులఁ జెందుఁ గాన నిట నన్ రక్షింపనేతెంచి,తే
గతినిన్గొల్చిన, వారిఁదన్పెద లసత్కారుణ్యవర్షంబుతో
నతిలోకంబులు నీదు లీలలు శ్రుతివ్యాకోచ! నారాయణా! 33

శా. ఆదిత్యంబగు నీ స్వరూపమునఁ దానై తోఁచు లోకమ్ము, ని
ద్రాధీనమ్మగు చాంద్రరూపమున దేవా! కాని, జ్వాలా కలా
పాధేయమ్మయి వహ్నిరూపమున సర్వాఘమ్ములన్ మాల్చు, య
జ్ఞాధారమ్మగు నీ స్వరూపము, మదాశాగ్రంథి; నారాయణా! 34

మ. యజమానుండవు నీవ, హవ్యములు నీవాగ్నిప్రధులున్నీవు, స
ద్ద్విజ సర్వస్వమునీవు, నిన్నెఱుఁగుటే వేదాంతరాహస్య మీ
త్రిజగంబుల్, భవదీయ సంవిదమల క్రీడావిశేషంబు లో
యజ! యాద్యంతశరణ్యా! లోకహితకర్మాధీన! నారాయణా! 35

మ. పవనాందోళిత జిహ్వికా హృత ఘృతప్రాంశుస్ఫురత్కాయు లా
హవనీయంబును, దక్షిణాగ్నియును దేవా! గార్హపత్యాగ్నియున్,
భవమున్ దన్పుచు వెల్గినప్పుడు, భుజాప్రాలంబ కౌశేయ ధా
మవరాంగంబుఁ దలంతు దుర్జనితమోమార్తండ! నారాయణా! "36

తే.గీ. అనిన విప్రుని పల్కులఁ గలరి, ముక్తి
నిత్తు, నేతెంతువో; యన్న హితమితముగఁ
బలికె విప్రుండు పితృ దేవ వహ్ని తర్ప
ణమునఁ దనివొందలేదు మనమ్ము దేవ! 37

కం. సవనాత్మక! విధియుతముగ
దివిజులఁ బరితృప్తిఁ జేసి. ధీయుత సుత శా
స్త్రవిధి గృహస్థునిఁ జేయుచుఁ
బ్రవిమలమతి నిన్నుఁ గొలువవత్తును మీఁదన్. 38

వ. అంతవలకుఁ గృపసేయు మనిన 'వల్లె' యని పుండరీకాక్షుండు గర్మమార్గ నిర్వహణంబునకుం జాలినన్ని ధనంబు లొసంగి, యదృశ్యుండైన కౌమారదాన దీక్షా బద్ధ కంకణంబైన తత్తీర్థంబునకు నాఁటినుండి 'కుమారధారా' నామంబు ప్రసిద్ధంబయ్యె, నా వృద్ధుండును గుమారు మారాకారుం గూడుకొని, సదక్షిణంబుగ యజ్ఞపురుషుండైన శ్రీనివాసు నర్చించి, కాలకర్మయోగంబున నర్చిరాదిమార్గంబందె; నిది కుమారధారా మాహాత్మ్యంబు. 39

కం. హరిఁ గొలిచి కర్మహీనులు
నిరయమతులు ముక్తిపదవి నెగడెదరట! యా
హరిఁ గొలిచి కర్మనిష్ఠులు,
చిరపుణ్యులు, ముక్తిపదవి సెందుట యరుదే! 40

ఆ.వె. ఆ కుమారధార ననవద్య హృదయులై
క్రుంకువారి కగు నరుగ్ణదేహ
మఖిల మంగళమ్ము లా వేంకటేశ్వరు
భక్తి జనుల కొంగు పసిఁడి గాదె! 41

సీ. తన కథామృతపానమున నైన పుణ్యంబు
తీర్థపాదుండైన తెలియలేఁడు;
తన నామజపము సంధానించు భద్రమ్ము
లెఱుఁగలేఁడా రమావరుఁడు గాని,
తానొక్కనిని బ్రోచుఁ, దన నామజపము ని
త్యమ్ముగా భక్త సంతతినిఁ బ్రోచు;
హరినామమునకును హరికిని భేదమె
న్నుట, పాప దూషిత కుటిలబుద్ధి;

ఆ.వె. కర్త, కారయితయుఁ గడఁగి ప్రేరేపించు
వాఁడు, సమ్మతించువాఁడు, నిత్య
ముక్తి కనుఁగు లగుచు మోదింత్రు శతజన్మ
ముల కళంకమునకు బుజలు వైచి. 42

సీ. ఎవని పాదజలంబు హీరమాలిక డంబు
వెలయించు హరజటా విపణివీథి,
యెవని కీర్త్యవరోధ మవసరంబులఁ బిల్చు
సైరంధ్రి, శ్రుతిసతీ జలజగంధి,

యెవఁ డలవోకగా నేగు శృంగాటకం
బులు పరాశరసూతి మలిచదువులు,
ఎవనికి ఖరశికా హేల రాక్షసవధూ
మాంగల్య మాన విమర్దనమ్ము;

తే గీ. ఎవ్వని కటాక్ష నర్తకి యెల్లసురల
తలఁపు తోఁటల నవరసంబులను నించు,
నతఁడు శ్రీవాసుఁ డఖిల సన్నుతికిఁ దగఁడె
పరమభక్తి సదాతన ప్రాహుణకుఁడు. 43

వ. అని సూతుండు వలుకఁ దపోనిష్ఠా గరిష్ఠులగు సత్రయాగ సమా
విష్ట మునిశ్రేష్ఠులు తదనంతరకథఁ దెలుపుమన నిఖిలపురాణ
వ్యాఖ్యాన వైఖరీ సమేతుండగు సూతుండిట్లనియె. 44

తే.గీ. విమల మతులార! వినిపింతు వినుఁడు, వామ
లూరు తనయ ముఖోద్గతంబై రసాల
వాలమైనట్టి యొక గాథ, పఠననిరత
పంచజన పాపసంచయ వంచకంబు. 45

సీ. మధ్యదేశమున నాత్మారాముఁడను నొక్క
విప్రుండు శ్రుతిహిత విమలధర్మ
ధర్మనిర్జితమతి, ధామదైవత పితృ
దైవతాయత్త వర్తనుఁడు, విప్ర
పదనఖాఽఽలోక జీవంజీవ జీవనుం,
డఘశంకి, యనుసవాఽధ్యయనశూరుఁ,
డప్రతీప ప్రజ్ఞయైన వామాక్షి, తన్
నీడపోలిక గేహినీమతల్లి

తే.గీ.. యనుసరింపఁగ శాలిధాన్యంబుపంట,
యింట గోచయమై, యగ్ని యెల్లవేళ
లందు నాల్కలు జాచి యాజ్యాహుతులను
దృప్తిపడ గణ్య పుణ్యనదీష్ణుఁ డగుచు. 43

కం. బ్రదుకంగా నిరు గురువులు
ముదుసళులై పుణ్యలోకములు నొందినఁ ద
త్పదన రమాముఖ శోభా
క్రథనంబయి యంతఁ గాని కాలము వచ్చెన్. 47

సీ. కను గోరగింప ముక్కారు బండెడు నేల
కడు గొడ్డువోయె నొట్టిడిన యట్లు
కుండోధ్నులై పాలుగురియు గోనిచయంబు
పొదుగేదెఁ గనుపాటు వొరసినట్లు
తరతరంబుల నాఁటి తాళపత్రము లాఖు
విసరంబు దినె, మారి మసఁగినట్లు
చింతపండుగనున్న చిన్నిదం బింతింత
లై, దాఁచెనిల్లు, కొట్లాడినట్లు

తే.గీ. ఆ గృహము నభిజిత్తుల నతిథిజన వి
నీల నిశ్వాసధూమ్యలు నిండికొనియె
జలధిజా నర్మమందహాసమ్ము, వాని
యిమ్మనను,లేమి నీలకోలమ్ము నెఱపె. 48

ఉ. ఆకలియయ్యెనే పిడికెడన్నము వెట్టవె యంచు నర్భకుల్
గోకను బట్టికో, వికచ కోకనదచ్ఛవి లోచనాంత దుః
ఖాకులమూర్తియైన తన యంగనఁ జూచి ధరామరుండు బా
ధా కటుతా గ్రసిష్ణువయి,తాఁగన నట్లు నటించురిక్తుఁడై. 49

ఆ.వె. ఇరుగుపొరుగు వార లిసుఁగుల కన్నంబు
వెట్టఁ దల్లడిల్లు వెలఁదిమిన్న
గోలుమన్న యపుడు గుండెలోఁ గ్రుచ్చిన
బాకులగుచు, మిట్టిపడును ధవుఁడు. 50

సీ. ఉత్తమర్ణులు దిట్టకున్న నేమాయె ము
ప్పొద్దులు బరిచుట్టి పోవుచుండి;
రిల్లాలి వ్రతమైన యీలువు వాలుకా
ముష్టి, క్రమంబున మూరిబోయె;
కమలవంచిత తటాకమ్ము లౌ కడుపుల
తనయాలి రోదనోద్ధతులు సెలఁగె;
నుచ్చు గొట్టుచు నుండి రున్న నాళులఁ దిన్న
వారలార్జించిన పాపమంచుఁ;

తే.గీ. దలకులేకున్న గృహదైవతములకైన
నూనె గఱవయ్యె; నేమంబు నూని సేయు
భవ్య రుద్రాఽభిషేకముల్ పలుకవయ్యెఁ;
బాలునకు గుండె ధైర్యంబు పలుచనయ్యె. 51

కం. ఒకనాఁటి రేయి తన పడు
కకుఁ జెప్పక యిల్లు వదలి క్ష్మాసురుఁ డరిగెన్
వికచాక్షి గేహినీమణి,
తుకతుకమని యుడుకునంచుఁ దోప కవశుఁడై. 52

శా. ఆ విప్రోత్తముఁ డట్లు దాఁటుకొని వింధ్య గ్రావ చేతస్కుఁడై
చావైనన్ బ్రదుకైన శ్రీశుఁ డొకఁడే సంరక్షకుండంచు, నా
నా వన్యాద్రి పథంబుల న్నడచె, వన్యాభీల సత్త్వారవం
బావిష్కార మొనర్పఁ గర్కశ కృతాంతాఽభీక్ష్ణ
హుంకారముల్. 53

ఉ. అన్నము లేదుపో! సలిలమైనను జిక్కదొకొక్కమాటు; తన్
గన్న యెవండుగాని కనికారము సూపఁడు, పల్కు వేదపుం
బన్నములైన, నాకలికిఁ బట్టెడు కూడు లభింపనీయ నా
పన్నుఁడు నిశ్చయించెఁ దనుపాతము దప్పదటంచు దీనుఁడై. 54

వ. ఇట్లు నిశ్చయించికొని, యనిశ్చిత లక్ష్యంబులగు ప్రయాణంబుల, వంకలు, వాగులు, నదులు దాఁటి, తుంగ శృంగాభీలమ్ములగు మహాశైలమ్ము లుత్తరించి, వేంకటాచల ప్రాంతాఽరణ్యంబులు దరిసి, శేష శైలాఽధిత్యకలఁ జెలఁగు కపిలేశ్వరు సందర్శించి కొని, యభిషేక నిష్ఠ నిర్వర్తించి, చిరకాల విప్రయుక్తులగు తాత పాదుల సందర్శించిన తనయుని పోల్కి, బాష్పకణ కరాళ కపోల యుగళుండగుచు నాత్మారాముం డిట్లు విలపించె. 55

శా. ఏనాఁడైనను నీపదాబ్జములపై నింపొందఁగాఁ దేటి చం
దానన్ వ్రాలనొ! యాతిథేయుఁడనుగా, ధర్మంబుఁ జెల్లింపనో!
సూనాస్త్రక్షత బుద్ధినై, పరసతీ శుద్ధాంతరంగంబులన్
దూనంబుల్గావించినానొ! యిది యే దోషంబు? గౌరీధవా! 56

శా. సాలగ్రామము నైన దానము గొనన్ స్వర్ణమ్ముఁ బండించు దీ
క్షా లాలిత్య మనోహరాంగములు మత్క్షేత్రార్య లక్ష్ముల్, గృహ
శ్రీ లీలాయితమైన ధేనువులు దీటెన్ సర్వమేనాఁటి యం
హోలిప్సల్ ఫలియించె నిక్కరణి! సంధ్యోల్లాస దివ్యాకృతీ! 57

చం. అడలడివొందఁగాఁ దగని యట్టిది ధర్మపురంధ్రి, నేలలో
వెడలని కుట్టు లాకలికి వెక్కుచునుందురు, వారి నందఱన్
విడిచిన నా యవస్థ యిది, వేడుకలయ్యెను నీకు, సేగికిన్
గడువిక లేదొ! కైశిక వికస్వర చంద్ర సుధా మధూద్వహా! 58

శా. నీ మూర్త్యంశముఁ దాతపాదులకునున్, నీహారశైలాత్మజా
సామానాధికరణ్య తల్లికిని, శశ్వద్భక్తిఁ జెల్లించితిన్;
స్వామీ! తత్ఫల మిట్లు పండినదొ! యేపాపైరో నాకందు ల
య్యో! మానంబున ద్రుందు నా వనిత యెట్లుద్విగ్నయై పొక్కునో!

ఉ. నాదు గృహంబు సంతతము, నైగమవాద సుగంధ యుక్తమై
సాధిత పుణ్యకర్మమయి, సమ్యగుపాసిత వృద్ధబృందమై
మోదిత గేహినీ స్మిత విభూషితమై, మదికించె మున్ను నేఁ
డేదియులేక, చీఁకటుల కిమ్మయిఁ జేతము గ్రుమ్మునీశ్వరా! 60

సీ. తడి నోచుకొనని నందాదీపములతోడ
గృహదైవతంబు లిర్రింకులింకె;
తావివస్తువులుంచు జీవదంతపుఁ బెట్టె
కూటికై యొకనాఁడు కుదువబడియె;
నభినవామోది మాల్యముల నుంచెడి హేమ
పుటి యెట్లుఁ బోయెనో పోఁకఁ దెలియ
దందంపు రత్నమ్ము లమరించు బరిణెలు
వడ్డిరూకలకుఁ గైవసములయ్యె;

తే.గీ. నున్న యొక ముక్కురయుఁగూడ మొన్న యతిథి
పూజకై చెల్లువడియె నే మొగము తోడ
నింక బ్రదుకుదునని యాలి నిల్లు విడచి
వచ్చితిని దేవ! కరుణాప్రపా స్వభావ! 61

కం. నన్నూరికిఁ బంపింతువొ!
గ్రన్ననఁ జంపెదవొ! యెట్లుగాఁ దలఁచితి నా
చెన్నొనరింపుము, తొదలే
దన్నా! వాత్సల్య పుష్కరైక పయోధీ! 62

ఆ.వె. అనుచు దూరవగచి, యహిభూషణుఁడు దన్ను
నననయించినట్టులైనఁ గొంత
వనట డించి, తీర్థవాసులౌ విప్రుల
కడ భుజించి, యల్లఁ గన్ను గూర్కి. 63

శా. సాయంపూజ లొనర్చె భూమిసుతుఁ డాశాస్యంబు లాశించి; యా
ర్యాయుక్తాంగున కప్రతీపమతియై, యక్షిస్ఫురన్మోద ధా
రాయత్తంబులు గండభాగములునై, ప్రత్యగ్ర చంద్రాతప
స్ఫాయత్కాంతులు,మేని భూతిరుచులున్,బాటింప బాంధవ్యముల్.

శా. ఆమూలాగ్రము లోకమంతయును నీహారాంశు సాంద్రప్రభా
వ్యామిశ్రంబయి, మానసోత్సవము సేయన్, దక్షిణాహార్య నూ
త్నామోదాకులగాత్రుఁడై పవనుఁ డుత్సాహంబునన్ వీవ, భా
మా మందస్మితరోచి దోఁచినది, యాత్మారాము భావంబునన్.65

కం. ఏ యెగ్గుసేసి యెఱుఁగదు;
నా యవసరములను దీర్చు నలినాక్షి, శుభా
ధీయమ్మగు మతి, సతమా
ప్యాయమ్మగు నగవు వదల దాననమందున్. 66

ఉ. ఏను భుజించికాని భుజియింపదు, క్రొత్తడి, నిత్యమా తిథే
యానుగతమ్ము జీవనమునై సగరేయికిఁగాని పండ; దే
మైనను నోట నొక్క కఠినాక్షరమాడదు; నాదు పోఁకకున్
మీనవిలోలనేత్ర,మది నిర్భరతాపము సెందకుండునే! 67

సీ. అంతలింతలునైన సంతానమది గోడు
గుడుపుచు వెన్నువెంటఁ బడుచునుండ
నప్పులిచ్చినవార లన్యభూమికఁ గొన్న
వైవస్వతులు చుట్టిపోవుచుండ,

నిబిరీసనిశ్వాస నీరుచానను లొచు
నాగంతుకులు వెన్క కరుగుచుండ,
నష్టసస్యములు, వినష్టరోచులు పొల
మ్ములు మాటికిని మనమ్మును దహింప,

తే.గీ. మాటవరుసకు నొక్క గోమాతలేని
యింట నెటులుండునో! పొత్తి యొంటిగాఁగ
మనసులేనట్టి వాఁడనై, మమత వదలి
వచ్చు నా రాఁక, యెంతేసి పాపమగునా! 68

కం. ఏనేమి సేతు! నావిధి
నానాధన సంపదలను నాశమొనర్చెన్
సూనము లమ్మినచోటనె
మానమువోఁ గట్టెలమ్మి మనఁగా వలసెన్. 69

ఆ.వె. ఏది దారి యింక నిల్లుసేరుటకు? ర
మా క్రుధాతిశయము మాన్చుటెట్లు?
మఱల నాగృహంబు మందహాసాంచితం
బగుట యెపుడొ! కర్మ దెగుట యెపుడొ! 70

మ. అని చింతించుచునుండె విప్రుఁడు, ప్రఫుల్లాబ్జాత సాధర్మ్య స
న్మణి దీప్తమ్ము శలాంగమెక్కి, కవిసంతానమ్ము గీర్తింప, ది
గ్వనితల్ ముచ్చట వెల్ల నీ విరులువీవన్, ప్రత్యూషోదేవి ద
ర్శనమిచ్చెన్ జగదీక్షికాఫలము, పూర్వాశాప్రదేశంబులన్. 71

సీ. తిరువేంకటాద్రి కందర సౌరభామినీ
శయ విపంచికలు దేశాక్షి వలికెఁ;
గానన్నాశ్రమ వనస్థలీ నిత్యవాసి కో
కిలలు పంచమరవం బొలుకఁబోసెఁ;

గమలాకరోత్ఫుల్ల కమలినీముఖచుంబి
తతభృంగ షడ్జసంధాన మెసఁగె,
రఘురామ శాపాక్షరములఁ గ్రొంబొగడింకి
చక్రవాకము, ప్రియాసక్తిఁ బొదలెఁ;

జలిత వనదేవతా పదాబ్జాత హంస
కారవము రీతి, విహగబృందాఽతివేల
కలనినాదమ్ము ధారగాఁ గ్రందుకొనియె
నిగమ మయమూర్తి పూర్వాద్రి నిలిచినపుడు. 72

ఆదినంబు గూడ నాత్మారాముండు శివాభిషేకంబొనర్చి, పున ర్దర్శనంబయ్యెడుమని ప్రార్థించి, శైలాఽవరోహణంబు సేసి, యట నున్న పదునేడు తీర్థంబులఁ గృతాఽవగాహుండై, నిబిడ ని శ్వాస మలీమస వదనుండు, భగవచ్చింతనొకదరి ప్రొద్దులు పుచ్చుచుండఁ గొంతకాలంబునకు. 73

తిరు వేంకటాద్రి జనన
స్ఫురదణిమాదిక విభూతి శోభిత, తీర్థో
త్కర దరదళితంబై బలె
పరుసంబగు వాని యఘము పాయలు విచ్చెన్. 74

ఒకనాఁడు లలితలవలీ
ప్రకర సుగంధిలుఁడు గంధవహుఁ డెద దాఁకన్
సకియయు, నిసుఁగులు గడచిన
సుకములు తలఁపునకు మెదలి చూఁడుచు నుండన్. 75

ఆ.వె. ఏమి పాలు వోఁక, యిట్టట్టుఁ దిరుగుచు
నయ్యధిత్యకలను, నడవి మెకపు
టులివులకుఁ జలించుచున్నంత నల్లంత
దూరమందు, హర్ష పూరమగుచు. 76

చం. ఒక గుహఁ దోఁచెనందున సమున్నతకాయుఁడు; పల్లవారుణ
ప్రకట జటాకలాపుఁడు, నిరంతర మాధవ చింతనా సము
త్సుక లలితాధరుండు, మృదు సుందర హాసవిభాసి, యర్థిక
ల్పకమగు బాహువెత్తి, దయ పండిన చూపున సన్న సేసినన్.77

కం. అటుఁ దరిసి దుఃఖభర ము
త్కటమై నన్నమ్యమాన గాత్రంబున, హృ
త్పుటమునఁ ద దంఘ్రి యుగ మా
దట ఘటియించుచును బాష్ప దళితాక్షుండై. 78

ఉ. లేవక యున్నఁ గాంతి తరళీకృత లోచనుఁ డామహర్షి వ
త్సా! విలపింపనేల? గడఁదన్నిన వింక విపత్పరంపరల్
శ్రీ వనితా దరస్మిత విశిష్ట పరిష్కృత వక్షుఁ డియ్యెడన్
దైవము, మర్త్య దుఃఖములు తాను సహింపఁగలేఁడు లేశమున్.79

కం. లెమ్మని పలికిన శుభవా
క్యమ్ములు, చెవులకు విపంచికాస్వన మటులై
నెమ్మని నాత్మారాముం
డమ్ముని యాజ్ఞానువర్తియై, తా లేచెన్. 80

తే.గీ. అలఁతి నగవులు పెదవుల నవఘళింప,
నల్ల గూర్చుండుమని పల్కి, యా మునీంద్రుఁ
డమృత శీకరములఁ జిల్కు నక్షియుగపుఁ
జూపు సారించి, వానిఁ జూచుచును బలికె. 81

ఆ.వె. అలసితివి గదన్న! యాకలి దప్పుల;
సొలసితివి గదన్న! నెలఁత విడిచి;
పంట పైద విడచి, పాపల విడచి నె
మ్మదిగ నింక నేడ్పు మానవన్న! 82

కం. నవ్వుచుఁ జేతురు పాపము
లవ్వల ననుభవము లంటినప్పుడు శోకం
బెవ్వలనఁ బోక, కుడిచెద
దివ్వ సుమతి మర్త్య లలఁతి హృదయపు వారల్. 83

కం. తమ తమ సమయంబులలోఁ
దమ తమ పాపములు పండి తత దుఃఖములై
క్రమమునఁ బీడించును, ని
క్కము, పుట్టువులెల్ల స్వకృత కర్మ ఫలితముల్. 84

కం. అది గావున మానవుఁడు
న్మదుఁడై పెఱ తెఱువులందు మదినీడ్వక భ
ద్రదమగు వివేకపథమునఁ
బదిలుండై నడచి హరిని భజియింపవలెన్. 85

సీ. ప్రాగ్జన్మమందు గర్వపరాస్త్ర సద్వివే
కుఁడవౌచు సలిపిన కడిఁది యఘము
పండినదిప్పుడు; ప్రాప్తకాలంబుగా
నామనిఁ బక్వమైనట్టి ఫలము;
తనువు మాఱినయంతఁ దప్పునో కర్మమ్ము
కృతహస్తుఁడగు ధన్వి యెనయకేయు
ఘనకలంబకమట్లు గడుకొను, తావక
ప్రారబ్ధమును ద్రోవ వలఁతు లెవరు?

తే. గీ. వత్స! ప్రత్యక్షముగ నీదు వనట ఁగన్న
దానఁ గాసంతదయఁగల్గు గాని, నీవు
దుఱుసుఁదనమునఁ జేసిన దుర్ణయమ్ము
లెవరికైన క్షమింపఁ జాలివియె గావు. 86

సీ. పరమ సాత్త్విక వనీపకులకు నాఢ్యులు
గల్పించు దాన విఘ్నములు సేసి,
కల్లవాదమ్ములు గణియించి నోటి కం
డూతితో భక్తుల చేతమేర్చి,
తమయన్నమును దిని, తమ బట్టఁ గట్టి సు
ఖంబున్న వారిని గాసిపఱచి,
శీలమెల్లను బిల్లిశీలమై జనులకు
సజ్జనుండన్న వేషమ్ము గట్టి,

తే. గీ. యల్పమగు విద్య వంచనాశిల్పవశత
వేయి రెట్లుగ మిఱుమిట్లు వెలయఁ జేసి,
కలయ మసిఁ బూసి మారేడుకాయఁ జేసి,
నీ వొనర్చిన యఘము లెన్నెని గలవు. 87

తే. గీ. కలిమి మ్రూల్గుచునుండినఁ గాకికైనఁ,
గరము విదలించి యెఱుఁగవు; కన్నవారి
యాస్తిపాస్తులఁ దోచి దుఃఖాశ్రువులకు
నగ్గపఱచితి వారిగేహములు నీవు. 88

మ. మదనాజ్ఞావశవర్తివై సతుల నర్మప్రౌఢి లాలించి, సం
పదలున్ మానము దోచి, పుచ్చితివి, విప్రశ్రేణిఁ బ్రశ్నింప న
య్యది భంగ్యంతరమంచు దెప్పితివి; మిథ్యావాదముల్ సేసి, దు
ర్మదుఁడా! దైవము కన్నుఁ గప్పెదవు; చార్వాక
క్రియావేత్తవై. 89

కం. ఒకపరి హరి యని యెఱుఁగవు;
సకలము నీ బ్రదుకు పాపచయపేటికయై
వికవిక నవ్వెదు భక్త
ప్రకరము, మరణమ్ము లేని వాఁడవు పోలెన్. 90

ఆ. వె. బ్రతుకుఁ బంచి చీమవలెఁ గూడఁబెట్టిన
ధనములెల్లఁగొంచు దారసుతులు
నిన్ను వెడల నడువ, నిబిడజరాక్రాంత
తనుఁడవగుచు దుఃఖదళితుఁ డగుచు. 91

వ. పశ్చాత్తాపంబునంది, మరణించిన కతంబున నీ జన్మంబునఁ
బరమ పురుష సమారాధన బుద్ధి గలిగె, నంతకుఁ దొల్లి విద్యావం
తుండవై, దుర్వారగర్వంబున నొడలెఱుంగక, యొక భక్తునెది
రించిన కతంబున తచ్ఛాప కీలా దగ్ధంబై, తొలి జన్మంబు పలు
వోకలు వోయెఁ! బూజ్య పూజా వ్యతిక్రమం బూఱక పోవునే?
ఈ పుట్టువున నుపభుక్తంబై, ప్రారబ్ధంబు నష్టప్రాయంబయ్యె
ననఁ దత్పదవనజ రజః పటల పవిత్రిత శిరస్కుండై, యాత్మా
రాముండిట్లనియె. 92

సీ. ఆ తపోద్విగ్న సస్యములకుఁ బ్రాణత
ర్పణమైన తొలకరి వానవోలె,
వితత దారిద్ర్యాస్తమిత తేజునకు నింటఁ
బ్రభవించినట్టి సేవధియుఁ బోలె,
నామూల చూడరోగాఽభితప్తునకుఁ బ్రా
ప్తమ్మైన యమృత భాండమ్ము వోలె,
జలధి మధ్యమున దిక్కులుసూచు ననదకు
దైవప్రదత్త పోతమ్ము వోలె,

తే. గీ. వచ్చితివి ! నాకు గాఁగ నీవనములందు
నోరు గలిగిన కామధేనువును బోలె,
స్వామి ! నా యఘములు సైచి, వనట డించి,
నన్నుఁ గృపసేయవలె నీవనాథనాథ ! 93

తే. గీ. ఎప్పుడో ! యేమొ సేసిన నిప్పు దవ్వి
కనలు గొని వ్రేల్చె, కాలపక్వంబులగుచు
నిత్యమైనట్టి యీ సృష్టి నియమమేమొ !
మధితమతి ! యర్థమేకాదు, మాదృశులకు. 94

కం. కర్మము సేయక బ్రదుకఁడు,
కర్మంబున మేలుఁ గీడు ఘటియిల్లెడు, నా
కర్మ ఫలంబుల కవ్వలి
మర్మము నిమిడించికొన్న మానవుఁ డెవఁడో ! 95

ఆ. వె. మంచి కర్మకైన మహి జన్మ దప్పదు;
ఆర్తి యట్లె హర్ష మనుభవంబు;
జన్మ కర్మములను సందడిఁ జిక్కకే
మతికి శాంతి దొరకు మార్గమేది ? 96

సీ. ఈరీతి నడుగ నకృష్టపచ్యములైన
సస్యంబు లట్టులా సంయమీంద్రు
వదనంబు వలన నీవాక్కులు వెడలె, సం
తతబుద్ధి యోగమంథాద్రిమదిత
మానస దుగ్ధాబ్ధిమహిత సుధాఽఽసార
శీకరములు, ముక్తిజీవనములు;
త్రిగుణమ్ములందుఁ గీర్తితము సత్త్వము, పరా
త్పరునకు నిక్కంపుఁ దనువు గాఁగ

తే. గీ. సత్త్వమున రెంటిగెల్చి, నిశ్శంకవృత్తి
మూఁటినిన్ గూల్చి, కర్మంపు ముసుఁగు జించి,
యంతరానంద నిబిడ నిత్యానుభూతిఁ
దనకుఁ దానయై తృప్తిఁ జెందును బుధుండు. 97

ఆ. వె. దానికేమిగాని ! ధనములు నశియించి,
మథనపడెడు నీకు మంగళంబు
గలుగునట్లు సిద్ధికరమైన యొక మంత్ర
మనువు గాగఁ జెప్పు దాలకింపు. 98

సీ. అతి పవిత్రంబైన యామంత్రమునకు దే
వత వ్యూహలక్ష్మి, యా పక్ష్మలాక్షి
నిత్యానపాయిని నిగమ నూపురునకుఁ
దిరు వేంకటాఽద్రి కధీశ్వరునకు;
బద్ధ పద్మాసన; పరవాసుదేవ వ
క్షఃపీఠవాసిని, కల్పకుసుమ
నిస్తుల మాలికాని భభుజద్వయ, శారద
దాంభోజ లోచనాపాంగ చుళుకి

తే.గీ. తార్తజన దుఃఖ, పాప సంహతికి నూడు;
అప్రయత్నంబుగా ధ్యానమందు నిలుచు
గండ పాటల్య సామి సంకలిత మంద
మధురహాసమై, నిత్య సంపదల దీవి. 99

చం. జగముల తల్లి యైన మురశాసను గాదిలి చల్ల చూపు, నె
మ్మిగ నెట జార సాచునట మెండుకొనున్, మదదంతి సంతతి
ప్రగుణిత ఘీంకృతంబులు, విభాపరిభావిత నాక సుందరీ
మృగనయనా దరస్మిత సమీరిత కోమల దృగ్విలాసముల్. 100

తే.గీ. ఆమె ప్రారబ్ధములనైన నపహసించి
కొలువులకు సంపదల నేన్నుకొలగ నిచ్చు
నామె రాజసమూర్తి కల్పాంతమందుఁ
గితవ భూదారు నిండు కౌఁగిళులఁ దనియు; 101

ఉ. పంచ విధాత్మకం బగుచుఁ బ్రస్తుతి కెక్కు సమస్త సృష్టికిన్
బంచ విధాత్మకుండు హరి; పాల్పడు దైవము, వంచన క్రియా
చుంచువు, లోకజాలముల శోభిలఁ జేయు నడంచుఁ బెంచు నీ
సం చెఱుఁగంగఁ జాల రనిశంబు శ్రమించి చిరంతనర్షులున్. 102

వ. నారాయణ, వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్నానిరుద్ధ రూపంబు లా హరివ్యూహ భేదంబులు; లక్ష్మి, మాయా, జయా, కృతిశాంత్యభిధానంబుల నయ్యఖిలజనని, నిత్యానపాయిని గావున నయ్యజ్ఞపురుషు నయ్యై వ్యూహంబుల ననుసరించు; నా మహాలక్ష్మిని సర్వభావంబుల శరణంబు సొరుము. 103

సీ. నిండార విరిసిన పుండరీక యుగంబుఁ
బోలు కన్నుల దయ జాలువాఱ,
సతతకేశవరూప సంధాన విమల చి
త్తము భక్తనికర బాధలను మాల్ప;
హర్షబాష్పములు పద్మాసనాబద్ధ వ
క్షమ్మున జాఱి, పుటమ్ము లెగయఁ,
దామర సోదర శ్రీమహితంబైన
వరదహస్తము మనోహరము గాఁగ,

తే. గీ. సాధకుల మానసముల సాక్షాత్కరించి,
పుణ్యముల ఫలమైనట్టి వ్యూహలక్ష్మి
సర్వసుఖముల నొసఁగుఁ బుష్కలము గాఁగ,
భవ్య రాజసమూర్తి, దిగ్భరిత కీర్తి. 104

ఆ.వె. అనుచుఁ బలికి మౌని యంత నాత్మారాము
నాచమింపఁ జేసి, యత్యమృతము
లైన బీజములకు నాకరంబైనట్టి
వ్యూహలక్ష్మి మనువు పోలఁబలికె. 105

సీ. ఆద్యంతములఁ దారకాంచితములగు ల
క్ష్మీ శివా బీజ సువాసితమ్ము;
నల చతుర్థ్యంతంబులైన వే దాది మా
యా మాతృలక్ష్మీ పదాంచితమ్ము ;
గతిఁ జూపు నతి శబ్దయుతమును పరమ ల
క్ష్మీ శబ్దకాంతి సమ్మిశ్రితమ్ము ;
గమనింప విష్ణువక్షస్థ్సిత యనెడు క
ర్ణోత్సవదళ సమభ్యా హితమ్ము ;

తే. గీ. వహ్ని జాయాంత మభ్యాసవశత సాధ
కునకు సర్వస్వమైనట్టి మనువు పరమ
ఋషులు భజియించినది దీని భృశ నియమము
తోడ జపియించి, కామ్యమందుము కుమార! 106

ఉ. ఏను సనత్కుమారుఁడ నహీనము వేంకట శైలమందు ని
ధ్యాన మొనర్చుచుందును; సదాతన మూర్తి, రమాకళత్రు, వ
త్సా! నిరతంబు నిచ్చటికి శంభుపురోగము లొచ్చు వత్తు రా
ప్యానభుజున్ భజింపఁగ జనార్దను, ధాతృముఖుల్,
నభశ్చరుల్. 107

తే.గీ. భద్రకాలంబు నీకు సంప్రాప్తమైన
దాన, శ్రీవాసు కరుణ మంత్రము లభించె,
"పోయి వత్తు" నటంచు నా పుణ్యమూర్తి
మెఱుపువలె వచ్చి చాటయ్యె మెఱపువోలె 108

మ. అతులాశ్చర్యపరీతమానసుఁడు, హర్షాత్యంతరోమాంచితుం,
దతిమాత్రక్షతపాపుఁ డా ద్విజుఁడు మున్యాదిష్ట మార్గంబునన్
వ్రతి, జాపంబొనరించె మంత్రమును, భాస్వత్సాంద్ర కారుణ్య సు
స్మితనేత్రంబుల నిందిరాజనని, భాసింపంగ హృద్వీథులన్. 109

ఆ.వె. నికటఝరుల పూత నీరంబులందు సు
స్నాతుఁడగుచు భక్తి జపముదీర్చు
చద్రి నెక్కె, ముదితుఁడైన యాత్మారాముఁడు
దఖిల పంక కతకమైన దాని. 110

సీ. ఆకాశముననుండి యలవోక యవనికే
తెంచిన యనిమిష తీర్థమేమొ!
వైకుంఠవాస దివ్యపదాబ్జ ధూళీ సు
వాసిత విరజాస్రవంతి యగునా!
సద్భక్త హృదయభాస్వద్భక్తిధార లు
ప్పొంగి తీర్థాకృతి బూను వడువా!
జ్ఞానమ్మె జీవనాకారమై యార్తుల
సేఁగిఁ దొలంప నిల్చిన విధమ్మొ!

తే. గీ. యకరుణంబగు సంసారమందుఁ జిక్కి,
వెతగుడుచు వారి రక్షింప విష్ణుఁ డన్య
తనువు సేకొన్నబాగొ! యంచనువచింప
నర్హమగు దాని, నభిగమ్యమైన దాని. 111

కం. కలమధుకరఝుంకృతి సం
కులనీరం బబ్జగంధ కూలంకష ము
చ్చలితరథాంగం బమరీ
విలాస వాచాలితమ్ము విధుసరము గనెన్. 112

ఉ. స్వామి సరస్సునందు మనసారఁగఁ దీర్థము లాడినంత, త
ద్భూమిసురాఽఘపంక్తి, దరపుంజ విసంస్థులధైర్యసారమై
యేమికరాము నీవలనికింకిటఁ బాసితిమంచుఁగాకప
క్షామితనీలదేహము, విహాయసభూమికిఁ జెంగలించినన్. 113

చం. యమ నియమాఽభిరాముఁడగు నయ్యవనీసురుఁడాసరస్స మీ
పమున వసించె నొక్కకుటి, ప్రత్యహమున్ జపియించె మంత్ర ము
త్క్రమము దొఱంగి భాగ్యములు గల్గునుగాక ని, విష్ణు సేవతోఁ
గ్రమమునఁ బొందరాని గతి గల్గునె! యిందును నందు నెందునన్.

తే.గీ. అన్యభావ పరీవాహ మడ్డుకట్టి
యొకట మనసు లగించి యా వ్యూహలక్ష్మి
మననమొనరించు భక్తునకును గతించె
నిర్భరానందయుతములు నెలలు కొన్ని. 115

సీ. ఒక రేయి నియమసంయుక్తుఁడౌ భక్తుండు
చంద్రికా చారునిశా ప్రభాత
పర్యంతమత్యంత భావార్ద్రమతి హరి
ప్రియఁ దలంచుచునుండి మృదుల మంద
మలయమారుతముల మఱచి నిద్రించిన,
వర శంఖ చక్ర దీవ్యత్కరుండు
వరదహస్తాఽతిసుందరమూర్తి, కారుణ్య
రసనిమ్నగాఽబ్ధి, శరణ్యపదుఁడు

తే.గీ. వక్షమునయందు నిల్చిన వనచరాక్షి,
వనజకర, వనజానన, వనజగంధి
పోహళింపఁగ నగవులు వ్యూహలక్ష్మి,
శ్రుతినిగదితుండు, శ్రీనివాసుండు తోఁచె. 116

ఆ.వె. ఇట్లుఁ దోఁప హరికి నెదఁదొడవైన దు
గ్ధాఽబ్ధి కన్య వలికె నార్తుఁడైన
భక్తు గుఱిచి, యింక భద్రముల్గలుగుఁ బో
వోయి! సుకము లందవోయి యంచు. 117

కం. ఆ పలుకులు హృద్గతమగు
తాపము దలగింప హర్షతరళిత నేత్ర
వ్యాపృతబాష్పుఁడు, సుందర
నీపమువలెఁ బులకపటల నిచితతనుండై. 118

వ ఉన్నంత నిర్నిరోధంబగు విధివిలాసంబున నిద్రాభంగంబైన
లేచి, నాఽతితృప్తుండగుచు నిట్లు వితర్కించె. 119

కం. పరమ పురుషుండు తోఁచియుఁ
బరమంబగు ముక్తి దొఱకువడక లభించెన్
బరమంబుగాని సంపద
పరభక్తి గొఱంత వడియె ప్రారబ్ధమునన్. 120

ఆ.వె. ఆద్యులైన మౌను లన్వహ మెవ్వాని
వీక్ష కొఱకు ద్వారవేది గాతు
రట్టి శ్రీనివాసు నభివీక్ష సేసియుఁ
గలమి గోరుకొనుట తెలివిలేమి. 121

కం. అని చింతించియు లక్ష్మీ
వనితామణి, లోకజనని వనిజాక్షునితో
మనవి యొనర్చెడు గావుత
మని కైవల్యాభిలాషి యపుడు నుతించెన్. 122

సీ. ఏదేవి కడఁగంట నెసఁగు జూపున మధు
ద్విషవక్ష మామ్రేడిత శుభకాంతి;
మూఁడు వేదమ్ములు జాడ దీయఁగలేని
దేమాత విభవమ్ము హితకరమ్ము;
సర్వ మంగళ సమాశ్రయణీయ మే తల్లి
నవకంపుఁ బెదవి చిన్నారి నగవు;
సకలామరీ కైశ్య సాంద్ర కస్తూరికా
భ్రమరితం బే భామ పదయుగంబు;

తే.గీ. సిద్ధశక్తు లేజనయిత్రి చెంత నిలిచి,
సీవిరులువేయు గారాబు చెలులు, శిష్ట
కులవశంవద యాదేవిఁ గొలిచి శరణు
జొచ్చువారము భక్తి భాసురుల మగుచు. 123

సీ. కలశ సాగరమొ! యాజ్ఞావనీతలమొ! స
త్పుణ్యరాశివిగ నీ పుట్టుచోటు
వైకుంఠ వక్షమో! వనజాత వనమొ! చి
న్నెలు గ్రుమ్మరించి నీ సొలయు చోటు
త్వద్భూమ, దృశ్య సర్వ ప్రపంచమొ! కాక
వైకుంఠవాస దివ్యంపుఁ బదమొ!
స్వచ్ఛందమో! లేక పరతంత్రమో! తావ
కాగణ్య లీలా విహార గరిమ.

తే.గీ. శ్రద్ధ యనునట్టి నిన్జేసి సర్వ మాన్యుఁ
డయ్యె బ్రహ్మంబు శ్రీనివాసాఽవతరము
నిత్య లీలా విభూతుల నీవు లేని
దతఁడు లేనట్లె యోగి హృద్ధ్యాన హంసి! 124

ఉ. నిన్ను నుతించువాఁడు జననీ! సకలేధితుఁ డౌను; భాగ్యముల్
తెన్నులు గాచు వాని కవలేపము డిందుచు, ద్వత్కటాక్ష సం
పన్నులు గాఁగనై, యసుర మర్దన లక్షణ లక్షితంబు, దీ
వ్యన్నవ దీప్తి, గంధ్రదు; భవదంఘ్రమె జతుద్రవ సుందరాంకమున్.

సీ. అన్యోన్య లక్ష్యంబు ననవధిక గుణంబు
నగుచు, నిత్యానపాయంబు నగుచు
సతత నిష్ప్రీత్యూహ వితతానురాగమై
పరగు మీ దాంపత్య భావమునకు
విమల యోగుల చిత్త వీధులు శయ్యాగృ
హములు, శ్రుత్యంతమ్ము లమలశయ్య,
లహిప స్ఫుటామణుల్ నిహిత దీపాంకూర
ములు, శుద్ధ సాత్త్విక లలిత వినుతు

తే.గీ. లమరఁ బరచిన పూవు, లింద్రాదులైన
సమయ మెఱిఁగి రావలయు మీ చరణ సేవ
కట్టి సద్గుణాధీశుల కనవగత వి
హారులకు నాద్య గురువుల కంజలింతు. 126

సీ. అమల ప్రత్యగ్రూపమను దేవతను గూర్చి
యవహితమతులు జీవాత్మ యనెడు
ద్రవ్యంబు వేల్తురు, దాని విశ్వాసమున్
పేర వక్కాణించు విశ్రుతములు
శ్రుతులు, తదర్థంబు సూక్ష్మంబుగా శర
ణాగతి, యుజ్ఝితోపాధి గంధ
మైనట్టి మీజంట, యరయంగ నేక శే
షిత్వయోగంబునఁ జెలఁగుచుంట

తే.గీ. నొక్క దేవత, యరుణులో నున్నకాంతి
యతనికంటెను వేఱు గానట్లు, నీకు
వాసుదేవునితో భేదభంగి లేదు
పరమపద తారహార దీవ్యచ్ఛుభాంగి! 127

తే.గీ. శ్రుతులు నీవైపు నిత్యసూరులు పరేశు
వైపునై, స్థానభేద సంబద్ధమైన
త్రిగుణఫలకంబుపై విహరించు మీకు
నమరబృందంబు లక్ష శారములు తల్లి!

కం. శ్రుతి పరిపణములు నీ యు
న్నతములు నామములు నెమ్మనమున, లిగింపన్
బతనంబు లేదు వానికి
వితత దురితపవన చలిత విధి చక్రమునన్. 128

కం. కొందఱు నీవే స్వామిని
యందురు జగములకుఁ గొందఱంద్రు ముకుందున్
మందులు వాగర్థమ్ముల
చందమ్మగు మీకు భేదసరణి గలుగునే? 129

సీ. పరవాసుదేవ దీవ్యన్మూర్తిలో నుందు
పుష్పంబునందు నామోదమట్లు,
ధవుఁడెత్తు విభవావతారంబు లందుందు
పల్లవాశ్రితరాగ భంగియట్లు
హార్దావతరములందందగింతువు, స్వామి
పదబంధమందున భావమట్లు
తనుపారు నర్చావతారంబు లందుందు
బడివచ్చు స్వాధీన పతికయట్లు

తే. గీ. ఆర్తరక్షణ మనునట్టి యధ్వరమునఁ
దాను యజమాని, తత్ప్రియ దారవీవు
చానలేనిది యజ్ఞంబు లేని యట్లె
నీవులేనిది లేదు దీనాఽవనంబు.

సీ. కడలి యందునఁదోఁచి, కడలి యందున లీన
మగునట్టి భంగసంహతులు వోలెఁ,
బరవాసుదేవుని వలనఁ దోఁచిన యసం
ఖ్యాతమ్ములగు విభవాఽవతరము
లంద యడంగు, నా చందంబునన పరా
త్పర వత్సదేశ సంభాసమాన
మైన నీరూపంబు నందుండి పొడమి, నీ
లాది దృశ్యము లనన్యాదృశమ్ము

ఆ.వె. లంద యడఁగు దేవి! యానంద సింధువు
హరి సరాఽవ రాద్యుఁ డతని యిచ్ఛ
యనెడి మారుతమున జనన మొందిన యూర్మి
తతులు నీదు లీల లతులమూర్తి!

సీ. అమల మా సంసార మఖిల వాఙ్మయ మే మ
హాదేవి మృదు మందహాస గరిమ,
మేరు ధన్వుండైన ధీరుండు పుష్పధ
న్వున కోడుచే సతీ భ్రూ లసితము,
నయన సాహస్ర పానైక లక్ష్యము పురం
దరున కే పౌత్రి సౌందర్య మహిమ,
సోమ సుత్కాంక్షా లతా మేఖలా బంధ
గంధిలం బెవ్వారి ఘన జఘనము

తాదృశలు గీస్పతీ సతీంద్రాణు లప్స
రసలు, తాదృశ లౌటకు విశదహేతు
వజ్ఞనీగృహా! వారలభ్యర్థితములు
నీ పదమ్ములు గొలుచుట నిజము సుమ్ము. 132

అమరేంద్రాదులు గొల్వ నంబుజమునం దాస్థానమై, పద్మనా
భమనోహారి దృగంతచంద్రకిత భాస్వన్మూర్తివై, పుష్కరాఽ
ధ్వము లందుండి సుమార్హణోత్సవమొనర్పన్ బుష్కలావర్తముల్
సమదేభేంద్రసుధాఽభిషిక్తవగు నీ సంపన్నతల్ గొల్చెదన్. 133

దుర్వాసుని శాపమ్మున
సర్వము సిరి యస్తమించి, జంభారి గల
ద్గర్వుండయి వినుతించిన
నిర్వేదము దీర్చినట్టి నిన్నుఁదలంతున్. 134

అమృతాసారవినీల వారిధరశోభాద్వైతముల్, ప్రత్యుష
స్సమయోత్ఫుల్ల మహోత్పలద్యుతి తిరస్కారంబు, లార్తవ్రజ
శ్రమనోదంబులు, తావకంబులు కటాక్షంబుల్ ప్రవర్తించు భా
గ్యములెవ్వానికిఁ గల్గు వాఁడు త్రిజగత్కాంతుండు తేజస్వినీ! 135

తనవారికైనట్టి పనులు తానయొనర్చు
పరమాత్మ యన్న విశ్వాసమూని,
ధర్మార్జనమునకుఁ దగినధనంబు గో
రకయున్న యేకాంతరక్తమతుల
గమనించి, నాథుండు గనుసన్న సేయ సుం
దర దరస్మేరబంధురితవదన
వయి సమ్మతించెద, వప్పటినుండి వా
రలగృహంబుల ధర్మములు హసించు

తే.గీ. నవసరంబునకంటె యెక్కువ గ్రహింప
రా నిరీహులు, తదసంగతాఽభికృష్ట
మైన రీతి నచ్చోటనే యధివసింతు,
వతివిచిత్రమ్ము నీ దయ యనుపమాంగి! 136

శా. శ్రేయస్కాములు గొల్చినన్ శ్రుతిసతీసీమంతలాలాటికా
ప్రాయంబుల్ భవదంఘ్రిపద్మములు; కైవారారవోత్సాహశో
భాయుగ్వ్యక్తుౢలు; చామరాఽఽలచలద్బాహూత్తరీయుల్; సుఖా
ధాయి స్వర్వనితాస్వయంగ్రహులు, వేఁ దార్కొంద్రు కైవల్య
మున్. 137

సీ. ఆత్మానుభవమున కహితంకరమవిద్య,
తన్నాశమాత్మ విద్యావిధేయ,
మది నీపదాబ్జాతమృదుగంధమగుట, నిన్
వివిదిషల్ గొల్తురు విద్యకొఱకు,
నఖిలచేతనులకు నఘసంచయము జన్మ
కారణం, బా మురదారణుండు
దండధరుండౌట తామొనర్చినదైన
యేన మార్పం, డుదాసీనవృత్తి;
తే.గీ. అట్టి యెడల నీవనుకంప నవధరించి
చేతనులవైపు వాదించి సేతువఖిల
మంగళంబులు, త్వచ్ఛుభాపాంగములకు
వరవుడమొనర్చు సంవిదీశ్వరుఁడు తల్లి! 138

శా. మాయాలీఢ మనోవికారములకున్ మాఱాకు హత్తించు గ
ర్వాయత్తమ్ములు, లోకవైభవము లేరాళంబు ప్రాప్తించినన్
జాయన్ ద్రోసి ముముక్షువుల్ గొలుతు రెన్నన్ మిమ్మునేకాత్మతా
స్వాయత్తరూపులు గాఁగ వైదికవిధాసంశుద్ధధర్మంబులన్. 139

మధ్యాక్కర. దిగధీశమౌళిలాలితములైన నీ దివ్యాంఘ్రియుగము
లగణిత భక్తిఁ గన్గొనల నిల్పినయట్టివారలకు
నగవుల బరణులొనిండ్లు నానటన్నవ్యసంపదల;
దిగులేదెదరు మృతులైన పరవాసుదేవ సంప్రాప్తి. 140

సీ. ఒకనాఁడు గోరి, వేఱొకనాఁడు బ్రాప్తించి,
ప్రాప్తించువేళకు భావభేద
మెనసి, సుఖమ్మును ఘనతాపభరమౌచు
ముత్తెఱంగుల తాపములకుఁ జిక్కి,
చీఁకటి నూతితోఁ జెనయు సంసారంబు
నందుండి వెలివచ్చు నధ్వమేది?
యొక కోర్కెఁదీఱ వేఱొక కోర్కెఁ గోరి స్వ
యంకృత మపరాధమందు నలిఁగి,

తే.గీ. చిక్కువడుచున్న నన్ను రక్షింపవమ్మ!
మమత దలకొన వైష్ణవ మాయ ద్రోచి
దీటు లేనట్టి తల్లి! త్రికూటవర్తి
నీ! సుధా ధౌత రోచిష్ణు నిర్మలాంగి! 141

సీ. జ్ఞాన బలైశ్వర్య శక్తి తేజో వీర్య
ములను నాఱగు గుణమ్ములకు నధిపుఁ
డైనట్టి దాన, ముఖ్యార్థ మౌనేదైవ
మవనిపై భగవంతుఁ డనెడు శబ్ద
మునకు,ఁ దద్వాసుదేవుని పద్మముల యందు
భక్తి గల్గుటకు త్వ ద్వల్గులోచ
నాంత నిష్యంది దయాపూరమే కర
ణమ్ము, హ్రీంకారిణీ! నవ్య జలజ

తే.గీ. వాసినీ! శీతలమ్ములై భద్రదమ్ము
లగుచు నిగమాంత తత్త్వ లాక్షారుణమ్ము
లైన నీ యడుగులఁ గొల్చు ననఘ బుద్ధి
నొసఁగి, రక్షించుకొనవమ్మ! వ్యూహలక్ష్మి! 1

సీ. ఏమి కొఱంత! యింకేమి గావలయు నీ
కంచును బ్రశ్నించు నట్టులున్న
శారద చంద్రికా సంపదున్మేష వి
కాసివిస్మేరంబు కన్ను దనుప
దరిసెనం బొసఁగిన తల్లి! నీ దయకన్న
నింకేమి గావలె నెచ్చు నాకు!
నడిగిననేయిచ్చు నమరగవీ సుర
భూజంబు, లడుగక మున్న యొసఁగు

తే.గీ. దీవు! సంప దున్మాదమ్ము లెడఁదఁ గ్రమ్మి
ధర్మమును దప్పకుండగా దయగలుగుము
తల్లిదండ్రులు నాకుఁ బద్మాముకుందు
లనెడు తలఁపు దప్పింపకుమమ్మ దేవి! 1

తే.గీ. ఇట్లు నుతియించి, మనమున నెనయు భక్తి
స్వామి పుష్కరిణీ స్వచ్ఛ వారిఁ దోగి.
శమముతో నిత్య నైమిత్తికములు దీర్చి
విశ్రమించి, స్వప్నము భావవీథిఁ దోఁచి. 1

కం. సంపదలు గల్గునప్పుడు
జొంపములై మదము, లఘునిషూదన సేవా
సంపత్తి వదలునో యని
కంపిత ధైర్యుండు కన్నుఁగవ జడిగట్టన్. 1

శా. స్వామీ! యెంతటివారినైన మఱపింపంజాలు, కాంతాకటా
క్షామోదమ్ములు, ధర్మసంపదలు, పంకాఽఽతంకమూలమ్ము లి
చ్ఛామోహమ్ములు, వానినుండి నను నశ్రాంతమ్ము రక్షింప వ
య్యా! మిథ్యా భవబంధ దానకరుణావ్యాకోచ! నారాయణా! 146

శా. నీ భక్తవ్రజసేవకై వసువులన్నిత్యంబు వెచ్చించు ధ
ర్మాభిన్నంబగు బుద్ధినిమ్ము; భగవద్రాగాఽభిషంగాంఘ్రి పూ
జా భద్రాయితజీవనం బొసఁగి, యీ సంసారముల్ మిథ్య లం
చే భావంబున మర్వకుండునటు నన్వీక్షింపు నారాయణా! 147

మ. ధనముల్ గల్గిననాఁడు బంధుసుతకాంతాజాతముల్ ప్రేమలం
గనుగొం, ద్రాధన మేదినప్పుడు, ముహుః కాఠిన్యముల్ సేతు; రె
వ్వని కెవ్వాఁడు ముకుంద! వంచనముతో బంధంబు, లస్మన్మనో
ధనముల్, తావకపాదపద్మములు, నిత్యానంది! నారాయణా! 148

మ. ఉపమానాఽతిగ తావకాంఘ్రియుగ భక్త్యున్మాదమున్ గూర్చి, న
న్నపలాపంబుల ముంప, కార్తిహర! దేవాధీశ! గోవింద! గో
చపలాచంచల సౌఖ్యమోహహర ! యన్ సన్నామ సౌగంధ్యముల్
గృపసేయంగదె జీవనంబునకు, సుశ్రీయుక్త! నారాయణా! 149

శా. ఏనాఁడో! మఱియేయఘంబుననొ! నాకేర్పడ్డవేర్పాటుతో
నానాయాతనలన్ నలింగితిని దీనవ్రాతమందార! శో
భా నిష్యంది భవద్భుజాయుగళ దీవ్యద్వైజయంతీసుమం
బౌ నన్నిగతి వేఱుసేయకుము, జ్ఞానానంద! నారాయణా! 150

వ. అని యిట్లు సాఽభిప్రాయంబుగ వినుతించిన హృదయాంతరా
ళంబునఁ దోఁచి, మృదుస్మితరోచిర్వహుండగు శ్రీనివాసుండు
తథాఽస్తన్నయటులైన, నిర్వృతిసుధానిబిడ హృదయుండగు
నాత్మారాముండు పునర్దర్శనంబునకు వీడ్కొని స్వగృహంబున
కరుగుదెంచిన. 151

కం. ఎదురేగుదెంచె గేహిని
ముదితవదన విప్రయోగమున కీనాటం
దుదియయ్యె నంచు ప్రేళులఁ
బదముల సంతానమంటి పరువులు వెట్టన్. 152

తే.గీ. ఆమె నూరార్చి, ధైర్యసమాహితుండు
వ్యూహలక్ష్మీ పరిష్కార పుణ్య గణ్య
వక్షుఁడగు వేంకటేశ్వరు భావమందు
నిలిపికొని కొన్ని వాసరంబులను గడిపె. 153

సీ. ప్రేళ్ళ కొల్చుగ విరవీగి పండె పొలంబు,
బంధుసంతతి తొంటివలెనె వచ్చె;
శ్రవణమంజుల మృదుస్వనముల గోకదం
బము నీటిపాయఁగా బాలుగురిసె;
మంజూషికలయందు మహితరత్నమ్ములు
చిత్రవర్ణమ్ములఁ జెలఁగి నవ్వె;
ధర్మంబు, వెండియు పట్టపగ్గములేక
యన్నిమూలలఁ ద్రోపులాడఁ దొడఁగె.

తే.గీ. పూర్వపరిణాహ సత్ఫల వ్యూహలక్ష్మి
చిఱునగవు సుంత, చెంగలించినదె తడవు
ధన్యుఁడైన యాత్మారాము మాన్యగృహము
సర్వమంగళములకు నిషద్యయయ్యె. 154

కం. అతిథుల యాశీరావము
లతుల నిగమనివహఘోష లభ్యర్హిత,మా
సతి పదభక్తుల సేవలు
వితతములై తొంటివలెనె, వేడ్కలు సేసెన్. 155

తఁ గొన్ని సమము లరిగిన మీఁదటఁ
ౄరమునఁ బుత్రగణము లెదుగ
కొప్పఁజెప్పి భరము లాల్మారాముఁ
ంల శేష శైల మాశ్రయించి. 156

లా కైంకర్యంబున
ంలనా విభునిఁ గొలిచి, చిత్తము విమలం
లలిత వైజయంతీ
లా సుమభావమొంది మన్నన కెక్కెన్. 157

ౕనాఁడు లచ్చి నెక్కొన్న ప్రేముడి
క్షువెట్టె శౌరి, పుష్ప మొకటి
ఃయంతి యందు వారిఁ జూచి హసించెఁ,
ౖలమ్ము జన్మ తతి ఘటిల్లె. 158

చరితంబు నిష్ఠమెయి నెవ్వరు దామొక మండలంబు, ల
చరణాంబుజాహిత విశిష్టమతిన్ పఠనం బొనర్చు వా
చరితార్థ జన్ములకు నక్షయ సంపదలబ్బు, దుఃఖముల్
ు, భుజంగ శైలపతి పాలనసేయు దయానురక్తులన్. 159

పలికిన యా కథ విని
మిత మస్తకులు మౌని విభులనిరి చిరం
ుఁడగు శ్రీశుని యశమున
వి సనదు సూత! భక్తి ధామ సమేతా! 160

యు నేడు తీర్థంబులు పర్వతమున
వటంచు వాక్రుచ్చితి, క్రమ ఫణితి,
ు మాహాత్మ్యములు దెల్పి భక్తిలతకు
ౄత సేచన మొనరింప వయ్య! సుమతీ! 161

శా. ఆ పల్కుల్ విని సూతుఁ డిట్లనియె సత్యంబౌను మీమాట; లం
తః పాపాపహ వాసుదేవమయ గాథల్, ప్రీతి గాకుండునే!
యా పీయూషమునందు మాధవకథా వ్యాఖ్యాన సంసేవన
శ్రీ పర్యాప్తరుచుల్ ఘటించునె? పరప్రేమైక విన్యాసముల్. 162

సీ. సత్కథా శ్రవణ సంస్కార బలమ్మున
నెడఁద సత్వగుణంబు నిచ్చగించు
సత్త్వగుణంబుతో సజ్జనవ్రాత సం
బంధంబు గలుగు, తద్బాంధవంబు
సుతదారధనముల మతిఁ ద్రిప్పి వాసుదే
వునియందు భావంబు జొనుపఁ జేయు
సాధనామార్గ శశ్వదుపాసితుఁడు హరి
స్వాంతంబునందు నాస్థానమౌను

తే.గీ. హరి హృదయ పద్మ సంస్థితుఁడైన యంత
నఖిల భూతముల్ వాసుదేవాత్మకంబు
లన్న యెఱుక ఘటిల్లు, నత్యంత సులభ
మవగణిత తాపమైనట్టి శ్రవణభక్తి. 163

ఆ.వె. ధనము వలదు, దేహదండన వలదు చి
త్తమ్ము గట్టగా శ్రమమ్ము వలదు
విష్ణుకథలు సతము వినుచుండెనేని కై
వల్యమందు నరుఁడు పంకముడిగి. 164

కం. హరి పురుషోత్తముఁ, డాదర
పరులై, తన కథలు వినెడు భక్తుల విడువం,
డఱసావు సచ్చినను డె
ప్పరములు ధనములను లోభి వదలని భంగిన్. 165

సీ. కలిమి దాఁచినచోటఁ గాచిన ఘటసర్ప
ములకుఁ దద్ధనములఁ గలుగు ప్రేమ
'లంబా!' యటన్న నిజార్భకంబును జేరఁ
దీసెడు గోమాత తీపిమరులు
తలఁపు నాచినయట్టి తరుణికై సర్వస్వ
మర్పించునట్టి నాయకుని వలపు
మనసుకన్నను వేగమునఁ బోవ నంకించు
నభిసారికా కాముకానురక్తి.

తే.గీ. తన్నె సకలమ్ముగా నెంచి తన కథాఽను
కర్ణనాసక్తి దాల్చు నేకాంత భక్తు
పైని భగవంతునకుఁ గల్గు వలపులందు
లవము బోలవు, పూతపల్లవములార! 166

వ. అది యటులుండె, పరమపద వాసుండైన శ్రీనివాసునకు గాదిలి
చుట్టంబులై, వేంకటాఽచలంబు నాశ్రయించి, తమయందు
దోఁగు భక్తుల పాపంబులు పరిహరించి డిండీరచ్ఛలంబున నవ్వు
చున్న తీర్థ మాహాత్మ్యంబులు వినుండని సూతుండిట్లనియె. 167

మ. పరమంబైన వృదాకు నాయకగిరి ప్రారంభమందే, సురాఽ
సుర నిధ్యాన గవేషణీయుఁడు, సదాచ్యోతద్దయాసార సుం
దరుఁ డార్యా దరహాస మాల్యభర చిత్రగ్రీవుఁ డొప్పారు, శం
కరుఁ, డాద్యర్షి జటాకిసాల పరితః కాషాయితాంఘ్రి ద్వయిఁ;

శా. పాతాళంబున నొక్కనాఁడు కపిల ప్రాజ్ఞోని సేవింప, ని
చ్ఛాతీతంబు వరంబులన్ గురిసి, నిత్యక్లిన్న మానుష్య సం
జాతోదార దయాభరుండగుచు భాస్వల్లింగ దేహంబునన్
బ్రీతిన్, మధ్యమ భూపదార్పణ మొనర్చెన్ స్వామి రమ్యంబుగన్.

శా. ఇందీవాసుని పాదపద్మములపై నేకాంతమౌ భక్తి నా
నందంబుల్ మదిఁ గ్రమ్మ, సంధ్యల నమంద ప్రౌఢి న ర్తించు, జూ
టాందోళద్విధుపాద సంజనిత ధున్యాకల్పుఁడై, నేఁటికిన్
గందర్పాఽపహవృత్తి, సర్పకులప, క్ష్మాభృత్ప్రదేశంబులన్.

ఉ. ఆతని యగ్రభూమిఁ గపిలాహ్వయమౌ నది వుట్టెఁ, బర్వత
స్ఫీతబిలంబునుండి యదసీయము పూత జలాఽవగాహనం
బాతతముక్తి సౌఖ్యమున కధ్వము, పైతృక కర్మలోప సం
జాత మలీమసంబు లుపశాంతి వహించు నటన్ మునింగినన్. 171

తే.గీ. దాని కూర్ధ్వ దేశమ్మునఁ దనరు శక్ర
తీర్థమొక్కటి, యఘముల తిమురు మాల్ప;
కామకృతపాపములకు ముఖ్యంబుగాగ
నదియ భైషజ్యమని యందు రమలమతులు. 172

ఉ. గౌతము నారి వాలు కడఁగన్నులకోడి శతక్రతుండు, ధ
ర్మాతిగవృత్తియై కవయ, నమ్మునిశాపము వేయిగన్నులై
శాతరుషాఽగ్నులన్ దనుక, జర్జరితాంగుఁడు దీనదోఁగి, త
త్పాతకమున్ దొలంగె, బహుధాస్తుతితీర్ణ మునీంద్ర కోపుఁడై. 173

సీ. వరుణాత్మజుండు విష్వక్సేనుఁ డనువాఁడు
బహుజన్మముల పుణ్యఫలముగాఁగ
హరిఁగొల్చు బుద్ధి సంప్రాప్తించి, పెద్ద కా
లము తపమొనరించి, విమల సత్త్వ
గుణమయబుద్ధి ముకుందుని యనుకంప
సారూప్యముక్తి దుష్ప్రాపమంది;
యంతటఁ బోక సేనాఽధిపత్యంబు, ల
క్ష్మీజాని సాన్నిధ్య సేవఁబొంది

తే.గీ. మహితుఁడయ్యె నేస్థలమున మంజుకుంజ
పుంజ సుమ నికరామోద పుంజితమ్మ
నైన యాచోట నొక తీర్థ మమరు, నదియ
ధృతయశమ్మ విష్వక్సేన తీర్థ మనుచు. 174

కం. పంచాయుధ తీర్థమ్ములు
పంచారించినవి పైని, పరమపదము బ్రా
పించునటమునుఁగు నరుఁడఘ
సంచయములు వాసి భక్తి సాధించినచోన్. 175

తే.గీ. అగ్నికుండ తీర్థమ్మ తదగ్రభూమిఁ
బొలుచు నాపైని జలఖగ కలరవాఽను
కారి శశికాంత సోపానకాంతమైన
బ్రహ్మతీర్థంబు తాపనిరాసమమరు. 176

ఆ.వె. దాని దాఁటిపోవఁ దనరు సప్తర్షుల
తీర్థములు, ప్రకాశ దీప్తతనువు
లచట దోఁగువాని నపవర్గ లక్ష్మి మ
న్నించు సుతునిబోలె నించి హితము. 177

సీ. మున్నొక విప్రుండు ముదుసలి, తీర్థయా
త్రాకృతోద్యముఁడౌచు తనువు డస్సి
పలువగఁ గుడువంగఁ, బరమాత్ముఁడాతని
భక్తినిష్ఠకు మెచ్చి, రక్తివచ్చి,
కలలోన నిలిచి పుష్కరశైల జలముల
యందుఁ గ్రుంకినఁజాలు గ్రందుకొనును
ముక్తిసౌఖ్యంబు విప్రుఁడ! యంచు వచియింప
నా యానతిని శిరమందుఁ దాల్చి

తే.గీ. శేషశైలమ్ము సేరి శాస్త్రీయ విధుల
నచటి తీర్థమ్ము లాడి, దివ్యతనుఁడగుచు
తపము ఫలియించి, దైవతతతిని మించి
యతఁడు సారూప్యముక్తి విహారియయ్యె. 178

తే.గీ. మూఁడు భువనంబులందున మూఁడు కోటు
లమరు, నొక యర్ధకోటి తీర్థముల గుంపు
వానికెల్లను శ్రీకార మీ నగంపుఁ
దీర్థములు; పాపసార్థ హృద్వేధకములు. 179

తే. గీ. తనివివో, శేషశైల ప్రదక్షిణమున
భూప్రదక్షిణ పుణ్యంబు వొందు నరుఁడు
వాని కడఁగంటి సేవకై వలచివచ్చు
ముక్తిసతి, ముహ్యమానయై ముదము నించి. 180

కం. బలదేవుండొకపరి పి
చ్చిల పుణ్యము, శేషశైల శృంగము గని, యీ
యిల సర్వ తీర్థముల ము
న్కలు వేసిన పుణ్యమంది కడు విలసిల్లెన్. 181

సీ. తొల్లి కష్టముల పెన్వెల్లి మున్గిన పాండ
వులు దుఃఖితులు యదుతిలకుఁడైన
కృష్ణుండు సెప్పిన, వ్రతనియములు, శేష
శైలమందొక్క వర్షము వసించి
యొక్క తీర్థమ్ము మత్యుక్తులై తారుపా
సించిన, తత్పుణ్యశీర్ణపాపు
లైరి; రమావరుండంత ధర్మజునకుఁ
గలలోన నిలిచి రాఁగల సమీక

తే. గీ. మందు జయలక్ష్మి నీపాలఁ జెందుననియె
నట్లు ధర్మతనూజుఁ డాశాంతదంతి
సీమితంబైన యిలయెల్లఁ జెలఁగి యేలెఁ;
దీర్థము తదాది పాండవతీర్థమయ్యె. 182

వ. జరాహరంబు, వలిష్ఠంబు, రసాయనంబను తీర్థత్రికంబు చింతామణీ పర్వతంబున వెలయు, నవి స్వామిపుష్కరిణికిఁ బూర్వదేశంబున ద్వావింశచ్ఛరపాతంబున నొకగహ్వరంబునఁగలవని యనూచానవృద్ధ వాక్యంబు; మాయాతిరోహితంబులగు నీ సరస్త్రికంబు మలీమస మనస్కులు గనుగొననేరరు; కనకాచలంబున నష్టలోహంబుల నిధులుంట యథార్థంబు; తద్దర్శనంబు యుగభేదంబులఁ గామినీ కాంచన కటాక్ష కళంక విదూరులకు లభించు; నవికల్పితంబగు భక్తి వేంకటాచలంబు దరిసించిన పంగుండు జంఘాలుండగు, బధిరుండు దూరశ్రావియగు, నచక్షుం డబ్జలోచనుండగు, మూఁగ నైగమవాద విదగ్ధుండగు, పుత్రసుఖంబు నేరని పొలఁతి బహుపుత్ర పరిష్వంగ పులకితాంగియగు, శేషాచలంబున నీరంధ్రంబగు భక్తిగల్గిన తత్తత్కామితంబులు సిద్ధించు; సకల సురమండలీ మందార మాలాపరాగ పరిష్కృతపాదుండగు ననంతు నర్చావతారంబైన శేషఫణి శైల మాహాత్మ్యం బామూలాగ్రంబెవ్వఁ డెఱుంగు నది యుగభేదంబుల రూపభేదంబుల నెసంగు, నొకప్పుడది జ్ఞానరూపంబు, మఱొకతరి రత్నమయంబు, కాలాంతరంబున శ్రియఃపతియగు శ్రీనివాసు నింబోలి నిరతిశయ భూషణోజ్జ్వలంబు. కలియుగంబునఁ బ్రాకృత గిరిరూపంబున పంచజన సంచిత పాప సంచయంబు లడంచు, మహామునులారా! వేంకటాచల మాహాత్మ్య నిరూపణంబున నుత్ప్రేక్ష స్వభావోక్తి యగునన్న, పరమ పురుష యశోగాథా బోధనావిధేయుండగు సూతుంగని మహర్షు లిట్లనిరి. 183

తే.గీ. అమృత మాత్రంబుననె దృప్తి యందదంట
నరుని చిరపుణ్యములఁ జేసి దొఱకె నేని
యత్యమృతమైన హరికథ లాలకించి
చాలునను వార లీ రసాస్థలినిఁ గలరె?

సీ. ఐహిక సుఖముల కవతంస మందురు
రమణీ రసార్ద్ర సౌరత విభూతి
యమృతాంధసులు గూడ నంగనా నయన మి
థ్యాబాష్ప చలిత ధైర్యముల వార
లా సుఖములు దేహి కంత సంతోషావ
హములగుటకు హేతు, వందు నిత్య
మైన బ్రహ్మములోని యానంద లేశంబు
గలుగుట యంచుఁ బెద్దల వచస్సు,

తే.గీ. శ్రవణ సంకీర్తనమ్ములు జరుగు చోట
నా పరబ్రహ్మ నర్తించు నఖిల కళల
నట్టి యనుభవమునఁ దృప్తి యయ్యె ననుచు
వేఱు దలఁచెడు మనుజులు వెఱ్ఱివారు.

సీ. విధి విహితంబుగాఁ బితృ కార్యములు సల్ప
నవశులై శప్తులైనట్టివారు
కలిమి కొఱంత యజ్ఞమ్ముల దేవతా
దులఁ దన్పఁగాలేక నలగువారు
పలుకరానట్టి పాపములతో గతి యేమి
యని దీనముగ మిన్నుగనెడు వార
లార్గురు శత్రుల కగ్గమై తప్పించు
కొనలేక సిలుఁగుల బెనఁగువారు

తే.గీ. పతిత పావనుఁ డైనట్టి భద్రమూర్తి
శేషశైలాధినాథుండు శ్రీనివాసు
సత్కథా శ్రవణంబు యజ్ఞంబునందు
భాగము వహించి, కొంద్రు కైవల్య సిద్ధి. 186

శా. వైకుంఠంబునఁ గాదు, యోగి హృదయాబ్జాతంబులన్ గాదు, ని
ష్ఠా కష్టాకుల యాయజూక కులభాస్వద్వేదులన్ గాదు, నే
త్రా కల్పార్ద్రి ముదశ్రు సంకలిత భక్తవ్రాత సంకీర్తన
శ్రీ కల్యాణ సదస్సులన్ నిలుచు లక్ష్మీనాథుఁ డాకృష్టుఁడై. 187

కం. పలుకుము హరి చరితంబులు,
పలు పుట్టల పాపపంక్తి పాయలు వీడన్
విలువైన యెఱుకవై, మది
యలఁతలు దీర్పంగ బ్రాప్తమైతివి సూతా! 188

తే.గీ. అనిన వినయామృతంబక్షులందుజాఱ
శిరమువంచి నమస్కృతిసేసి బాద
రాయణునకు మహర్షుల కర్థిమ్రొక్కి
పలికె సూతుండు సర్వాంగపులకితుండు. 189

శా. ఆ సూర్యుండె తమోవిభేదన పటిష్ఠానంతదీప్ర ప్రభాఽ
భీషుస్ఫూర్జితుఁ డయ్యె, నాశ్రితదయావిష్టాంతరంగుండు ర
థ్యాసంచోదనమందు నయ్యరుణు కీర్త్యాలేపుగావించు న
ట్లే సమ్మానము, త్వద్దయాభరముసుండీ! మౌనిబృందారకుల్ 190

ఆ.వె. ఆత్మతత్వవేదులైనట్టి పెద్దల
వలన విన్నయంత తెలిసినంత
చెప్పఁగలిగినంతఁ జెప్పెద నారూఢ
మతులు వినుఁడు ధర్మమహితగతులు. 191

మ. కరుణాధీన విశాలనేత్ర! జగతీకల్యాణచారిత్ర! శం
కరజూటేకిపరమ్యపాద! మహిమాఽవాక్సర్వ విద్వేద! దు
స్తరసంసారనదీశపోత! భుజభృచ్చాపక్రుధాధూతక
ర్బురకోలాహల! దేవమౌని మహతీరోచిష్ణు గానాకృతీ! 192

కం. నాదమయ! భక్తినిర్భర
బోధమయ! తపోఽగ్నిరూప! ముహురాశ్రిత ప
త్సాధాశన! వార్షుకముది
రాధః కృద్వర్ణ! నిర్ణయాతిగవర్తీ! 193

మ. కలకాంచీక్వణనోత్కకర్ణములతోఁ, గాదంబరీగర్భగం
ధిల వాగ్గీతులతో గతించినది, యంధీభూతమై యాయువీ
పలితంకారమునందునైన తమితోభావత్కసేవా పరీ
మళితంబయ్యెడుగాత! నా బ్రదుకు ప్రేమగ్రంథి! నారాయణా! 194

ఇది శ్రీపరమ భాగవత పాదరజఃపుంజ విమలీకృత మనో దర్పణ, పితృభూత శ్రీనివాస హృదయతర్పణ, లక్ష్మీదేవీగర్భ శుక్తిముక్తాఫల, నిరంతర నిరంతరాయాష్టాక్షరీమంత్ర మనన స్నాత గంగాజల, భక్తిరసైకజీవన, శఠమర్షణ గోత్రపావన, నారాయణదాస ప్రణీతంబైన శ్రీనివాస ప్రబంధంబునఁ జతుర్థాశ్వాసము సంపూర్ణము.

శ్రీనివాస ప్రబంధము

పంచమాశ్వాసము

శ్రీ రామాయణ కలశీ
వారాంనిధిశయన! భక్తిపర హృద్విలస
న్నారాయణ! పాండిత్య
స్ఫారవచోదూర! రామచంద్ర నృపాలా! 1

మ. హరిదశ్వాన్వయ గణ్యపుణ్యఖని; దేవాధీశ సంప్రీణన
స్ఫురదవ్యాహత విక్రముండు, జగతీశుద్ధాంత కీర్త్యంగనా
దరహాసాయిత చంద్రికాచ్ఛవిలసద్ధర్మాభిరాముండు, శ్రీ
హరిభక్తాగ్రణి యొప్పుఁ బంక్తిరథుఁ డుద్యచ్ఛాంతి సాచివ్యుఁడై. 2

ఉ. ప్రాసగు విత్తువంటి రవి వంశమునన్ జననంబు, సత్తపో
భాసురుఁ డవ్వసిష్ఠుఁడు శుభంకరుఁడైన పురోధ, శేముషీ
మాసర కార్యతంత్రుఁడు సుమంత్రుఁడు మంత్రి, యుపేంద్రు
నంతవాఁ
డాసలఁ జేరు నెచ్చెలి, యనాప్తము వైభవమేది జేనికిన్? 3

శా. ఆ యిక్ష్వాకుల వంశదైవమయి, శేషాభోగ భాస్వన్మణి
చ్ఛాయాసుందరుఁడై, పదాబ్జయుగళీ సంవాహన ప్రక్రియా
శ్రీయుక్శ్రీయుతుఁడైన దైవము, ముహుస్సేవాదయాస్యంది, వీ
క్షాయత్తుండయి, కార్యమున్ బనుప రాజ్యంబొప్పు నవ్వానికిన్. 4

సీ. ఆతనికి సద్గుణావృత దివ్య చారిత్ర
పరగుఁ గౌసల్యయన్ బట్టమహిషి,
మృదుల విస్మేర సుమిత్ర రెండవ భార్య
యాభిజాత్యానురూపాభిరామ,
విపులక్షమావతి; యపురూపమైనట్టి
నలువులకెల్లఁ గాణాచి కైక,
యతని మూఁడవ భార్య, యనితరప్రాప్య సౌ
భాగ్య మామెది, ధరావల్లభుండు

తే.గీ. ముగురు భార్యలయందు సమ్మోదతుంద
పరిమృజుం డజసుతుఁడు, దీవ్యత్స్వరోచి
పొదివి, తార్తీయ పురుషార్థమును భజించె
నబ్దసాహస్రములు లిప్తలై గతించె. 5

చం. కలుగనెలేదు, వంగడపుఁ గాంతిసుతుం డొకఁడైన; చింతతో
మలయుచు నుండె భూపతి, కుమారిలె నంతిపురమ్ము, ధారుణీ
లలన, దృగంత విస్ఫురితలాలసయై, యొక కుఱ్ఱరాజు ను
జ్జ్వల విపులాంసుఁ గోరె సహసాపులకీకృతదేహయష్టియై 6

తే.గీ. దశరథుండశ్వమేధ మధ్వరము సేసి
యింపుగులుక భాగ్యమ్ముఁ బండింపఁ దలఁచె
నవ్వసిష్ఠుఁడు, నంతవాఁడైన వామ
దేవుఁడును సమ్మతింపఁగా దీప్తమతులు. 7

వ. ఆ సమయంబున విభండకసుతుండు, రోమపాదుజామాత, శాం
తాస్వాంతాధినాథుండు, ఋశ్యశృంగుండను మహాముని, తేజం
బున నెవ్వరికంటె నధికుండై యుండు; నతని రప్పించి జన్నంబు
వ్రేల్చిన రఘుకులంబు పండునన్న వసిష్ఠులమాట పాటించి రోమ
పాదానుమతంబున నతని నాహ్వానించిన. 8

సీ. శాంతమ్ములైన నిచ్చలపుఁజూపులు తపోఽ
భ్యధికముల్, మెఱపుల నవఘళింప,
వెనువెంటగల శిష్యగణవేదవాదముల్
వితతగంభీరగర్జితము లెనయ,
జరఠజటాకుటీ సాంద్రరోచులు వర్ష
ధారాధవళకాంతిఁ బ్రసరింప
వానకోయిల వోలె వనజాక్షి ధర్మగే
హిని, బడి బడిఁ జూచికొనుచు రాఁగ

తే.గీ. పుణ్య సలిలంబులకుఁ దనమోము వాచి
యున్న, రవివంశకేదార ముల్లసిల్ల
నొక మహాప్రావృషేణ్యపయోధరంబు
వోలె నడతెంచె ముని, దయాపూర్ణుఁ డగుచు. 9

శా. ఆ గేస్తుండు వహింప ఋత్విజుఁడు గానామ్నాయ ధర్మానుశి
క్షా గిరుద్యతుఁ డవ్వసిష్ఠుఁడు సమీక్షన్ జేయ, భార్యాత్రయ
శ్రీగణ్యుండగు సర్వమాన్యుఁ డొనర్చెన్ వాజిమేధంబు, ధూ
మ్యాగండూషితభూమి; యజ్ఞభుజు "లాహా!"యంచు నగ్గింపఁగన్.

శా. ఆ రాజేంద్రునిదైన యజ్ఞమున యందవ్యాహత ప్రక్రియా
ప్రారబ్ధంబగు నన్నదానమున సర్వక్షోణి హర్షించె; లో
పారోపోత్సుకవావదూకములు; త్రుట్యద్ధైర్యముల్ వాఱె; నా
నా రక్షస్సులు; శక్తిజాతధిషణా నారాచ సాతంకముల్. 11

శా. జ్వాలాలంకృతహవ్యవాహముఖతస్సంపాదితాఽఖండహ
వ్యాలేహుల్: సురసంఘముల్; సుధకు మేలైయున్నదీ బోనమం,
చీలాగెక్కుడఁ గానమంచు నమరీహేలావిపంచీ స్వనాం
తా లీనంబుగఁ బాడి, రంత గళదఘ్నాఽదభ్ర హర్షంబునన్. 12

ఉ. ఆ తటి యజ్ఞరూపుఁడయి, యచ్చటఁ బొల్చిన విష్ణు, వర్ధిజా
మాత, వసిష్ఠమౌని నిగమస్వనమండిత వీచిమండలీ
ద్యోతితరమ్య వారి సరయూ పవనంబులు గోరి, రాక్షస
వ్రాతవధోత్సుకుండట, భవంబు దలంచె నశీకమర్త్యుఁడై. 13

ఉ. ఆ తలఁ పవ్వసిష్ఠు హృదయమ్మున, క్రొత్తడి యయ్యరుంధతీ
చేతమునందుఁ దోఁప, నదసీయము జన్మము, దివ్యగంగ నీ
భూతలి దించినట్టి రవిపూర్వక వంశముగాక, యన్యముల్
ప్రాతియె నోచనంచు, నితరాందరహాసములయ్యె వక్త్రముల్. 14

శా. ఆవేళన్ దవపావకోపమతపస్యా తీవ్రకీలా త్రస
ద్దేవానీకముహుః ప్రచోదిత గిరాందేవీ ధవాసాదిత
వ్యావల్గద్వరగర్వ మాంసలితదోః ప్రౌఢుండు, నైలింప కాం
తా విత్రాసకుఁడైన రావణుఁడు దా ధట్టించె లోకంబులన్. 15

మ. సమరాటోప పరాస్త కోణపుఁడు దుష్యంతుండు, కీర్త్యంగనా
కమనుండైన గయుండు, వైరినృపతి గ్రామణ్యుదారాబ్జరా
గమహస్స్రక్త కిరీట సంఘటిత పత్కంజాతుఁడౌ గాధియున్
క్షము లెవ్వారును గాకపోయి రసురస్వామిన్ విభాళింపఁగన్. 16

మ. ప్రమదోద్దీపక హావభావలలితోర్వశ్యంగ సంభావనా
క్రమితాఽ హస్తతియౌ పురూరవుఁడు, రక్షస్స్వామి మౌర్వీ నినా
దములం దచ్చర గిల్కుటందియల గీతశ్రేణి భావించెనో!
నమితుండయ్యెఁ గృతాపరాధభయభిన్నస్విన్నచిత్తంబునన్. 17

మ. ప్రతివీరప్రమదాకపోలమకరీ పాటచ్చరంబుల్, దశా
స్యతతోద్యజ్జయగీతికల్, శ్రవణశశ్వద్వ్యాధి గల్పించినన్
శతమన్యుండు, వళక్షసింధురవపు స్సంస్ఫాలన ప్రక్రియా
యతకార్కశ్యము చెక్కుటన్ దివడు హస్తాబ్జంబు నిట్టూర్పులన్.

శా. శైవాచార విచారపారగుఁడు, రక్షస్స్వామి మ్రోయించు వీ
ణావిర్భూతఘుమంఘుమారభటి కానందించినన్, బ్రావృషాం
భోవాహ ప్రతిమానతన్ముఖసముద్భూతక్రుధాకీల వీ
క్షా విత్రస్తసుపర్వపణ్యయువతుల్ కంపింతు రభ్రంబునన్. 19

మ. దనుజాధీశుఁడు త్రోవలడ్డికొని, యుద్దండించి, దేవాంగనా
జనగండస్థలదర్పణంబులపయిన్ జాతుర్యధుర్యంబు గాఁ
దనవిక్రాంతుల కోడి పాటెడు మరుత్వన్మూర్తిఁ జిత్రించు, కాం
చనభూ భృత్కమనీయగైరిక శిలాసంకీర్ణ వర్ణంబులన్. 20

శా. వేదాభ్యాసమొనర్చు శ్రోత్రియుల దా వేధించు, నర్థాంతరా
పాదివ్యాకృతు లుగ్గడించి, మునులన్ బంధించు యూపంబులన్
యాదఃపాలసతీఘనస్తనతటీ హారావళీమౌక్తికా
హ్లాదంబుల్ పలలాశిశంభళులచే, నయ్యేన్ బరాభూతముల్. 21

మ. దనుజాధీశుఁ డులిన్ గ్రహించి, ఘనవింధ్యగ్రావముల్ తొల్చి ని
ల్పును, బైపైసురసుందరీ వితతులన్, లోలాక్షివక్త్రాబ్జలన్
దనుసంతాన రసోపగూహనవశద్రాగ్విస్రసద్వస్త్రలన్
కనదుత్తుంగ కుచస్థలీగతనఖాంకాంకూర రమ్యంబుగన్. 22

మ. స్వరకన్యామృదుగాత్ర పీడనములన్, జల్పాకుఁడౌ రావణుం
డరుదౌ రాగములన్ సృజించుకొని హాహాముఖ్యగంధర్వులన్
బరిహాసంబులఁ బిల్చి, వల్లకులపై వాయింపఁగాఁ బంచి, ని
ష్కరుణుండై, పడమోదు కొల్వుననె లేశంబైన దోసంబునన్. 23

శా. ఆ సుత్రాముఁడు మున్నొనర్చిన యహల్యాజారతల్ సెప్పి, తా
నా సుత్రామునికన్న నే కొఱయుగాదంచు న్నిరూపించి, కా
మాసక్తుండయి, దండకానన మునీంద్రావాసముల్ సొచ్చి, త
ద్యోషిన్మంగళ శీలదీపముల నుద్యోగించుఁ బోకార్పఁగన్. 24

శా. ఈ రీతిన్ బలలాళివింశతిభుజా హేరాళకండూ భర
స్ఫారౌద్ధత్యములన్, నిలింపసురభి బ్రహ్మణ్య మున్యంగనా
వారాభ్రశుప్లవమాన రూపము లొనర్పన్ లోకజాతంబు, త
త్ప్రారాఽహర్నిశభీతులై సురలు చింతాసంకుచద్వక్త్రులై. 25

శా. క్షీరోదన్వ దనంత భోగపటలీ, శృంగార పర్యంక మం
దారోచత్పులకాఽలి సుందరముగా నంఘ్రిద్వయం బొత్తు ల
క్ష్మీరాజన్ముఖ గంధపారణ సముత్సేకాఽళి శౌండీర్య వీ
క్షారక్తాయిత కోణ నేత్రయుగ భాస్వంతున్ రమావల్లభున్. 26

మ. అవలోకించి, శిరస్సరద్వికచహస్తాబ్జాతులై, దేవ, బ్ర
హ్మ వరోదీర్ణుఁడు రావణాసురుఁడు కల్పాంతాగ్నియున్ బోలె లో
కవితానంబులఁ గాల్పఁగాఁ దొడఁగె, రక్షాశూన్యులై కుంద మా
కు- వినా నిన్నిక లేదు దిక్కనుచు నాక్రోశించి వాపోయినన్. 27

మ- కను లీషద్దరహాస భాసురములై, వైకుంఠ పూ
ర్జనితాత్యంతిక సౌఖ్యవంచితులుగాఁ జన్నట్టి యాత్మీయులం
దనుకంపా మృదులైకచిత్తమున మోమల్లార్చి, పౌలస్త్య నం
దన నిర్యాణము జాగులేదని, రమానాథుండు వాక్రుచ్చినన్. 28

కం. సెలవంది సురలు వోయిన
జలజాక్షుఁడు దక్షిణాక్షి చలనమనోజ్ఞా
వలిత ముఖంబుగ, లక్ష్మి
లలనా మృదుగండతలము, లాలించి యనెన్. 29

శా. విన్నావే కద! రాక్షసాధిప దురావేశంబు, గీర్వాణులన్
గన్నావే కద! దుఃఖభారవహన క్లాంతాత్ములన్, ఆత్మ చే
కొన్నావే కద! వారిఁ బ్రోచు తలఁ పాకుంచత్సితాపాంగని
ర్యన్నవ్యస్మితమూర్తి! మా యశుకు దీరన్ నానవెట్టింపవే! 30

కనదారేచిత నేత్రి! యా దశరథ క్ష్మానాథు పుణ్యంబు పం
డిన దీనాఁటికి, విశ్రవస్సుతుఁడు తీండ్రించెన్ దురాలోకుఁడై;
పనివిందున్; జనియింతు మర్త్యుఁడుగ, నా ప్రౌఢప్రతాపాగ్ని కిం
ధనమై పోయెడు పంక్తికంఠుడు సపుత్ర భ్రాతృ భృత్యంబుగన్.

సదసత్సంశయ గోచర శ్రమణ చర్చా సర్వ సైద్ధాంతికుం
డుదయాస్తాచల మధ్య భూమ్యవిరళద్యుత్యుచ్చల త్కీర్తి, స
త్యదయా శాంతుల కాటపట్టు, నిమివంశాభిఖ్య, వైరివ్రజీ
యదురంత ప్రతిరోధి, యొప్పు జనకుండవ్యాహతైశ్వర్యుఁడై. 32

ఆ రాజన్యుని యింట నీవుదయమై, యస్మన్మహాకార్య దీ
క్షారోచిష్ణు పథమ్మునన్ మెలఁగి దుఃఖ స్విన్న మున్యంగనా
ధారావర్ధిత బాష్పముల్ దుడిచి, సద్యశ్శాంతి గల్పింపు; మాః
కారిత్వచ్చరితమ్ము మర్త్యసుర సంఘమ్ముల్ ప్రశంసింపఁగన్.

అని వచియించి విష్ణుఁడు తనంతఁ దిరోహితుఁడైన, తత్పద
ప్రణిహిత మానసాంబుజ, భవంబునకై తఱివేచె, నిందిరా
జనని, విభండకాత్మజ లసన్మనుమార్గవిజృంభిత ప్రభా
గణ రమణీయ పావకుఁ డొకానొక పూరుషుఁడై సవంబునన్. 34

ఆ మనుమార్గుఁడౌ దశరథావనిభర్తకు ముందునిల్చి, వీ
క్షా మృదుమందహాస సుముఖంబుగఁ జూచి, శుభవ్రజంబు ని
స్సీమము బండఁగా శయకుశేశయ పాత్రిక నిచ్చి, పంచుమో
యీ! మహిపాల! యియ్యమృత మిచ్చను, భార్యలకంచుఁ బోయి
నన్. 35

ఆ మహిపాలుఁడు భార్యల
కామోదనిలీన హృదయుఁడై పంచిన, త
ద్భామా దౌహృద లక్షణ
మామోదిత నాకిహృదయమై యొప్పారెన్. ౩౬

మ. జనియించెన్ మురఘస్మరుండు, ధర, కౌసల్యాపయోజాస్యకున్
ప్రణతత్రాతమనోనుకూల రసస్రామాజ్యంబు, దృప్యన్నిశా
ట నితంబిన్యభిరామ కంఠరుచిలుంటాకంబు, మౌనీంద్ర సా
ధనసర్వస్వము, వేదపూరుషునకైదంభూమి, రాముండుగన్. 37

శా. ఆ లోలాక్షికిఁ గేకయీసుత కనన్యాయత్తసత్కీర్తి ల
క్ష్మీ లీలాదరహాస చంద్రకిత దిగ్దేశుండు వేశాయిత
ప్రాలేయాచల ధైర్యరిక్థుఁడు, వివస్వద్వంశదీవ్యత్తనీ
సాలగ్రామము, ప్రావృషేణ్య జలదశ్యామాయితాంగంబుగన్. 38

కం. తనయుఁడు గలిగిన భరతుం
డని పిలిచె వసిష్ఠమౌని, యా కైక, దృగం
తనిభృతలజ్జాసుందర,
పణాయితముసేసె, నృపుని భాగ్యభరంబున్. 39

చం. మితహిత సూనృతోక్తికి సుమిత్రకుఁ గల్గిరి పుత్రులిర్వురా
దృతవినయైక భూషలు, సుధీపరితోషులు, చాపసాహితీ
వితతయశుల్, మహౌజసగవిష్ఠులు, లక్ష్మణుఁడన్న పేర, సం
స్తుతమతి, చంచలారుచి విశోభిశరీరుఁడు పెద్దవాఁడుగన్. 40

తే.గీ. నాలుగవవాఁడు శత్రుఘ్నుఁ డీశితప్ర
వర్తనుఁడు, నల్వురునింటఁ బ్రభవమంది
నట్టి నారాయణునిజూచి యానటద్భ్రు
దంతరుండయ్యె దశరథుం డనుసవంబు. 41

శా. ఆ యిక్ష్వాకుని నుండి యీ దశరథుండంతమ్ముగా, ధర్మ దీ
క్షాయత్తుల్, రఘువంశరాజుల తపస్యావృత్తి సాకారమై
యీయుర్విన్ బ్రభవించినట్లలరు, తాదృక్పుత్రులంజూచి, యీ
హాయుక్తంబులు సందడించిన వయోధ్యాపత్తనీచిత్తముల్. 42

సీ. కౌసల్య పొదిగిటఁ గనుమూయు భరతుఁడిం
దీవరంబందు నిందిందిరమ్ము;
కైకమ్మ చెప్పినగాని మోపఁడు శరా
సనలస్తకమున హస్తంబు రాముఁ,
డాభరతునితోడి యాట పాటలుదప్ప,
శత్రుఘ్నుఁ డితరమ్ము సరకుసేయఁ,
డా సుమిత్రాదేవి యక్షుల కొక్కొక్క
పుత్రుండు, పీయూష పూర్ణఘటము

తే.గీ. తపము జీవితమైన నిద్దంపు ఋషుల
కావసిష్ఠుల కహరహం బఖిలతపము
రామభద్రావతార నిర్వాణమయ్యె
భవుని మనసెల్ల తారక బ్రహ్మమయ్యె. 43

తే.గీ. చాపమును బూనుచో వివస్వంతు జోడు,
చల్లగానవ్వ నిండు జాబిల్లికీడు
బాలరాముని జూచు నాప్రజకు మింటి
యర్యమేందులు పునరుక్తి యట్లుఁ దోఁచె. 44

సీ. రావోయి! రఘురాజ! రా వంశనిస్తార
కా! యంచు సుతుని కైకమ్మ పిలుచు,
మత్పూర్వ పుణ్య సాంప్రత ఫలరూప! యు
జ్జ్వలశీల! యంచుఁ గౌసల్య పిలుచు
త్యాగైక మూర్తి! యూహాతీత చిత్రవ
ర్తన! యంచును సుమిత్ర జనని పిలుచు,
ప్రాణజీవంజీవ పరిపూర్ణ చంద్ర! ర
మ్యాకార! యని పిత, యటమటించు,

తే.గీ. నలలు లేని సుధావార్ధి, యావసిష్ఠు
లందురొకసారి రామభద్రా! యటంచు
నందఱకు నన్నిరూపులై యలరు రాముఁ
డఖిల రసభూమి యానందమైన కతన. 45

మ. స్థల పద్మమ్ముల బోలు నంఘ్రుల, వివస్వ ద్వంశవక్షస్స్థలీ
లలిత ప్రక్రమ కేళిఁ బూనెనట; లీలాలోల శ్రుత్యంత ని
శ్చల దీపంబని, యెవ్వరో మును 'ఉవాచల్' సేసి విన్పించినన్
జ్వలదర్కోపమ సత్తపోఽధికుఁడు విశ్వామిత్రుఁ డుత్సాహియై.

సీ. కపిల జటాజూట కాంతి నాశల ననా
 ర్తవ పల్లవ వ్రజం బవఘళింప,
నిండార విరిసిన పుండరీక నిభమ్ము
 భస్మమ్ము మంజరీ పటలి నెఱప,
వల్లకీ పంచమస్వర జటాధ్యాపన
 కృతులు, కోకిల కుహూకృతులు దెలుప,
నివతళించిన యట్టి యీక్షణమ్ములు, మధు
 ద్రవసిక్త మధుప సంతతులఁ బోల

తే.గీ. బాలరాముని దివ్య జీవనము గొలువఁ
దనువు సేకొన్న యొక్క వసంతమ్ము వోలె,
నపుడు గాధేయుఁ డతుల రసాభిరామ
చరితములవాఁడయోధ్యకై తరలివచ్చె. 47

కం. వచ్చిన మునిపతి కెదురుగ
వచ్చి కిరీటమ్ము మోవఁ బదములఁ బడి, శా
స్త్రోచ్చరిత మార్గమున నృపుఁ
డుచ్చైః పూజల నొనర్చె, నుల్లము దనియన్. 48

తే.గీ. ఆ వసిష్ఠ విశ్వామిత్రు లనవధిక, ము
దార్ద్రముగఁ గౌగలించుకొన్నపుడు జరత
నయనముల రాలినట్టి యానందజలము
సరయువునకన్న ప్రయతితో సరణి మించె. 49

సీ. ఇతఁడు బ్రహ్మర్షిసుండీ క్షత్రవృత్తి బ్రా
హ్మంబు పండించిన యద్వితీయుఁ
డీ వసిష్ఠులు నన్ను నెలమి బ్రహ్మర్షి సే
సినవారు, నాకు సంజీవకరణి,
యని పరస్పర గౌరవాభిజాత్యమ్ముగ
భాషించికొనెడు నప్పరమ సంయ
ములఁ జూచి, దొడ్డవారల మనస్సులు పూవు
లో! వజ్రములో! తెల్పఁత్రోవ దోఁప

తే.గీ. కపుడు సభ్యులు నివ్వెఱగంది రుభయ
మౌని వేదాధ్యయన శూరులైన వటువు
లల్లనల్లన బొమ్మలల్లార్చి, యార్చి
యిది శమంబని రామోదమ్మృదితమతులు. 50

మ. తులితోక్షధ్వజుఁడైన గాధిసుతుఁ బ్రద్యోతన్మణికాంతి, పి
చ్ఛిల చంద్రాతపమైన గద్దెపయి నాసీనుండుగాఁజేసి, త
జ్జలజాతోపమ పద్వయీతల మనాక్సంవాహన ప్రక్రియా
కులహస్తుండగు రాజువల్కె, వినయక్రోడీకృదార్ద్రంబుగన్. 51

చం. అఱువదివేలయేండ్ల బ్రదుకంతయు సార్థకమయ్యె, నేఁటికీ
చరణతలమ్ములంటు ఫలసంగతిఁజేసి, తపశ్శతార! యీ
వరవుని కేమియానతి! వివస్వదభీషమహౌజసుల్, కృతా
ధ్వరు, లగు మత్పితల్ దనియఁ బాలనసేతు యథోచితంబుగన్.

మ. అనినన్ జిన్నని నవ్వు శ్రీముఖమునం దందంబు జిందింపఁ, జి
క్కని కన్బొమ్మల నార్చి, మౌనియనె, నిక్కంబోయి! సూర్యాన్వయా
వనినాథుల్, సముదార విక్రమకళాప్రౌఢి ప్రియంభావుకుల్
తనువుల్ ధర్మములైనవారలు, మునీంద్రస్వస్తికృద్వర్తనుల్. 53

మ. ఒక యజ్ఞంబు వహించి, సిద్ధికయి నే నుద్యుక్తుఁడైనంత, మా
మక హృత్కుండముమండిపో, నసురు లున్మత్తప్రవృత్తుల్,పలా
లకదుష్ట క్షతజాసవంబులను బెల్చన్దెచ్చి వర్షింతు, రా
సకలార్చ్యుండగు హవ్యవాహుఁడు, తితిక్షాహీన్యుఁడై,కుందఁగన్.

ఉ. ఆ చలపాదులెవ్వరని యందువా! భూపవరేణ్య! వారు మా
రీచ సుబాహు, లీభువికరిష్టులు, గర్వితపీవరాంస శై
వాచల మూలతోద్ధరణమౌ తతకీర్తివిలాసినీ విలా
సాచితమూర్తి, రావణున కాప్తులు, బంధు లనల్పవిక్రముల్. 55

ఉ. శాప మొసంగి, వారి కవసాద మొనర్చ తలంపులేదు, క్రో
ధాపణపణ్యమై హృదయమా చిఱునాళులఁబడ్డ వేదనల్
జ్ఞాపకమింతవచ్చిన, వికారనికార విశీర్ణమౌ తలం,
పో పృథివీశ! నీవాకఁడ వుల్లమునన్ మెదలాడి వచ్చితిన్. 56

మ. అలకభ్రాజిత గండమండలము వాఁడబ్జాక్షనీకాశుఁడా
కులమున్ జేయునుగాత మద్విమతరక్షోవ్రాతమున్! ప్రేమ చా
పలముల్బాపకు పిన్నవాఁడనుచు, శాబంబైన హర్యక్ష ము
త్కలికన్ దూకదె! గంధసింధుర సమీక్షామాత్రసంరంభియై. 57

చం. పిటికితనంపుగుండె ప్రభవించునె మీ కులమందు! నన్యమున్
మఱచి, విలాకు సెందకుము, మా కనుసీడల సంచరించు నీ
చిఱుతని, దేవదానవులు సేరి యెదిర్చిన నిల్వనేర్తురే!
నరపతి! మాదు యాచ్ఞకు, వినాకృతిలేదు జగత్త్రియంబునన్. 58

కుమోయి రాముఁడననెవ్వఁడొ! తీవ్రతపస్సమాధి ని
గు మేము, బ్రహ్మమయభావులు మీ గురు, లయ్యరుంధతీ
వి త్రి, నీ యెఱుక, వార్ధక మేఘమహాశ్మరీర సుం
—భవత్సుతుండనిక దా! మఱి యంతకుమించి యున్నదే!

బనంపుము, నీకు మేలుగలదని వచించిన, పర్యశ్రు నేత్రుం
దశరథుండు కులగురుల నీక్షింప; నాజాడఁ గనుంగొని
డిట్లనియె:

ప్రస్తుత హవ్యవాహనిభు విశ్వామిత్రు నేపాటిగా
కించితివోయి పిచ్చిప్రభువా! యాతండు సర్వాస్త్ర వీ
న్యుండు, జగత్త్రియీలవననిర్మాణక్రియాదక్ష రూ
సి భ్రుకుటీనిరంకుశుఁడు-వాచాపర్యయం బొప్పునే! 61

ము నీ కుమారుల నహర్పతివంశ మితోధిక ప్రభా
తమ్ముగాఁగ, శతశశ్శుభగంధిలుఁ డౌచువచ్చు నీ
క రాముఁడింటి – కసహాయపరాక్రమయావకక్రియా
పేత-కీర్తిజలజాత నివాసిని వెంట నంటఁగన్. 62

గురు ననుమతితో
తన్ దొలఁగి నృపతి యంపెన్, వీర్య
, జగత్త్రియీ ని
, విద్యాధిగతవివేకుల, సుతులన్. 63

నిమౌళి దివ్యచరణాబ్జ నిషిక్తనిరీక్షణుల్, భుజా
తోరు చాపు, లతసీకుసుమచ్ఛవి యొక్కవాఁడు, వీ
విన్ధ్యభూమసృణ కంధరసుందర సౌధచంచలో
శరీరి యొక్కరుఁడు, ధైర్యమహాద్రులు, రామలక్ష్మణుల్.

ఉ. పోయిరి మౌనితో భువనమోహనశీలురు, మత్తసామజ
ప్రాయులు, లంబమానఫణిరాజ సదృక్షవినీల రూక్షకౌ
క్షేయకు, లోష్ఠబింబపరిషిక్తమృదుస్మితు, లత్యుదార వా
చాయుతు, లంఘ్రిపద్మ పరిసర్పణ పూతధరాహృదంతరుల్. 65

ఉ. ఓ యన మౌని వెంట, సరయూజల శీతల గంధవాహ శి
క్షాయుగప, ద్వినృత్య దలికస్థల కుంతలు, లాత్త పుణ్యచే
తోయుగపూర్వదర్శనులు, ధూర్వహులున్, జతురంతయాన శో
భాయుత వక్షు, లున్మథిత పాపులు, పోయిరి, రామలక్ష్మణుల్. 66

కం. బలయు నతిబలయు నను వి
ద్యలు రెంటి నొసంగె మౌని, తతవినయ సుగం
ధిలశౌర్యన, కవిరత దు
ర్లలిత దనుజ మథనుఁడైన రఘుచంద్రునకున్. 67

సీ. భీమ కాంతములైన పృథుగుణంబుల నధృ
ష్యుఁడు, నభిగమ్యుఁడై పుడమియందు
నెవ్వరికంటె సమిద్ధ తేజుండు, వి
శ్వామిత్రుఁ డనురాగ శబల హృదయుఁ
డై, ముహుర్ముహురాశ్రితామృతమ్ముగఁ గ్రొత్త
చెలువు సంబోధనంబుల నొనర్ప
సరయూతరంగిణీ సరస దక్షిణ కూల
ముల వెంట, తత్పక్షి కుల నినాద

తే.గీ. ములు, శ్రవంబుల కామోదమును ఘటింపఁ
జాప సుందరు, లభిరామ శాతశార
మేచకాపాంగు, లాశ్రిత మృదు హృదయులు,
నడువఁ దొడఁగిరి, రామలక్ష్మణులు ప్రీతి; 68

ఉ. ఆదరణీయ సార వివిధాఽక్షర రమ్యతతోడ, వేదవి
ద్యాదయితుండు, నైకము లుదారకథల్ వచియింపఁ, దద్రసా
స్వాద నిబద్ధ చిత్తులు, ప్రసన్న కథాకలితార్థ యుక్తికిన్
మోదము పల్లవింప, రఘుపుత్రులు 'బేస'ని మెచ్చిరిమ్మొగన్. 69

మ. రవి వంశాఽవని భృన్మహాధ్వర హవిర్ధారా పరిష్వంగ సం
స్తవనీ యామృతమూర్తి యైన సరయూచంచత్సరోజాక్షి, జా
హ్నవితో ముచ్చటలాడు వాలకములన్ దాఁజూచి, వందించి, రా
ఘవుఁ డాచెంతల నొక్కయాశ్రమము, రిక్తంబున్, విలోకించు
చున్. 70

మ. సకలాఽభిష్టుత సద్రసాశ్రయ తపస్యాశీలి; బ్రహ్మర్షి వం
శకరీరా! పతివంచితంబయిన యోషా జీవితంబట్లు మా
మకచిత్తంబు గలంచు నియ్యుటజ, మే మౌనీంద్రులందుండ్డి, ని
ల్వక తామేగిరొ! యానతిండనియె, భావస్నిగ్ధ నేత్రంబులన్. 71

మ. వినవోయీ! రఘువంశ పుణ్యజని! మున్ విశ్వేశుఁ డీయాశ్రమం
బున, దీర్ఘంబు తపంబు వట్టి నిలిచెన్, బుత్రార్థులై దేవతల్
వినతాఽహార్యవిశాల ధైర్యుఁడగు నా విశ్వేశు చిత్తంబు ద్రి
ప్పను మార్గంబటి, మిన్నకుండిరి భయవ్యాకీర్ణ వక్త్రింబులన్. 72

చం. ఒకదెసఁ దారకుండు సురయోధుల వందఱలాడఁ, బావకాం
బకుఁడు దపంబునన్ నిలువ, వైరిసహాక్షముఁడైన నేతకై
తికమకలాడు దేవతల దీనతఁ గాంచి విరించి, జాగులే
దిక యని యూరడించుచు సమీహితకార్యము లోఁ దలంచినన్.73

మ. సవభూమిన్, దన తండ్రి చేసిన యవజ్ఞావృత్తి, రోసంబు వె
న్దవులన్, యోగకృశానుసాత్కృతము గాత్రంబైన రుద్రాణి,యీ
యవనిన్ జన్మముఁగోరి, తండ్రిగఁ దుషారాద్రిన్ బ్రశంసించి,సం
స్తవనీయంబగు రూపమున్ బడసెఁ, దజ్జాయాపురాభాగ్యమై. 74

ఉ. ఆ యుమ, యీ మహేశ్వరునకంతి సపర్యలొనర్ప, మన్మథుం
డా యువతీలలామ మృదుహాస నిరీక్షణ ధృష్టధైర్యుఁడై
కోయిల గంట పెల్లులయఁ, గోయనియార్చి, ప్రమత్తభృంగ మౌ
ర్వీయుత మిక్షుచాపము ధరించి, దురుద్యమ సాహసంబునన్. 75

చం. ప్రసవక లంబకంబు దొడి, భర్గునిప్రేయ, వికారరేఖ మా
నసము గలంపఁ, గ్రోధపరిణాహ సమున్మిషితాలికాక్షుఁడై
దెసలభివీక్ష సేసిన, రతిప్రమదావలయాంక సుందరుం
డసమశరుండు, భస్మమయమయ్యె; దివాకరవంశమండనా! 76

ఉ. అప్పటినుండియున్, మదనుఁడయ్యె ననంగుఁడు బ్రహ్మతోడుగా
నప్పురుహూతుఁడంత నమరావళి బాధలు విన్నవించినన్
ముప్పు దొలంగఁ ద్రోయఁగ, విముగ్ధ హిమాంశుకలాకలాపి, తా
నప్పుడు సమ్మతించె భవుఁడద్రిసుతాప్రణయానుబంధమున్. 77

కం. జరిగె వివాహము, గిరిజా
పరశివులకుఁ, గార్తికేయ భవమున్ దీటెన్
సురముని గోనికర సుదు
ష్కరబాధలు, తారకాఖ్యఖలుఁడు నశించెన్. 78

మ. ఇది యీశానపదార్పణోత్సవముచే నీడ్యంబు శైవాశ్రమం
బదయంతారిపు గర్వ నిర్మథన పుణ్యావాస; మిచ్చోట గ
డ్పుదమీరేయి యటంచుఁ గౌశికమునుల్ మోదంబుతోఁ బల్కినన్
మృదువిస్మేరము లామతించినవి భూమీభృత్సుతాస్యంబులన్. 79

ఉ. కౌశికు లేఁగుదెంచిరను కమ్మనివార్తలు, కర్ణమూలముల్
డాసిన, నంతికాశ్రమ తలమ్ముల మౌను లనారతాగమా
భ్యాసపవిత్ర వక్త్రి పరిభాసి మనోహర సాధువాదులై
యాసల వచ్చి రర్ఘ్యముల నాదటఁ బాద్యములన్ గ్రహింపుచున్.

ఉ. వారికి రామలక్ష్మణుల, వంశకరీరుల, దృప్తసింహ సం
చారులఁ, బూరుషోత్తముల సన్మతి వర్ణనసేసి, సత్కథా
పూరములన్, దదాశ్రమ సమున్నత భూజము లంకురింప నా
నారుచిరార్థసూక్తి, మునినాథుఁడు మౌనులఁ దేల్చె ముజ్జిరిన్. 81

చం. గగనతలంబునన్ గరభకంఠకడారము కాంతిఁదోచె, ని
మ్మిగ హరిదంగనామణులు, మేల్కని ముచ్చటలాడఁజూచ్చె, న
భ్రగఖగమండలీకలరవంబు మిషంబునఁజేసి, వీచె యా
మ్యగజకపోలగంధిలములై పవనమ్ములు, మందశీతముల్. 82

శా. లెమ్మోయీ! రఘుమౌళి! తూర్పుదెసలాలించెన్ గిశోరాడ్కవ
క్షమ్మందున్, నిను బుజ్జగించినటు కౌసల్యాజగద్ధాత్రి; రో
సమ్మున్‌జేకొని నీవు రక్కసులఁ జీల్పంబూను కొన్నట్లుఁదా
నమ్మందేహులఁ జీల్చు నర్యముఁడు; క్రోధారుణ్యదుర్దాంతుడై. 83

మ. తతమై కర్ణసుఖంబుగా సొలసె, మంథానధ్వనుల్, నైగమ
వ్రతికాంతాకరకంజజాతములు, గోవ్రాతంబు, త్వద్దర్శ నో
న్నతికై, మోరలు సాచి నిల్చినది, నందాదీపముల్వోని దృ
క్తతితోఁ దల్పము వీడవయ్యా! మిహిరక్షత్రాన్వయాలంకృతీ! 84

మ. సరయూవారికృతావగాహులు, తదబ్జవ్యూహశుంభద్రజో
భరలిప్తాంగులు, చిట్టిపొట్టివడుగుల్, ప్రస్పందదోష్ఠంబుగా
సరవిన్ వల్లెలువేయు, వేదరవముల్ సాగెన్, మరుత్సంగమా
సరముల్, రమ్యవిపంచికాస్వరప్రతిస్పర్థన్ రఘుగ్రామణీ! 85

మ. పలికెన్ వ్యక్త శిరీషకోమల శుకవ్రాతంబు నీవార గం
ధిలముల్ మూతులువిచ్చి, సూర్యకుల సాంద్రీభూత సత్కీర్తులన్;
సలుపంగావలె నిష్ఠ నాహ్నికములన్, జక్షుర్ద్వయీహాస మం
జుల రూపమ్ముగ-లెమ్ము; రాత్రిచరవక్షోభిత్తు లల్లాడఁగన్. 86

మ. అతిమాత్రమ్ముగ దండకాటవులఁ గ్రవ్యాదుల్ వలెన్ వ్యోమ ము
ద్ధతి నాక్రాంతమొనర్చికొన్న తమముల్ దారెన్, జగద్రంజనో
న్నతమై యెప్పుడు రామరాజ్యమటు లానందంబు వర్షించె ది
క్తతి, వాల్గన్నులు విప్పిచూడుము, ధరాకల్యాణి, వీరాగ్రణీ! 87

మ. సమయోపాసిత వేదపూరుషదయాసాచివ్య ప్రత్యక్ష రో
త్తమ భవ్యావహమైన కౌశికునుదాత్తబ్రాహ్మి, దేశాక్షి రా
గమునన్ బల్కఁ గ, తన్మయంబులగు వృక్షవ్రాతముల్, సేసె, శీ
ర్షములల్లార్చుచుఁ దత్ప్రతిధ్వనుల, నాశాకాంతలగ్గింపఁగన్. 88

ఆ. ఋషియనుజ్ఞఁజేసి, యిద్ధతేజుఁడు, రామ
చంద్రుఁడా స్రవంతి జలము దోఁగి
తమ్ముతోడఁ గూడఁ దానాహ్నికంబులు
దీర్చి, ధర్మమయవిదీప్తతనుఁడు. 89

ఉ. పోయిరి మౌనివెంట, రవిపూర్వక వంశరమాకలాపు, లా
మ్నాయ శిఖాకలాప పరిమార్గితవృత్తులు, మౌనిమౌనని
ధ్యాయిత ప్రీతచిత్తులు, తథాపరిభాసికపోలకాంత కౌ
శేయమనాక్స్మిత ద్యుతివశీకృతలోకులు-రామలక్ష్మణుల్. 90

సీ. పోవఁబోవఁగ గర్ణపుట భేదకమ్ముగ
శబ్దించు వనపక్షిజాలముల న
కాండవార్షుక మేఘ గర్జాప్రతిస్పర్ధి
బృంహితాఽనేకప బృందముల, ధ
వాశ్వకర్ణక తిందుకార్జునముఖచిరం
తనవృక్షఖుల్లికాధ్వానముల, న
భంగ ఘాంకార సంభగ్న దిశాఽవకా
శ, తరక్షు సింహాది సత్త్వముల, ని

తే. గీ. లాంతతిమిరాఽవరుద్ధగుహాళిఁ జేసి,
ఫణిఫణాభోగరత్న దీపప్రభాఽ భి
రామమయ్యె, మానసదర|ప్రదము, కానఁ
జూచి, రఘుమౌళి గురులపైఁ జూపునిలిపి. 91

కం. ఏవనమిది ? మృత్యువునకుఁ
దావలమైనట్టిదనినఁ దలనార్చి, కథా
భావన మొనర్చి, పలుకులఁ,
దావులు వెలయించి, కుశికతనయుఁడు వలికెన్. 92

మ. ఒక కష్టంబని చెప్పికొందుమటరా! యుర్వీరుజా, రోధిచా
పకళాసుందర! వృత్రుఁడన్నసుర పూర్వంబొక్కఁడుండెన్, సుర
ప్రకరాలానమహాంసఖర్జువు, నమత్ఫాలాక్షుఁడౌవాని చె
య్దికి, నేయడ్డును లేకపోయినది, మేదిన్యాదిలోకంబులన్. 93

ఉ. వానివధించె శక్రుఁ డొకవంచనతో, నది బ్రహ్మహత్యయై
వానికిఁ జుట్టుకొన్న, దనివారిత నాకపురీసగూహన
శ్రీనిభృతుండు, శక్రుఁడు పురిన్విడి, కంపలఁబడ్డ కాకియై
త్రాణఁదొఱంగి, పొందిన వెతల్, తలపెట్టఁగరాదు రాఘవా! 94

ఉ. ఆకలి నీరువట్టుల ననాశ్రయుఁడై, వెతలొందు నింద్రుడు, లో
కైకసుఖార్పణ ప్రవణమైన తపంబులవారు, మౌనులా
యాకలుషప్రణాళినదులందు మునుంగఁగఁజేసి, వీర్యవ
చ్ఛ్రీకరమంత్రవారి పరిషిక్తశరీరునిఁ జేసి రంతటన్. 95

మ. మలకారూశములిందుఁ బోవిడిచె నమ్మాన్యుండు; నీదేశముల్
ఫలపుష్పావృత సద్వనాశ్రయములై, పర్యంత నృత్యజ్ఝరీ
కలకాంచీరవగుంభితోదరములై, కల్యాణకేదారపి
చ్ఛిల సస్యంబులుగాఁగ నుండ వరమిచ్చెన్వజ్రి, వీరవ్రతీ! 96

ఉ. కొన్ని దినమ్ములిట్లు సనఁ, గ్రూరతకున్ బ్రథమావతార, మ
త్యున్నత మేరుశైలశిఖరోపమవక్షుఁడు, వార్ధికుక్షి, దృ
ప్యన్నయనాగ్నిసాత్కృత సహస్రసతీపతిశీలపల్లవుం
డన్నరభోజి, సుందుఁడను నాతఁడు,దాపురమయ్యె రాఘవా! 97

ఉ. వాఁడుఘటోద్భవుం గుఱిచి వంతలుగూర్చిన, మౌనితిట్టె, నా
మ్రేడితరుద్రమూర్తి, నడమీనముపోల్కి నశించె, దానవుం
డాడుదిగాదు సుమ్మి, ప్రళయాంతకదృక్శిఖ, వాని భార్య గో
డాడఁగఁజేసెఁ దాటక, నిరస్త సమస్త సుఖోదయంబుగన్. 98

తే.గీ. దాని కొమరుండు, మారీచదానవుండు,
తల్లిదండ్రుల మించిన దౌష్ట్యములకు
నాకరము; వాఁడె నా యజ్ఞమందు హవ్య
వాహనుల మాల్చి యవమానపఱచు బఱచు. 99

కం. తల్లియుఁ గొడుకును నిచ్చలు
బల్లెలపైఁ బడఁగ మల్లెవట్టిన చేనై
పల్లటిలి నదీప్రాంతము
హల్లీసక భూమి మృత్యుహసనార్చులకున్. 100

ఉ. వచ్చునొ! యేమొ యింతకును; భద్రము నీకగుఁగాక, యేర్చుకా
ర్చిచ్చును బోని కన్నులది, జీవగవేషిణి తాటకాఖ్య, నీ
వచ్చెరువంది నిల్చెదుసుమా! యొక యాడుది యన్నజాలి, నీ
యచ్చల మార్పఁబోవునొసుమా! పొరపాటగు ధర్మజీవనా! 101

ఉ. ఆకృతిఁగొన్న యట్టి నిటలాక్షుని కోపమువోలు చాపముం
జేకొనుమోయి హస్తమునఁ జిక్కని బాణముఁ బూన్చి వైరి లుం
టాకము, నొక్కవ్రేటునఁబడన్ వధియింపుము, చూడు మల్లదే!
యాకసమందు నిల్చె నమరౌఘము, త్వద్విజయాంకగీతికిన్.102

చం. అనిన రఘుప్రవీరుఁడు మహర్షి పదంబుల కంజలించి, ల
క్ష్మణు దెసఁజూచి, వచ్చునట మానుషఖాదిని! కన్నుగల్గి వ
ర్తన మొనరింపఁగావలయుఁ దమ్ముఁడ! మామకజీవితమ్ము నీ
వని, యెలనవ్వు కన్నుఁగవ నానఁగ, నామతిసేసెఁ
జాపమున్. 103

మ. పశుపత్యుద్ధతరూక్షవీక్షణ నిభప్రాంశుస్ఫురచ్చాపక
ర్కశమౌర్వీ బృహదూర్మికాయుతము, హుంకారమ్ము, వల్గన్నిశా
ట శతారచ్ఛదవైనతేయ ఖరకంఠధ్వానమున్ బోలి, దు
ర్విషహత్రాసవిపాకమూర్ఛితముఁ గావించెన్, దిశాసంహతిన్. 104

సీ. ఖనట దుచ్ఛాయ కర్కరబాహు నృకపాల
చషకకంకణ ఝణంఝణలతోడ,
జఠరాగ్ని రక్తమాంసవసాఽస్రపూతి ధూ
మ్యాస్రా విఘోణాగృహమ్ముతోడఁ,
గల్పాంతవిక్రమోత్కట దండధృక్ఛలాం
గరథాంగ నిభదృగ్యుగమ్ముతోడ,
మృత్యుకుంభోదర ప్రత్యయగ్రాహ్యరో
భవభాస్యసృజ్నిషద్వరముతోడ,

తే గీ. వచ్చెఁ దాటక దశనదుర్వార కషణ
రవ, వదానదఘన గుహావ్రాత యగుచు
నిఖిల ఘనపథవారవాణీ భవత్త
నూమలీమసకాంతి సందోహ యగుచు. 105

ఉ. దానినిఁజూచి రాఘవుఁ డుదాత్తుఁడు, తొయ్యలియన్న జాలి, లో
నూని భుజమ్ములన్ నఱకె, నొక్కట నమ్మది రోసి, బాణసం
ధాన మొనర్చి, లక్ష్మణుఁడు, తచ్ఛ్రవణద్వయ శష్కులీబృహ
ద్ఘోణము లుత్తరించెఁ గనుదోయికిఁ గావులు గండరింపఁగన్. 106

శా. బాధాఘూర్ణిత తారకాద్వితయ విష్వగ్వ్యాంత వహ్నిచ్ఛటా
క్రోధోద్వేల్లితయైన తాటక, ముహుః క్రోశద్విశాలాస్యయై
ప్రోథః ప్రశ్వసితానిలాక్రమిత బభ్రుద్రుమవ్రజగ్రావ, దు
స్సాధుల్ వీరని, కామరూపిణీ, నభస్సంచార శౌండీర్యయై. 107

మ. ఒకచోఁగన్పడి యొక్కచోమఱుగు, సావోద్ధూతపాథోదర
ప్రకరంబుల్, రఘువీరమస్తములపై, వర్షింప నాసారముల్;
వికటాఽహార్య శిలోచ్చయంబులను, దండిన్ జెండు, ధూళీదృష
చ్చకలంబుల్, వగఁగూర్పరక్కసి, యవష్టంభోంభిత
ప్రక్రియన్. 108

ఉ. అప్పుడు మౌనివర్యుఁ, నగవా! తగవా! యిది రామభద్ర! పై
ముప్పగుసుమ్ము! కజ్జలము పూసినయట్లులు, దిక్కులన్నిటన్
గుప్పనఁ గ్రొమ్ముడిన్ విడిచికో నిశియున్నది కాచి, రాత్రిలో
నిప్పటివోలెఁ జిక్కునటవే! పలలాశికి బాణలక్ష్యమై. 109

ఉ. తొల్లి మురాఽసురారి, తజఁ ద్రుంచెనుబో భృగుపత్ని, నింద్రసం
పల్లతికాలవిత్రముగ భావముఁ బూనినదాని, నింద్రుఁడే
తొల్లి విరోచనాత్మజను ద్రుంచెనటంచని, గాథలెన్నియో!
కొల్లలుద్రవ్వి చెప్పితిని కూన! ఫలంబిదియౌనా! వానికిన్. 110

మ అని తీవ్రమ్ముగ నెచ్చరించుచును విశ్వామిత్ర బ్రహ్మర్షి, దో
షనదీష్ణుండయి, కంపితోష్ఠముగ శశ్వద్ధుంకృతుల్ సల్పఁ ది
న్నని నవ్వానినకస్నులన్, శరముసంధానించి, కర్ణేజప
ప్రణతేష్వాసముగాగ వీడె, నమరవ్రాతం బశోకంబుగన్. 111

ఉ. ఆ శరరూపశంబము మహాసురి పేరెదఁ దాఁక, దిక్కులా
క్రోశపిచండిలంబులయి ఘూర్ణిల, రక్కసిగూలె, నాసికా
కోశవినిర్గల ద్రుధిరకుండము లబ్బువియెల్ల నాన్చి, పా
లాశరుచుల్ వెలార్పఁబొరలన్ బొరలన్ మరణవ్యథాస్థితిన్. 112

ఉ. అప్పుడు మౌని, రాఘవుని నక్షులఁ ద్రావెడునట్లు, ప్రేమముల్
ముప్పిరిగాఁగఁ జూచి, వెస మూర్ధము మూర్కొని, రామభద్ర! నీ
విప్పటికైతి శిష్యుఁడ, వహీన మహాస్త్ర మహార్థమెల్ల, నీ
గుప్పిటి నిండుగా నిడుదు; గుప్పుమనన్ యశమెల్లకాలమున్. 113

ఉ. నేఁటికి నీపవిత్రము వనిన్ శయనింతము, తాటకావ్యథా
ఝాటవిముక్తమై, మనసు చల్లఁగఁజేయుచునున్నదన్న, న
మ్మాటల కల్లనవ్వి రఘుమండనుఁ దచ్చటరేయి, సెల్లినన్
బాటలరమ్యుఁడై కమలబంధుఁడు ప్రాగ్గిరినిల్చె, నిల్చినన్. 114

మ. కమలామోద పరీతపాథములఁ జక్కన్ మజ్జనంబాడి, లో
క, మలక్షాళను భాస్కరున్ గుఱిచి యర్ఘ్యంబిచ్చి, పూతత్రయీ
సమయావర్తితదీప్తియై వెలుఁగు నాసావిత్రి సేవించి, సం
యమిపాదంబుల నంటురాముఁగని విశ్వామిత్రు డార్ద్రాక్షుఁడై. 115

మ. వచియించెన్ రఘురామ! మత్కృత తపఃప్రాప్తమ్ములై, విక్రమ
ప్రచురాస్త్రంబులు, మూల్గుచున్నవి సుమా! ప్రాతిస్వికమ్ముల్, ప్రయో
గచణుండీవు గ్రహింపుమన్నిటిని; రక్షస్సంఘ విధ్వంసనో
గ్రచతుష్పాణికి, శోభఁగూర్చునివి, నిఘ్నంబుల్, సమీకంబునన్.

కం. అని ప్రాఙ్ముఖుండుగా న
మ్ముని కూర్చొని, కన్నుఁగవలు ముకుళితముగ నె
మ్మనమున నధిదేవతలన్
బ్రణుతించిన నెదుట నిలచె వహ్నిసమంబుల్. 117

శా. అయ్యస్త్రంబుల రామచంద్రమనకునై ప్రార్థించి, తన్మంత్రముల్
నెయ్యం బారఁగనిచ్చె శిష్యునకు, ధన్విశ్రేష్ఠుఁడా రాఘవుం
డయ్యస్త్రముల మంత్రదేవతల సమ్యక్పూజలందన్పి, సా
హాయ్యంబీరు ఘటింపఁగావలయు నంచాడెన్ శిరఃపాణియై. 118

మ. అవి యంగీకృతిసల్పి యేఁగిన, సహస్యప్రోల్లసద్వ క్షుర్ద్రిదై
యవుగా! దొంగవు, దొంగిలించితివి నాయస్త్రంబు, లింతైన నీ
కవిపూర్ణంబుగ దక్కలేదు శిశువా! యస్త్రోప సంహార వి
ద్యవినా యంకెకురావు సుమ్మ నియె,విశ్వామిత్రుఁడుల్సాహియై. 119

చం. 'తమ దయ' యంచుఁబల్కె గుణధాముఁడు, రాముడు మస్తమర్చి, సం
క్రమిత మృదుస్మితమ్ములగు కన్నులతో,మునిమౌళి,సంస్మృతుల్
గ్రమమునఁ జెప్పుఁదజ్జపపరాయణుఁడౌచుఁ దదస్త్రదేవతా
ప్రమదము సేసి, కాంచె రఘురాజు, తదీయదయాకటాక్షముల్. 120

శా. ఆపైఁబోయిరి గాధినందనులతో, నారామసౌమిత్రు లా
లాపప్రాగ్రహరుండుమౌని, రసకుల్యారమ్యగాథాను వా
దాఽపూర్వంబగు మోదమున్ గొలిపి, యధ్వాయాసమున్ దీర్ప,నా
నాపక్షివ్రజ వల్గునాదమురళీ, నందచ్ఛ్రీవోమండలుల్. 121

చం. సతతమహామహీభరణ జాతతనూ శ్రమనుజ్జగించి కో
మతిఁ దలపోసి, యెక్కెడనిమగ్నతనున్న దిగంతదంతి స
మ్మితమగు దాని, సంతతసమృద్ధఝరీమృదుహాసమౌ క్తి కా
శ్రితమగు నొక్కశైలము, నిరీక్షణ సేసి రఘూద్వహుండనెన్ 122

మ. అదియేశైలము మౌనిమండన? నభస్యాభ్రావళీనీలిమా
స్పదమైయున్నది, వక్షషండ మొకటాప్రాంతమ్ములం, దేశభ
ప్రదుఁ డాయాశ్రమమున్ దొలంగెఁ; గిసలప్రత్యగ్రకాషాయ రు
గ్విధురాఽగమ్ములు,మన్మమ్మునకు నిర్వేదంబు గల్గించెడున్. 123

మ. వినవోయీ! రఘురామ! విష్ణుఁడచటన్ వేయాబ్దవర్షంబు లా
త్మ నిరీక్షాపరమైన యోగమున నధ్యావర్తనుండుండెఁ, ద
ద్ఘననిష్ఠాఫలసిద్ధియైన కతనన్, దానయ్యె సిద్ధాశ్రమం
బను పేరన్ప్రథితంబు, వామనుఁడుఁగానయ్యెన్, త్రిలోకేశుఁడున్. 124

చం. అపుడు బలీంద్రుఁడా శరమహాన్వయకేతువు, విక్రమక్రమ
స్థపుటితధైర్యులై సురలు, తారుసమీకము వీడిపోఱ; నిం
ద్రపదవిఁ బూనెఁ; దత్కృతపరాక్రమముల్ సురదంతిదంత చి
త్రఫలక చిహ్నితంబులు, సితాంతశుకస్రువులయ్యె వజ్రికిన్. 125

మ. అనుటేకాని, విరోచనాత్మజుఁడు దైత్యస్వామి యంచున్, జగ
జ్జనశాహ్వాన్మణిదీప మాతఁడు, సదా సత్య ప్రతిజ్ఞుండు, ప్రా
క్తన పుణ్యాగత విష్ణుభక్తి భరభృత్కర్ణుండు, వింధ్యావళీ
వనితైకార్పితమానసుం,డతనిఁ బోల్పన్వచ్చునే! యన్యులన్. 126

మ. తతలక్ష్మీ సుఖవంచితుండయి, కదధ్వక్లిష్ట కాంతార దు
ర్గతిఁ బ్రాపించె మహేంద్రుఁ, డత్యమల దీక్షావర్తితంబుల్, శత
క్రతువుల్, గవ్వకుఁ గాకపోయినవి, ధర్మంబిట్లు వ్యత్యస్తమై
మతిమ న్మౌనిమనస్సమాధి సుఖముల్, మ్రాఁగన్నె వెట్టెన్
శిశూ! 127

సీ. అపు డమృతాంధసు లాత్మజ్ఞులైన బ్ర
హ్మర్షులు, సిద్ధాశ్రమాంతరమున,
శుద్ధయోగసమాధి, సుప్తమీనంబైన
సరసి పోలికనున్న హరినిగుఱిచి,
విపులార్థవన్మంత్రవిధిఁ బ్రస్తుతించి, చే
తమ్మునకెక్కఁ, బ్రాతస్తరంపు
వనజద్వయమువోని కనువోయివిప్పి, యు
న్నమిత్రైక నేత్రక్రమమునఁ జూడ

తే.గీ. నపుడు క్షణియిుంచి రఖిలర్షు లసురరాజ
ధార్ష్ట్యములు, శాతమన్యవదారుణావ
మానములువల్కి, ధర్మక్రమమ్ము పూని,
తరుణపద్మాక్షువలనఁ దద్వారణమ్ము. 128

ఉ. ఆతఁడె గాశ్యపుండు ప్రయతాగ్ని సమాజునుఁ దద్వితీయ ని
ష్ఠాతృణతాఽధిరోపిత ప్రశస్య తపశ్శరలక్ష్యకాణపా
రాతి పదాబ్జుఁడై, గడు భరంబుగ దివ్యసహస్రవర్షముల్
చేతమునఁగట్టి, ప్రీతి నలరించెఁ బరాత్పరు నా వ్రతాంతమున్. 129

చం. తన యెదుటన్ విపన్న జనతాఘనతాపనివారకుండు, పం
డిన పరమార్థమై నిలువ, నిస్తులనిశ్చల దృక్ప్రసూనపూ
జనములొనర్చి, యయ్యదితి, సమ్మదతారకితాత్మయై కనుం
గొన, వచియించెఁ గాశ్యపుఁడు కోరకితాశులు
గాసుధాంధసుల్. 130

ఉ. ఏమని విన్నవింతును! మనీషకుఁ జిక్కని నైకవృత్తి! నా
స్వామి! శతక్రతుండు దివసంబొక యేఁడుగ, చిక్కణాటవీ
శ్యామలకాపథంబులను నాంధ్రుడును బిడ్డలునై చరంత చిం
తామలినాత్ముఁ డయ్యెను, యథాయథలైనవి వానిధైర్యముల్. 131

చం. అదితియు విన్ననైనది, మహాతపతాపనితాంతతాంతయా
కదళిసిఁబోలి, చిర్నగవు, గన్నుల నుజ్జనసేసి, యెంతకున్
వదలని జ్ఞాతివైరములు, వహ్నివిధంబున రెండు వాఁగులన్
బొదిలి, దహించుచున్నవి ప్రభూ! యొక యాధ్యుఁడు లేక
యుండుటన్. 132

ఉ. ఈ రమణీ శిరోమణి సుపేప్రముఁడవై జనియించి, దుర్వ్యథా
భారవిశీర్ణచిత్తులు, సుపర్వుల మేరలు నిల్పవయ్య! ర
క్షారతిఁజేసి; యాబలియుఁగాఁ డితరుండు మదీయ వంశజాం
కూరము, రెంటినిన్గని, నెగుల్తొలగింపుము లోకపావనా! 133

వ. అని విన్నవించి, శిరస్తలఘటితకరాబ్జులైన యా దివ్యదంపతు
లన్గని, వామనుండనై జనింతునని వరంబు సేసి, పరాత్పరుండు
కన్నుమొఱఁగి, కాలాంతరంబున- 134

మ. శ్రవణ ద్వాదశినాఁడు పుట్టెఁ, ద్రిజగద్రక్షావిధాకర్మఠుం
డవనీభాగ్యము పండ, దేవతలు సాంద్రానందపారిప్లవుల్
నవనిష్యందసుధారసోపమ! నమోనారాయణాయేతి మం
త్రవిధిన్ బ్రార్థనసేయ, నయ్యదితికిన్ బ్రాగ్గణ్యసత్కీర్తికిన్. 135

మ. కురిసెన్ బూవులవాన లుత్సుకతతోఁ గూపారముల్ మంద్రసుం
దర భేరీరవముల్ వెలార్చె, దివిషత్కాంతాపదాబ్జాత నూ
పురములోమ్రొద సుగంధిలారవముగా మ్రోసెన్, దురంగాస్య బం
ధురవీణా ఘనధైవతశ్రుతులు దోడ్తో సాహ్యముల్ సల్పఁగన్. 136

కం. అత్తఱి నదితియుఁ గన్నులఁ
దత్తఱిలఁగఁ గాంతి, ముకుళితకరాంబుజయై
చిత్తము, ప్రత్యగ్రముదా
యత్తమ్ముగ నిట్లు సలిపె నభివందనముల్. 137

చం. "తఱచగు గర్వభారమునఁ దత్త్వమెఱుంగక, తాము, తామె యీ
శ్వరులమటంచుఁ ద్రుళ్లెదరు, భాగ్యసుభాగ్యము నీ కటాక్షమే
ర్పఱచెడు నింద్రజాలము; సురవ్రజపాలన! దుర్విభావ్య భా
వరసికఖేలనా! నిగమబంధురగంధగవేషితాకృతీ!" 138

కం. క్రమమునఁ బెరిగెను వామనుఁ
డమృతముతోనెనయు పలుకులాడుచుఁ ద్రిజగ
త్కమనీయ దంతవాసో
రమమాణస్మిత నిభానిరస్తతముండై. 139

కం. వటుఁడై, త్రిజగన్మోహక
నటుఁడై శ్రుతితత్త్వవంచనావృత్తి విశం
కటుఁడై, బలి యొనరించెడు
పటుభార్గవగుప్తయజ్ఞవాటికి నడచెన్. 140

మ. తనువున్ దాల్చిన దాతృలాగుణము, శ్రద్ధావేల, శాంత్యాది స
ద్గుణ సర్వస్వముదారతాశరథి, చక్షుః కౌముదీవీచికా
జనితాప్యాయముగాగ నవ్వటువు వీక్షంజేసి వైరోచనుం
డనియెన్, ధర్మవనప్రఫుల్ల నవపుష్పామోదరమ్యంబుగన్. 141

చం. కళలు దొలంకు చిట్టివడుగా! నినుఁగన్న సవిత్రి యెవ్వ, రీ
చెలువపు వేదపున్ గవలు, చెప్పిన మీ గురుపాదు లెవ్వరీ
నిలువ వశంబు నిన్నుఁగని, నీ గళవీణనదించు వేదఋ
క్కులువిని, వల్గుహాసవిని గూహితనిర్మల సంవిదాకృతీ! 142

చం. అడుగఁగ జంకెదో మనసునందలి కోరిక, చిట్టికుఱ్ఱ! నీ
యడుగక యుంట నాకగు ననాదృతి, యైంద్రపదంబునైన, ను
గ్గడువగుతృప్తి, నర్థికరకంజములందిడ నీబలీంద్రుఁడొ
ట్టిడుకొనియున్నవాఁడు;మది నీహితమున్ బొనరించి వేఁడినన్.143

మ. మణులున్ మాడలు, గోద్విపాశ్వములు, సామాన్యంబు లవ్వానిన
ర్థనమున్ సేయఁ, దదర్పణంబునకు, గోత్రవ్రాతపక్షచ్ఛిదు
గ్రనిశాతస్వరుపాకశాసన జయప్రత్యగ్రవక్షస్స్ఫుర
ద్రవిణీ! వైరోచనునంతవాఁడువలెనో! వాక్తత్త్వవారాన్నిధీ! 144

మ. అనినన్ హాసమరందపేశలములై యక్షుల్, వచశ్శ్రీలి, వా
మనుఁ డేరీతి వచించె, నిక్కమయినన్ మాదృగ్వటుశ్రేణికిన్
ధనముల్ రత్నములున్ మహాశ్వములు, మాదృగ్దంతులేలా, పరా
స్తనగ ద్విట్పృథుశౌర్య! సాంప్రతము భిక్షావృత్తి మాపాలికిన్.145

చం. అడుగఁగనేర లౌకికపుటాశలు, వారును వీరువోలె, నా
యడిగిన దిచ్చినన్ జగములన్నియు నిచ్చుట, రాజమౌళి! మూఁ
డడుగుల మేరయిమ్మనిన, నచ్చెరువై మది తెప్పఱిల్లి, నీ
యడిగినమేర, సంస్కృతిమహాక్రతుయాజక! యిత్తుఁ
బొమ్మనెన్. 146

వ. ఆ సమయంబునఁ గులగురుండైన కావ్యుండు, వచ్చినవాఁడు
విశ్వంభరుం డనియు, వాసవ పునః ప్రతిష్ఠార్థ మిద్దానంబనియు,
ననేక భంగులనెచ్చరించి, బలిని భగ్నప్రతిజ్ఞుఁ గావింపంజూచి,
చెల్లనేరక తోయధారాపూర్వకంబుగ దానంబు సేయు నెడఁ గామ
రూపియగుట గలశ రంధ్రంబున కడ్డంబు నిలిచిన, కమనీయ
స్మితవజ్రకరండాయిత గండతలుండగు కంజాక్షుండు, కావ్యు
నేత్రంబుఁ గుశాగ్రంబునఁ బొడిచిన నేకనేత్రుండై, బాధావిఘూర్ణిత
హృదయుండగు భార్గవుండు శిష్యుంగాంచి- 147

చం. అలినయకజ్జలాక్తహృదయా! భవదన్వయ భద్రకర్మరుం
డవు, నను, వెత్తిసేసి, యసురారికి దానము ధారవోసి తీ
యవమతికిన్ ఫలంబుగ, నిరస్తసమస్తధరాధురా ధృతి
ప్రవణయశుండవై, నొగులువాఁడవుఁ గమ్మని శాపమిచ్చినన్. 148

ఆ. వె. తృప్తితోడ గురుఁడు దీవెనలిచ్చిన
కోపు, శాపమందుకొన్న యమర
వైరి చెన్నుమిగిలెఁ, బ్రథిత సత్యవ్రత
మండనుండు, విజయభండనుండు. 149

శా. ఆవేళన్ హరి, పాదమొక్కటన సర్వానంతయున్ గప్పి, వి
శ్వావాసుండు, మఱొక్కటన్ దివము పర్యాప్తమ్ము గావించి, యో
యీ! వార్ధశ్రవసా౽తిగా౽చ్ఛతరకీర్తీ! బొంకుడిందన్; దృతీ
యావస్థానముఁ జూపుమంచు, స్మితగండాభాసి ప్రశ్నించిసన్. 150

మ. కలశాంభోధి తరంగ తుంగ వరణగ్రామచ్ఛవిచ్ఛన్నని
శ్చల శేషాహిశిరస్సహస్ర వరభాస్వచ్చంద్రశాలావిశృం
ఖలఖేలావిభవా౽భిరామమగు పత్కంజమ్ము, శీర్షంబుపై
నిలుపంజేయవెయంచు నబ్బలియు పంచెన్ మస్తమత్యున్నతిన్ 151

మ. హరిపాదానతుఁ డవ్విరోచనసుతుం డాజ్ఞప్తుఁడై తోడరాఁ
బరివారంబులు సేరె నాగభువి, దివ్యంబైన సత్కీర్తి చా
మరముల్ వేయఁగ, జంభవైరికిని సంప్రాప్తించె నాకమ్ము, దు
స్తరలజ్జామలినీ కృతాశయసుఖోత్సాహశ్లథీభూతమై. 152

మ. ఇది త్రైవిక్రమవిక్రమక్రమము, దానీయాశ్రమంబబ్ధిజా
హృదయాఽధీశపదార్పణ ప్రయతమేనిందుందు "దద్భావనా
స్పదమై, జన్మ తరించుఁగాక"ని, మదాశాదీప్తి! యారక్కసుల్
మదముల్ప్వాపుట లిచ్చటే; విమలధర్మధ్వంసనోదగ్రులై. 153

ఆ.వె. ఆశ్రమంబుఁ జేరినంతఁబునర్వసు
సహితుఁడగుచు గతతుషారుఁడైన
శశియుఁబోలె సర్వ చక్షురాప్యాయ కుం
డయ్యెఁ గౌశికుండనన్యరోచి. 154

చం. ఇఁక సవదీక్షఁ గైకొనిన నేము సశస్త్రిలమై నిశాచర
ప్రకర నికారణంబునకుపాహితచిత్తుల మౌచుమన్న సూ
ర్యకులవతంసుమాటకుఁ 'దఽథా'స్తని యా ఋషిమౌనియై ముహు
శ్చకితవిలోకనమ్ములఁ ప్రశస్యము జన్నముపేల్వఁజొచ్చినన్ 155

ఉ. ఆ రవివంశ భూషణులు, హారివలన్మృదు కాకపక్షులా
హారము నేని యొల్లక, మహస్సహజాతధనుర్నిషిక్త దు
ర్వార కలంబులై, పగలురాత్రియుఁ గంటికిఱెప్పలేక, శం
డారపు బొమ్మలట్టులవనంబొనరించిరి, నిల్చి, దక్షులై. 156

ఉ. ఆఱగునాఁడు, వేదమయుఁడాముని, సంయమిసంఘ సంయుతుం
డై రుచిరోభిపావకునియందు హుతమ్ముఁను వేల్వఁబో; శ్రవో
దారణమై, నభస్తలముద స్తముగా, లయకాలకాలగం
భీరతరోరు ఘట్టనము పీఁక, హళాహళినిల్చెఁబైవయిన్. 157

ఉ. అంత దిశావకాశముల నాక్రమణంబొనరించి, చిక్కణ
ధ్వాంతము గాత్రగాత్రములఁ దాల్చినసావి, నృమాంసఖాదు ల
త్యంతమురేఁగిక్రమ్మిరి, భుజాయసదండ ప్రచండహేతి ని
ర్వాంత, విఘాతదిన్నిచయ భావితవార్షుక విక్రమక్రముల్. 158

ఉ. వారు, నృమాంసరక్తము లవారిగఁ బోసెడులోన, ధీరహుం
కార మొనర్చి, రాఘవు, డకల్పతరస్స్వఁడు మానవాస్త్రమున్
జేరిచిచాపమందు విడిచెన్, దదనూనగరున్మరున్న భ
శ్చారి నినాదముల్, విజయశంఖరవమ్ములఁ బోల్ప బిట్టుగన్. 159

కం. మారీచుఁడు శతయోజన
దూరగుఁ డయ్యెన్ దదస్త్రధూతుఁడు, ప్రచల
న్నీరధిఁబడి మఱి యుద్ధము
పేరెత్తకపోయె, శీర్ణపృథుగాత్రములన్. 160

ఆ.వె. అగ్నిదేవతాకమైన బాణమున సు
బాహుఁజంపె శౌర్యపరిబృఢుండు
తక్కురక్కసులను దళితులఁజేసె వా
యవ్యము వివస్వదన్వయుండు. 161

శా. విశ్వామిత్రుఁడు వహ్నివేల్చి ప్రమదప్రేంఖద్దృగబ్జంబుఁగా
శశ్వద్గాఢకృతోపగూహనములన్, సల్లాపసత్కారరూ
పశ్వశ్రేయస గండచుంబనములన్, వాత్సల్య వర్షంబులన్
విశ్వాకల్పుల రామలక్ష్మణులఁ గావించెన్ ముహుస్తృప్తులన్. 162

వ. మఱునాఁడు మౌనులు జనకమహీపాల నిర్వర్త్యమానంబగు యజ్ఞంబునకుఁ జనుచున్నవారలతని పాలఁగల ధనూరత్నంబుఁ జూతువుగాని రమ్మని రాము నాహ్వానించిన, విశ్వామిత్రుండు దరహసిత వదనుండై, రామలక్ష్మణులతోడి సంతనకట్టి, వన దేవతల నామంత్రించి, సిద్ధాశ్రమంబు వలగొని పయనించిన. 163

ఉ. ఆ ఋషిమౌళి వెంటఁజనె నాకులితంబులుగా నెడంద, లి
చ్ఛారహితంబులై మృమకిసాలఫలాదులయందు; నాశ్రమో
దార శకుంత సంతతులు, తారతరంబుగ మ్రోయుచున్ శుగా
కారములై, చమూరుముఖకానన జంతులు వెంటనంటగన్. 164

ఉ. వానిని వెన్కకంపె ముని; వారణముంబొనరించి, ప్రేమసి
క్తానునయమ్ములన్, మృదులహస్తసపద్యుపలాలనమ్ములన్
మౌని గమించె, మాటికిని; మస్తకమున్ వెనుద్రిప్పి చూచుచున్
భానుఁడు సేరె; నస్తమిత భానుఁడు పశ్చిమ శైలదుర్గమున్. 165

శా. శోణాకూలమునందు నిల్చుచుఁదపస్విల్, సాంధ్య హోమాద్యను
ష్ఠానమ్ముల్ నెఱవేర్చి, కౌశికుని పజ్జంజేరి, రా రాఘవుం
డానందప్లవమాననేత్రుఁడు, కథావ్యాహారకౌశల్య బి
భ్రాణున్,గాధిజుఁ జూచి పల్కె వినయ ప్రాగార వాక్యమ్ములన్.166

మ. నయనోత్సాహ విధాయి పంచనగ, మానందాతిరేక స్వన
త్స్మయ మానాదరనైక పక్షికుల సంచారమ్ము, శోణాజలా
శ్రమ మందానిల కంఠవేణుభవషడ్జ, స్వాన కర్ణామృతం
బు,యమిశ్రేష్ఠ! వచింపవయ్య! దయనీభూమీపురావృత్తమున్.137

వ. అనిన, రఘువృషభుంగాంచి, విశ్వామిత్రుం డిట్లనెయె: 168

సీ. వినవయ్య! రఘురామ! యనఘుండు కుశుఁడు త
పశ్శాలి యొకఁడుండె బ్రహ్మయోని,
యక్లిష్ట ధర్మజ్ఞుఁ డార్య పూజితుఁడైన
యాతండు వైదర్భియందుఁ గాంచె

సుగుణోల్బణుల, శ్రితసూనృతవ్రతుల, న
ల్వురు పుత్రులను పరస్పరసదృశుల,
వారినందఱ ధరాభారంబు వహియింపఁ
దనికోరె, క్షత్రధర్మాభిముఖుఁడు

తే.గీ. తండ్రి యానతి శిరమునఁ దాల్చి, లోక
సమ్మతంబుగ ధరణి రాజ్యము నొనర్పఁ
దలకొనిరి వారు, జయరమా లలితహాస
చటుల చామరయుతులు, రాజర్షివరులు. 169

వ. వారిలోఁ గుశాంబుడు కౌశాంబిని నిర్మించెఁ, గుశనాభుండు మహో
దయంబు నధిష్ఠించె; నధూర్తరజసుండు ధర్మారణ్యంబను పట్ట
ణంబు నిర్మించె; వసువను కడగొట్టు సుతుండు గిరివ్రజంబు
సేసె. 170

తే.గీ. పంచశైలాఽధిరాజవిభ్రాజితంబు,
మాల్యమును బోలె శోణ యే మహినిఁ బాఱు
నట్టి యీనేల వసువను నతని నగరి
సరసగుణధామ! ధానుష్కసార్వభౌమ! 171

ఉ. ఆ కుశనాభుఁడాత్మజల నందె శతంబు, ఘృతాచియందుఁ దా
నా కలభాషిణీశతము, యౌవనసంపదలంది నప్పు, డ
స్వీకృత పూర్వబాణుఁడయి, చిత్తజుఁ డయ్యవదాతహాస ల
క్ష్మీకలభూషణాదృతలఁ జిక్కని తూపులుగాఁగఁ గైకొనెన్. 172

శా. ఆ కన్యాశతమొక్కనాఁడు సవిధోద్యానంబునం, దాత్మ శో
భా కల్పంబులఁ దల్లతాతరుల కాహార్యంబుఁ గల్పించి, సు
శ్రీ కిమ్మీరిత వాగ్విలాసములతోఁ జేసెన్ విహారంబు ల
స్తోకప్రాభవుఁడై మనోభవుఁడు సంతోషించి, జేకొట్టఁగన్. 173

సీ. చారుసర్వాంగుల సమదవక్షోజ వ
ల్గనములు, జవ్వనంబున విలసన,
మాకుంచితాపాంగ హరినీల రోచులు,
శీతలామల దరస్మితము నొప్పు
కలికివాల్గన్నుల కప్పుచెన్నును, గండ
మండల యౌవనమదభరంబు
పలుకుల తెలివు, నుజ్జ్వలమేఖలా దామ
గంభీర కటితటీకామనీయ

తే గీ కమ్మెడఁద గ్రుమ్మ వారివ గాత్రయష్టు
లతిశయముజిమ్మ గంధమ్ములలఁదికొనుచు
కాముకుండయి, యుద్యానగంధవాహుఁ
డాసతుల, సన్నిధానమం దవతరించె. 174

ఉ. వారి, నిరీక్షసేసి, భగవంతుఁడు గంధవహుండు వల్కె మీ
చారు వచోవిలాసముల, జవ్వనపుం, ససిఁజేసి, పట్టునఁ
జేరక, సందడించినది చిత్తము, నిష్కరుణప్రతాపుఁడీ
మార కిరాతుఁడో సుభగమానినులార! ననున్ గ్రహింపుఁడీ! 175

మ. నను మీవానిగఁ జేసికొన్న శుభసంతానమ్ము, పౌరాఉతిగం
బనయమ్మున్ గయిమోడ్చు నిత్యఘటితంబై దేవభూయంబు, మీ
తను సౌందర్యవిధాయి యౌవనము ప్రత్యగ్రంబుగా నిల్చు, క
ల్గును, కల్పాగవితానితచ్యవనవల్గున్యాస సంచారముల్. 176

శా. ఆ పల్కుల్విని కన్యకాశతము నేత్రాంతమ్ము మందస్మిత
వ్యాపారమ్మున నందగింప, ననియెన్ స్వామీ! జగత్ప్రాణ! యీ
చాపల్యమ్ములు, దైవతోత్తములకున్ సంధించునే! యాభిజా
ల్యాపోరాసులమమ్ము, నెల్లిదము సేయన్ నీకుమేలున్నదే! 177

మ. కుశనాభుండగు తండ్రిఁ గన్నసుతలన్ గొంచెంపు మాటాడి, దు
ర్విషహాపత్తులఁ దప్పిపోవరుసుమీ! విద్యావివేకాహిత
ప్రశమాత్ముల్ పలువెంటలన్ బడుదురే! వాఁడౌను మాభర్త, యే
వశి, మా తండ్రి యనుగ్రహించిన, కదధ్వాధ్వస్త సంవిన్మతీ! 178

మ. అనినన్ వక్త్రము జేగురింప మరుతుండత్యంత తారుణ్యశో
భనముల్, వారిశరీరముల్ గమిచి, గర్వక్షుద్రుఁడై, భంజనం
బొనరింపన్, సుకుమారరూప విభవవ్యాక్రాంత గాత్రమ్ములన్
వనితల్ దీముల కేఁగుదెంచిరి, యవజ్ఞాఽసహ్య బాష్పంబులన్.

ఉ. వారినిఁ జూచి కుబ్జలయి వచ్చినవారి సమాధినిష్ఠ, లో
నారసి, ధార్మికాగ్రసరుఁడా కుశనాభుఁడు, గంధవాహగ
ర్వారభటీకృతం బవినయంబు సహించె, యముల్, మహాకుభృ
ద్ధీరులు, రాగరోషపరిధిగ్రసితాత్ములె! యెట్టివేళలన్. 180

సీ. చూళియన్నొకముని, శుద్ధాశ్రమాచార
సురభిళమతి, విభాతరుణ తరణి
యూర్ధ్వరేతసుఁడు దానొక్కవనంబున
బ్రాహ్మమైనట్టి తపమ్ము నడుప,
కడగి యాతనికొక్క గంధర్వి 'సోమద'
యనునది భయభక్తులావటిల్ల
నిష్ఠతోఁ గొలిచె ననేక కాలంబు; త
త్సేవాముదిత చిత్తుఁడౌ వశియును

తే.గీ. దానివీక్షించి, యేమి నీతలఁపటన్న
వాక్యకోవిద సోమద వలయు నాకు
నొక్కపుత్రుండు బ్రహ్మవిద్యోపపన్న
హితతపోయుక్తుఁ డనుచుఁ గాంక్షితము దెల్పె. 181

వ. అపతియు, నభార్యయు, తపోపగతయు నగు దాని యభీప్సితం
బంగీకరించి, దాని కనుత్తముండగు నొకకుమారు, మారాకారు
నొసఁగిన, మానసుండగు నాతనయుండు, బ్రహ్మదత్తనామం
బునఁ బ్రథితుండై, ప్రాసాదహర్మ్య వలభీ నిర్వ్యూహ సంకులం
బగు 'కాంపిల్యంబు' నృపధానిగా నొనర్చికొని యున్నంత. 182

శా. ఆ రాజన్యునకాత్మజాతల వివాహంబర్థి సేసెన్ గులా
చారప్రక్రియతోఁ గుశాత్మజుఁడు, తత్కామభృత్కరస్పర్శ, దు
ర్వారంబైన కురూపముల్ విడి; సుమాస్త్రప్రేష్ఠ ఘోట్టాణ శం
కారారజ్యదుదంతమైనయది, తత్కన్యాశతంబిమ్ములన్. 183

తే.గీ. అపుడు కుశనాభుఁ డాత్మజుం డవతరింప
నిచ్ఛఁ గామించి, పౌత్రీయ మిష్టిసేయ
బ్రహ్మసుతుఁడు కుశుండనె పడయఁగలవు
కొమరునొక్కని సదృశసద్గుణు నటంచు. 184

శా. వారే మాపితృపాదులోయి! సుమతీ! వంశప్రతిష్ఠాకర
స్ఫారోదారతపస్వి లూర్జితయశః ప్రాగ్భార గంగాపగా
నీరస్నాత పవిత్ర కిన్నర ముహుర్నిర్హ్రాదితాతోద్య వా
ణీ రాగాకుల నిర్ఝరోత్తములు; వాణీయస్తర ప్రక్రముల్. 185

శా. ఆ గాధేయుల పుత్రి సత్యవతి, వంశాచార పూతంబుగా
నా గంభీర, ఋచీక సంయమి వివాహంబయ్యె, గాత్రంబుతో
నేఁగెన్ దత్పతి పుణ్యలోకముల కోయీ! వంశకోటీర! నే
నా గాధ్యర్షుల కేక పుత్రుఁడను, విద్యాసత్తపోవృద్ధుఁడన్. 186

కం. మాయక్క కౌశికీనది,
యై యుర్వీతలినిఁ బాఱు, నాహిమవంతం
బాయంబ నివాసము, నే
నాయక కనురక్తుఁడను హృదంతరమందున్. 187

వ. అవుటంజేసి, తత్కాలంబున నాశ్రమంబు నిర్మించుకొని వసింతు, రామా! యిది మదీయ జన్మ ప్రకారంబు, కుశవంశ జననంబునఁ గౌశికుండనైతి, గాధిసూనుండ, గాధేయుండ, నని పల్కి మఱియు నిట్లనియె: 188

తే.గీ. యాగమొనరించుకొన నియమానువృత్తి
ననఘ! చేరితి నిదియు సిద్ధాశ్రమమ్ము
చండమగు నీదు శక్తి సిద్ధుండనైతి,
నాత్మ, సాఫల్య పులకితమయ్యె రామ! 189

శా. ఈ గాథారసమగ్న చిత్తములఁ బ్రొద్దే గానరాదయ్యె వ
న్యాగంబుల్ చలనంబుఁ దక్కెను గుమారా! పక్షులున్ సత్త్వముల్
లోగెన్ నిద్రకు, నైశముల్ దమము లాలోకింపు మేరీతి ది
గ్భాగవ్యాప్తము లయ్యెనో! మృగమద ప్రత్యర్థి వర్ణమ్ములన్. 190

శా. కాలాంతఃపురకామినీ కబరికాకల్పంబులో మల్లికా
జాలంబుల్ గళితంబులైన తెఱఁగో! సంధ్యాసతీ నీలవా
సోఽలంకార సువర్ణపుష్పములో యంచున్ బోల్పఁ బట్టె, నభ
శ్రీలాలిత్యము, తారకావితతి మించెన్ నేత్ర పర్వంబుగన్. 191

సీ. కలశాబ్ధిగన్నట్టి గారాబుతనయుండు
వసుమనోహారి, జైవాతృకుండు
పొలఁతినివ్వని జగమ్ముల మామ, మదనాగ
మార్థనిర్ణేత్రంబుజాసనుండు
యెలమి వేల్పులకు నాకలిఁదీర్చు గృహమేధి,
శంబరాసక్తుండు, సత్పథుండు
యెపుడు వాడనియట్టి త్రిపురారి తలపూవు,
రజనీచరుండు నిర్జరశిరోధి

తే.గీ. ధవళకీర్తికి నుపమింపఁదగినవాఁడు,
తారకాభర్త, హరికి నిద్దంపుమఱఁది
రమ్య మాంజిష్ఠవర్ణ గాత్రమ్ము పూని
పొడమెఁ జంద్రుఁడు సమ్మదాభ్యుదయకరుఁడు. 192

మ. కనులన్ సిద్ధురలెక్కి వచ్చినటులై గన్పట్టు, కందర్ప చా
పనికాశమ్ములు సోలుచున్నవి శిశూ! బారాది కన్బొమ్మ, లిం
కను పెందవ్వు విదేహ పట్టణము, విఘ్నంబౌను మధ్యేపథం
బున నీ కాయము డస్సినన్, నిదురఁబోవోయీ! యశోవల్లభా! 193

శా. ఆ కౌసల్య, రసార్ద్రగానముల శ్రోత్రానందముం గూర్ప; న
చ్చాకాశ ప్రతిమానతల్పమున నీహారాంశువుంబోలి, ని
ద్రా కల్యాణసుఖంబులందు ప్రభువా! దర్భాంకురక్లిష్ట శ
య్యాకాఠిన్యము లిచ్చగించితివి, నాకై సత్తపోమండనా! 194

మ. అరుణాబ్జంబుల కన్నదమ్ములగు నీ యంఘ్రుల్, కదధ్వాటవీ
కరుణాహీన నిశాతకంటక శిలాక్రాంతమ్ములై యున్న, నా
యుర మాందోళితమౌనుగాని, దనుజవ్యూహక్షతిన్ గోరి, మ
త్పరమార్థమ్మగు భావమున్ దెలుప తత్త్వజ్ఞాన పాథోనిధీ! 195

మ. అను గాధేయుల వాక్యముల్ వినుచు, రమ్యాకారరాముండు, చ
క్కని కందోయి మొగిడ్చెఁ, బశ్చిమగిరిం గంజాప్తుఁడుంబోలె, ల
క్ష్మణుఁడున్ నిద్దురఁ గూరెఁ, గౌశికుఁడు శశ్వద్ధ్యాననిర్మగ్న లో
చనుఁడయ్యెన్, మఱి తక్షుమౌనివరు లీషన్నిద్రఁ గాంక్షింపఁగన్.

తే.గీ. కంజహిత కంజరాగ సత్కాంతి పుంజ
పింజరితమైన మేఖల పృథుజఘనము
పైని నదియింప, ఖగకుల క్వణితనిస్వృతి
నవతరించె నుషోదేవి యబ్జగంధి. 197

వ. అనంతరంబ, దాశరథులు, సౌఖశాయనిక విశ్వామిత్ర ప్రబోధి
తులు, కృతపౌర్వాహ్ణిక విధులు, మునిగణంబులతోఁ బయనంబు
సాగించి, శుభస్వచ్ఛజలయైన శోణానదిఁ దరిసిన రాముండు
కౌశికున కిట్లనియె: 198

కం. శ్రుతిహితపథుఁడగు సజ్జను
మతిఁబోలిన సైకతముల మంజులమై, యిం
దతిమాత్రజలము లేమిని
సుతరాంపదతార్యమయ్యె శోణ మహాత్మా! 199

కం. ఏ మార్గము సుకరంబగు
నా మార్గముఁజూప నర్హులనిన, మహర్షి
స్తోమాఽభిచరిత మిదియని
ప్రామాణికమౌని యొక్క పథమును బట్టెన్. 200

శా. ఆ దారింబడి యుత్తరించి నది, విశ్వామిత్రుఁ డగ్రంబునన్
సాధిష్ఠంబు తపోవిభూతి, తను సంసర్గంబు గైకొన్న య
ట్లా దిష్టాధ్యుఁడు వోవఁగా, మునులు, నాహంసాన్వయుల్ తుందిలా
హ్లాదుల్, పైపయి దాటిపోయిరి, దృగబ్జాహార్యవన్యాఽద్రులన్.

సీ. వనజినీ వనజ భాజనగతంబగు తేనె
మొకరి తుమ్మెద మూతి ముట్ట వెఱచెఁ,
బ్రాతస్సతీవియోగాత ప్తవాసర
శ్వసితమ్ము, గాలి యుష్ణముగ వీచె,
దవదహ్యమాన పల్లవకోటి సిమసిమ
చ్ఛబ్దమ్ము కర్ణసంజ్వరము సేసెఁ,
గఱెన కంఠీరవాక్షత నఖోజ్ఝిత మౌక్తి
కమ్ములు చలితనాట్యమ్మొనర్చెఁ,

తే.గీ. జకచకద్యుతిమన్మరీచికల, వార్వి
గాహితభ్రాంతిఁ ద్రావ నుత్కలికఁ జెందె,
వారణమ్ములు, దిక్కరావములు కాలి
యదరులుమి సెడు, మట్టమధ్యాహ్నమయ్యె. 202

మ. కనుదోయిన్ దనిపెన్ భగీరథయశః కల్పంబు, వైకుంఠ పా
వనపల్లాలితయైన కూతురు, ఖగప్రస్ఫీతబుజ్మంత్రవ
ర్ణ, నికామశ్రవణోత్కకూల నివసద్బ్రహ్మణ్యలోకమ్ము, భూ
జనపాపాపహ జాహ్నవీనది, శరచ్చాంద్రీప్రపాతంబుగన్. 203

మ. వలితగ్రీవసితచ్ఛదప్రణయినీ వ్యాహారశుద్ధాంత ని
ర్మల రాజీవము, జాహ్నవిన్ గని మునుల్, మాధ్యందిన ప్రక్రియా
కలనా మేదురితాదరుల్ నిలిచి,రా గంగాతటీ భూములన్
బలభిద్వజ్ర వినీల జంబుఫల నిష్ప్రత్యూహ రమ్యంబులన్. 204

తే గీ. అపుడు రాఘవుఁడడుగ సంయమిశిరోధి
కౌశికుండిట్లువలికె గంగాస్రవంతి
మూఁడులోకమ్ములకుఁ బ్రాకి, మునిజన ప్ర
గీయమానమ్ము కీర్తికెక్కిన విధమ్ము. 205

మ. కలఁడభ్రంకష శస్తమస్త మణిపూగవ్యాప్త ఖద్యోత మం
డలుఁ డాప్యానశరీరసుందరుఁడు, మేనామానినీమానసో
జ్జ్వల హంసమ్ము, లసత్తుషారచయభస్మచ్ఛన్న శంభుడు, ని
స్తులచాంద్రీమయకీర్తి, సాంద్రహిమవంతుండద్రులన్ మేటియై. 206

శా. ఆ మేనాసతి కాయహార్యమణికి, న్నవ్యాహతంబుల్, వయ
శ్రీమర్మస్పృహలైన ధర్మములు, తార్తీయీకముల్ సెల్లినన్
శ్యామామండల మండనాయిత సురూపాఢ్యాఢ కౌలీనతా
సామీచీన్యలు, గల్గిరిర్వురు తనూజాతల్ జగన్మోహనా! 207

కం. వారిరువురిలో నగ్రగ
సారస రశనాభిరామ, జాహ్నవి, యుమ, త
న్మేరుమహీధరతనయా
సారపురాపుణ్య, మవరజ, రఘుప్రవరా! 208

సీ. అట్టుండ దేవతాఽర్థాఽభికాములు సర్వ
విబుధులొక్కటవచ్చి వేడుటయును
దేవకార్యార్థమ్ము, దేవాంశజుండైన
హిమవంతుఁ డప్పుడయిచ్చె గంగ;
స్వచ్ఛందపథగ, యీశ్వరి మంత్రసంహితా
హుతి శుభ్రరోచి, యయ్యువిద దేవ
పథములఁజనె లోకపావని, త్రైలోక్య
హితకామ్యఁజేసి, సన్నుతచరిత్ర!

తే.గీ. యంత యుమ, ఘోరతపముల హరునిమనసు
గట్టి పితృదత్తయగుచు నకల్పసుఖము
లందె, దేవేంద్రముఖముఖాధ్యాసిత ప్ర
శస్తసితకీర్తిభర పరిష్కార యగుచు. 209

ఆ.వె. అనిన తోన రాముఁ డానందమున యందు
మగ్నుఁడగుచుఁ బలికె మౌనివృషభ!
దేవపథగ, గంగ త్రిపథగయైనట్టి
వితము సెప్పుఁడనుచు వినయమూర్తి. 210

ఉ. ఆపయి గాధిజుండనె, మహాసురవంశబలిప్రణీత య
జ్ఞోపమకీర్తిసాంద్ర! వినవోయి కుమార! నభఃకపర్దుఁ డీ
హాపరభాగితన్, గిరిజయందు సుఖంపడఁజొచ్చె, మన్మథా
జ్ఞాపరవక్త్రవృత్తియయి, సాగెను దివ్యసహస్రవర్షముల్. 211

ఆ.వె. కలుగలేదు సుతుఁడు ఖండేందుధరు కామ
కలన దఱుగలేదు, కడు వడంకి
రమరులెల్ల, ‘దేజమది గళితంబైనఁ
బట్టుకొలుప నెవరు వలతు లనుచు? 212

సీ. అపుడు దేవసమూహ మహిభూషణునిఁ జేరి
విన్నవించిరి, స్వామి! వీర్యమీవు
వదలిన భరియింపఁ బ్రభవిష్ణులెవ్వరు!
హవణించి తేజంబు నందతేజ,
మొనరనయ్యుమతోడ నుత్తమమ్మగు తప
శ్చరణంబు లోకరక్షకు విధేయ
మనుచు, నా పల్కుల నాదరించిన శంభుఁ
డనియె, నే, నాతేజమాత్మతలము

తే.గీ. నుండి యక్షుభితమె! దాని నుజ్జగింతు
క్షుభితమైనట్టి దాని నెక్కొని భరింప
వలఁతు లెవ్వరో! యేర్పరింపంగ నుచిత
మనుచు, దేవతలంత సయత్నులగుచు. 213

కం. వసుమతిఁ బ్రార్థించిన న
య్యసమాంబకు వీర్యభరము నవనిభరించెన్
విసవిసమని యాతేజము
ప్రసరించెన్, తుంగగిరి వనాటవులెల్లన్. 214

తే.గీ. అపుడు భూదేవి తత్తేజమాపలేక
నడునడు వడంక, దివిజులు పొడవడంగి
పోవునో! యని భీతులై పుణ్యమూర్తి
జాతవేదునిఁ బ్రార్థింప, సమ్మతించి. 215

చం. జ్వలనుఁడు వాయు సాహ్యమున శాంభవతేజముఁ దాల్పఁ, నగ్నిసం
కలితము శైవవీర్యము, నగంబొకటయ్యె వళక్షసుందరం,
బలమెను జెల్లుపెల్లు, హవనాశి దివాకర తుల్యవర్చసం
బలఘుఁడు పుట్టె నందు సుతుఁ డాసకలప్రతిభాసితేజుఁడై. 216

ఆ.వె. అయ్యెఁ గార్తికేయుఁ డయ్యర్భకుఁడు కృత్తి
కల పయస్సుఁ గ్రోలఁ గాంచుదాన
నగ్ని తాల్చి విడిచినట్టి కతంబున
ననలజాతుఁడయ్యె నినకులేశ! 217

చం. అపుడుమ పుత్రకామ్యమగు యజ్ఞము, శాంభవసౌరతక్రియా
స్నపనము, నాకభూభవుల జాల్మమతిన్ బ్రతిరుద్ధమైనఁ దీ
వ్రవపు,రుషగ్రమ్మి, కన్నుగవ రక్తిమలాడఁ గపోలదర్పణ
వ్యపగత పత్రభంగయయి, పల్కెఁ గవోష్ణమితాక్షరంబుగన్. 218

కం. మీచేసిన యవినయమున
మీ చెలువలు పుత్రగాత్ర మృదుసంగ సుఖ
శ్రీ చర్చావంచితలై
వాచరచెద, రింకపొందు వర్ధితయశులై. 219

మ. అనియాశైలజ, కాశ్యపిన్గని, నితాంతామర్షయై, నీవొన
ర్చిన దోసమ్మున, నైకరూపవయి పుత్రీయమ్ము సౌఖ్యమ్ము లే
కను, చింతన్ బహుభార్యవై గుడుతు, పోకాల్మంచు శాపంబొసం
గె, నమద్వ్యక్తులుగాఁగ దేవతతు లక్షీణత్రపాకుంచితుల్. 220

ఉ. అంత నగాత్మజాసహితుఁడయ్యలికాక్షుఁడు, పైనమై, సదా
త్యంతతుషారసంహతి, దివౌకసయౌవతదర్పణాయిత
ప్రాంతము, కాంతమైన హిమవంతము నుత్తరమందు, నొక్క యే
కాంతశిలోచ్చయంబుఁ గని, యచ్చటఁబట్టె సమాధి సౌఖ్యమున్.

కం. అపుడసురయైన వృత్రుఁడు
సపృతనుఁడై దేవతలను సాధించిన, వా
రపగతధైర్యులు, పరమే
ష్ఠిపాదముల నంటియనిరి చింతాకులితుల్. 222

మ. ఒక సేనాపతిలేమి, దేవత, లనిర్వ్యూఢక్రముల్, విక్రమ
ప్రకటోద్దాములు గాక పోయిరి, జయప్రాగల్భ్యమేపార, మా
టికి నాకమ్మును దాకు దైత్యపతి, ధాటీభీత దేవాంగనా
ప్రకరంబుల్, ధవళాక్షగండతల బాష్పస్రోతలై కుందఁగన్. 223

మ. మును మాకిచ్చినయట్టి సైన్యపతి శంభుండిప్డు, నిర్వాణ సా
ధనలో మున్గినవాఁడు, శైలజకు నౌదాసీన్యమున్బూని, యా
తనికిన్ మావెతలేమిపట్టినవి! యేతద్రూపమౌ కష్ట మిం
క నివారింపను నీవె దిక్కు సురసంఘక్షేమకృద్వర్తనా! 224

వ. అని ప్రార్థింపఁ, జతురాస్యుండు పార్వతి శాపంబునన్ జేసి, దేవతలకు స్వభార్యలందపత్యంబులు లేమి నిరూపించి, యాకాశ గతయైన గంగయందు హవ్యవహుండు శాంభవ తేజంబు నిక్షేపింపం గలవాఁడని నియోగించిన. 225

కం. సితవనజ నికరమంద
స్మిత, హంసక్షౌమ, యుల్లసిత మధుకర వీ
క్షితములఁజేసియు, సారస
తతిపలుకులుఁ జేసి, వహ్ని దరిసె సుభగయై. 226

ఆ.వె. అపుడు వహ్ని గంగయందు నిక్షేపించె
నభవుతేజమామె, యది భరింప
నవశయగుచు విడిచె, హైమవతమ్ము పా
దమ్మునందు భీతతరళనయన. 227

వ. ఇట్లావిష్కరించిన గర్భంబనేక ధాతురూపంబయ్యె; హిరణ్యంబు తదుత్పన్నంబగుట జాతరూపంబను నామంబునందె, నది హుతాశన సమప్రభంబు; జాతుండైన కుమారుఁ గృత్తికలు గమిచి క్షీరంబొసంగిన కతంబునఁ గార్తికేయుండయ్యె, గర్భస్కన్నం డగుట స్కందుండను నామం, బయ్యాగ్నేయుండు. 228

మ. సురసేనాపతియై, షడాస్యముల నుచ్చానంబులౌ నేత్రముల్
బురుడింపన్ లయకాలకీలికల, దిక్పుంజస్థలీదారణ
స్ఫురదార క్తమహాట్టహాసముల, రక్షో వ్రాతముల్, భీతులై
దెరలన్, వారి వధించి, దేవతతికిన్ దీర్చెన్ మనోవ్యాధులన్. 229

తే.గీ. ఇది కుమారసంభవ గాథ, ముదితులగుదు
రిది పఠించిన వంశాభివృద్ధి నంది
స్కందసాలోక్యమొదవు నస్ఖలితవిభవ
మగునని, వచించెఁ గౌశికుం డతులరక్తి. 230

కం. ఆపైని రామవదన
శ్రీపానముదాఽతి విచ్ఛురితనేత్రుఁడు, గం
గాపగ, భువి కరుదెంచిన
పాపాపహగాథ, నూది పలికెన్ మునియున్. 231

సీ. ఆ త్రయీతనుఁడు దానాఢ్యుఁడై యే వంశ
మును నోముఁ గరుణాప్రపూర్ణదృష్టి,
మన్వాదులెందేని మానసించి, జనించి,
యశము నించిరి దేవతాత్మకమ్ము,
సర్వసద్గుణములే జనపాలురను గొల్చెఁ
దమయున్కి చారితార్థ్యమ్ము కొఱకు
నీగంగ పుడమికి నేతెంచుటెవ్వరి
తపములఁజేసి, తీర్థముల రాణి

తే.గీ. ఆదియును నంతమునులేని యట్టి వెలుఁగు
పుట్టె నెందేనిఁ దానొక్క చిట్టిశిశువు
రసపరిష్కృత లీలాఽభిరామమగుచు
నది పొదలు, సూర్యవంశమభ్యుదితమహిమ. 232

శా. ఆ వంశంబున జన్మమందె సగరుండానాకభూమ్యంగనా
ప్రావారాయిత కీర్త్యుశత్తముఁడు, పారంపర్య ధర్మాభిర
క్షావైనీతక రాజ్యభోగరథజాగ్రన్మూర్తి; దిక్పాల కాం
శావిష్కారి మహాచరిత్రుఁడు, నిరస్యద్వ్రజి సౌభాగ్యుఁడై; 233

సీ. అతఁడప్రజుఁడు ప్రజ నభిలషించి విదర్భ
జనపతిదుహిత కేశిని యనంగఁ
జనునది, కాశ్యపు నసుఁగుఁ గూతురు సుమ
తియు నను భార్యలు, ధృతిని గొల్వఁ
బరమార్థముగ భృగుప్రస్రవణంబును
సలిలఫలాపూర్ణతలము, తుహిన
శైలపాదముఁ జేరి సాత్త్వికసత్తప
శ్చరణవ్యతీత వర్షశతుఁడైన

తే.గీ. భృగుమహర్షి, దయాపరీవృతుఁడపత్య
లాభము నతోఽధికము యశశ్శోభగలుగ
వరముసేసిన నిరువురు భార్యలందుఁ
దనయుఁడెవ్వరికన్న వాదమ్ము గలిగె. 234

వ. వంశకరుండగు సుతుఁ డొక్కతెకును, షష్టిపుత్ర సహస్రంబులు వేఱొక్కతెకును, మహర్షి నిశ్చప్రపచంబుసేసి, యేకతర పరిగ్రహంబున స్వచ్ఛందఁబు విధియించిన, కేశిని వంశకరుండగు సుతునిఁగోరె, సుపర్ణభగిని, మహోత్సాహులు, మహనీయ కీర్తు లగు నఱువదివేల పుత్రులనిచ్చించె, సిద్ధమనోరథ సుందరలగు

శుద్ధాంతంబులతో సగరుండయోధ్యసేరె నందుఁ గాలంబు సెల్లినఁ గేశిని యసమంజుఁ బ్రసవించె; సుమతికిఁ దుంబఫలాకారంబగు గర్భపిండంబు గలిగి, తద్భేదంబులు షష్టి సహస్రంబులై, ఘృతకుంభ పరివర్ధితంబులైన నందఱు పుత్రులు జనియించిన. 235

కం. అసమంజుఁడు దుర్మార్గ
వ్యసని, యయోధ్యాపురంబు నర్భకులను బె
ల్లెసగు సరయువునఁ జంపుచు
విషమము గావించె బ్రదుకు పృథ్వీప్రజకున్. 236

ఉ. వానికి నంశుమంతుఁడను వంశకరుండుదయించెఁ, బ్రశ్రయా
ధీనమహాపరాక్రముఁడు, ధీబలయంత్రిత కామరోష మి
థ్యానుగ కామవృత్తి, హృదయగ్రహిభాషణభూషణుండు, చాం
ద్రీ నికషా లసచ్ఛుభచరిత్రుఁడు, తాదృశచిత్తసంస్కృతిన్. 237

తే.గీ. అపుడు సగరుఁడు సవనాత్ముఁడైన హరికి
ప్రీతి సేయంగ వేడి, ఋత్విక్సదస్య
సముపదిష్ట మార్గమున నిష్ఠామహితుఁడు
వాజిమేధంబు సేయ నుపక్రమించె. 238

సీ. వేయి శిరస్సుల వింధ్యాద్రికిని శివ
శ్వశురుండు ప్రాలేయశైలమునకు
నంతరమ్మునఁ గల యంత మేరయు యజ్ఞ
శాలయైనట్టులై, సతత ముఖర
సంయమి ముఖమంత్ర సంతతిఁ జేసి వే
దాత్మకంబైనట్టు లఖిలజగము,
లవిరళంబుగ వేల్చు నాహుతిఁ జేసి య
న్నాత్మకంబైనట్టు లఖిల జగము

తే.గీ. లధ్వరము సెల్లె, నశ్వచర్యను వహించె
సగరునానతి తోడన స్ఖలిత విక్ర
ముఁడు, మృడానీశహుంకార మూర్తిమచ్ఛ
రాసనుం దంశుమంతుఁ డశేషయశుఁడు; 239

కం. ఆ యజ్ఞమ్మున, నశ్వము
మాయావియుఁడైన జంభమథనుఁ డసూయా
ధేయ పరాగత హృదయుం,
డోయన హరియించె, ధర్మ ముడివోవంగన్. 240

మ. సవనాశ్వంబు హరించినట్టి ఖలునిన్ జక్కాడి, యశ్వంబు దే
క, వినాశంబులు దప్పవోయి నృప! యజ్ఞచ్ఛిద్రమక్షమ్యమం
చు, వివస్వత్ప్రమితౌజసుల్, మహిసురస్తోమంబు వాక్రుచ్చినన్
భువనాధీశుఁడు జన్నమున్ విడిచి తాఁబోరామి యోచించుచున్.

చం. అఱువదివేల పుత్రకుల నాహయరత్నముఁ దెండటంచుఁ గ్ర
చ్చఱ నియమింప, వారును నుదాయుధులై భువి బెగ్గడిల్ల, భీ
కరముగ నార్చుచున్ వెదకి కానరు వాజి, మహావనంబులన్
వరనగరంబులన్, గగనపర్వ గిరీంద్ర దరీముఖంబులన్. 242

సీ. హయమును గానని యా సాగరులు, వజ్రి
వజ్రంబుతో నెనవచ్చునట్టి
కఠిన నఖమ్ములఁ గల భూమియంతయు
నొక్కొక్కఁ డొక్కొక్క యోజనమ్ము
మేరకుఁ ద్రవ్వంగ, మేదిని విశకలి
తాంగియై, సారె బిట్టార్వ దొడఁగె
నఖిల భూతముల హాహాకారములు దిశా
వలినెల్లఁ గలగుండు వడఁగఁజేసె

తే.గీ. నప్పుడు త్రిదశులు, పరమేష్ఠినర్థి వేడ,
నాతఁడోదార్చెఁ గపిలమహామునీంద్ర
కుపితనయనాధ్వర క్రియా క్రోధవహ్ని
హతులగుదురెల్ల సగరుని సుతులటంచు. 243

చం. గుములుగఁ దూర్పుదిక్కుఁబడి గ్రొచ్చుచుఁ బోయిరి సాగరుల్, మదా
క్రమిత విశంకటక్రములు, కట్టెదుటన్ గనుపట్టె, మేరువి
భ్రమదము, భూసుతగ్రహవిభానిభ నేత్రములన్, దిశాంతనా
గము, రదనాంశుసంహతివిగాహ సరఃకృత నాకలోకమున్. 244

తే.గీ. ఆ విరూపాక్ష గజమున కంజలించి,
సగరసుతులు, తత్తేజో విసర్పవిచలి
తాక్షులై, వెనుదిరిగి, పరాహతాత్మ
శౌర్యులయ్యు నతంద్రితోత్సాహులగుచు. 245

చం. గుములుగ దక్షిణంపుదిశఁ గ్రొచ్చుచుఁబోయిరి సాగరుల్, ఘనా
ధ్వము రవగర్భమై యద్రువ, వారికిఁ గన్పడె మంచరాచల
భ్రమదము, ఫుల్లకేసరవిపాకపరీమళ భృన్మదాంబు భం
గము, పృథుకుంభకుంకుమవికస్వరరోచిరుదస్తనాకమున్. 246

తే గీ. ఆ మహాపద్మకరిరాజు కంజలించి,
సగరపుత్రులు, తద్దంత శాతకిరణ
సూచికాభిన్న దృక్కులు సొరక, ముందు
వెనుకఁ దిరిగియు, తుందిలావేశులగుచు. 247

చం. గుములుగఁ బశ్చిమంపుదిశఁ గ్రొచ్చుచుఁబోయిరి సాగరుల్, వ్యథా
క్షములయి, తంద్రియానతికిఁ గల్గగరాదని విఘ్న, మత్తజిన్
సముఖమునందుఁ గానఁబడె సౌమనసాఖ్యము, చారుబృంహిత
క్రమమథితాశ మప్పతిని కామ సుఖోత్సవకృన్నివేశమున్. 248

తే.గీ. ఆ హరిద్దంతి కతిభక్తి నంజలించి,
సగరసూనులు, తత్కరచాలన ప్ర
భూతవాత్యా విపర్యస్త పురుషకారు
లగుచు, వెనుదిరిగియును మోహాంధులగుచు. 249

చం. గుములుగ నుత్తరంపుదిశఁ గ్రొచ్చుచుఁ బోయిరి సాగరుల్, ముహుః
ప్రమదభుజావిఘట్టన విపాటిత నాకపురీ కవాటులై
హిమమృదుపాండురంబచట నేడ్తెఱ దర్శనమిచ్చె, భద్రనా
గము, ధనరాజ చారు కరకంజ సమర్పిత భూరిభోగమున్. 250

తే.గీ. ఆ మహాదేవతాత్మున కంజలించి,
సగరతనుజాతు, లశ్రాంతచాల్యమాన
శ్రవణశూర్ప సముద్ధూతరజము కనులఁ
గప్ప, వెనుసూపి క్రోధమక్షయము గ్రమ్మి. 251

కం. ఐశానియైన దిశ తీ
వ్రాశని సమనఖములన్ మహాబలు, లుదితా
వేశులు గ్రొచ్చిరి దుర్విధి
పాశమ్మునఁ జిక్కి యుసురు భరమైనయటుల్. 252

చం. యమనియమానుషంగ నిభృతాంగము చూడ్కికి వ్రేగు గాఁగ,ను
త్తమ హృదయప్రసత్తికి హితంబగు నేకతమందు, కన్నులన్
శమసుఖరోచి జాలుగొన; సంస్థితుఁడైన సనాతనున్, జగ
ద్భ్రమ తృణమాత్రుఁ, గాంచిరి, పరాత్పరు నక్కపిలున్
మహామునిన్. 253

ఉ. కాంచి తదగ్రభాగమునఁ గాంచిన రమ్యచిరత్న రత్నరు
క్సంచితకంచుకంబయిన జన్నపువాజినిఁ జూచి, వంచనా
చుంచు మహేంద్రకైతవ నిషూదిత సారవివేకులై, మరు
త్సంచయవంద్యు నక్కపిలుఁ దామెదనెంచి, మలిమ్లు
చుండుగన్. 254

ఉ. ఎవ్వరి వాజియంచెడఁద నెంచితివోయి దురాత్మ! సాగరు
ల్దవ్వులఁ జేరనేరరని; దక్కిన ముల్లెయు వోలెఁ, గొన్న, నీ
క్రొవ్వడగింతుమిప్పుడని క్రోధరసాఽరుణనేత్రులై, వెసన్
జివ్వకుఁ జొచ్చి,హస్తధృతజిహ్మతరాస్త్రిలు చెంగలించినన్ 255

కం. వినియోగములేని యధ
ర్వణ వేదము వోలెనున్న పరముఁడు, దనకున్
వినియోగము గలిగినదే;
ఘనతరహుంకారరోష కలిలుండయ్యెన్. 256

శా. ఆ హుంకారమునందు సాగరులు సాహంకారు లక్షీణబా
హాహంవీరులు; చచ్చిరందఱును భస్మాకారులై, యీశ్వర
ద్రోహంబుల్ కులనాశకారులగుటన్ రూపింపఁ జోద్యంబె; గ
ర్వా హేయక్షతి, యెట్టివారికి; శుభవ్యాపాదమున్ జేయదే! 257

కం. అప్పుడు సగరుఁడు గుణముల
నొప్పెడు మనుమనికి ననియె నోయయ్య! కరం
బొప్పని తమకంబున మీ
యప్పలు సేఁగి యెది వడిరో! యరయుమటంచున్. 258

చం. సమద సపత్న సంచయ విషాదకృదాయుధ విద్యలన్, జిత
శ్రముఁడగు నంశుమంతుఁడు, శరాసకృపాణములన్ధరించి, సం
యమమున నున్నతాతకు సమర్చనసేసి, సమగ్రదీక్ష, నే
త్రములను, గాత్రమందు, సముదారమనంబునఁ జెంగలింపఁగన్.

తే.గీ. పితరు లేర్పఱచినయట్టి పథమునందుఁ
బైనమై సర్వభూత శుభంకరుండు,
దైత్యదానవ రక్షఃపతంగ నాగ
సేవ్యమానమ్ము, నాశాంత సింధురమ్ము. 260

ఉ. కాంచి ప్రదక్షిణించి, కరకంజములన్ ముకుళింప, సత్కృపో
దంచితమైన నేత్రముల నామతి సేసి దిశాగజంబు, భా
షించె, వివేకసుందర! నిషేవిత సత్పథవృత్తి, నశ్వమున్
గొంచుఁ దిరోగమించెదవు, కొందలమింకనటంచు నిమ్ములన్. 261

తే.గీ. తక్కిన దిశాగజమ్ము లేతద్విధమ్ము
గాఁగఁ బలికిన, మోదసంకలితుఁడగుచుఁ
బైనమై, పైనమై కపిలానలమునఁ
దంద్రులందఱు భ్రగ్గిన తలముఁ దరిసి. 262

సీ. మున్ను దిశాగజమ్ములయందుఁ బితరులు
కపిలకోపాగ్నిలోఁ గ్రాఁగి, బూది
యైన దుఃఖోదర్కమగు గాథ విన్నదా
నను జేసి, విన్నదనంబు గదిరి,
మివుల శోకించి, యామేరలఁ దృణచర్వ
ణము సేయు సవతురంగమముఁ గాంచి,
పితృజలక్రియకుఁ గృపీటమ్ము గోరి వి
ష్వక్ప్రసారితనేత్ర పద్ముఁడైన

తే.గీ. మేదురాంశుండు దవ్వుల మేరుశిఖరి
ప్రతిరూపంబు సేకొన్న భాతినున్న
కాశ్యపాత్మజుఁ గాంచి దుఃఖంబు గ్రొత్త
యగుచు, నావఱచినయట్టు లఱవఁదొడఁగె. 263

తే.గీ. వైనతేయుఁడు మేనల్లు వగవకుండు
మనుచు నోదార్చి, కపిల కోపాగ్నికైత
వమునఁ గలిగెడు లోకశుభమ్ముఁ దెలిపి
గంగ మధ్యమలోక సంక్రాంతిఁ దెలిపి. 264

వ కపిల కోపాగ్ని నిర్దగ్ధులగు పితరులు, లౌకిక జలక్రియ కర్హులు గాకుండుటయు, లోకపావనియైన గంగా స్పర్శంబున వారి కగు స్వర్గ ప్రాప్తియు వైనతేయుండు వింగడించి చెప్పి, యశ్వంబు గొని పొమ్మనిన నంశుమంతుండు, బాలాతపవ్యతికర తుంగ శృంగంబగు శిలోచ్ఛయంబు బలె, కపిల జటాభార గంభీ రుండగు కపిలుం దరిసించి యిట్లనియె. 265

చం. తమ తమ దుష్కృతంబులకుఁ దారుపభోక్తలుగాన దుర్గతి
క్రమమున నాశమొందుటయెగాని, హితాహిత భేదదృష్టి వి
భ్రమములు లేని పెద్దలు, భవాదృశు లెత్తఱి సేఁగిఁ గూర్తురే!
యమలము నీ పదద్వయికి నౌదల వంచెద లోకపావనా! 266

చం. సగరుఁడు మత్పితామహుఁడు జన్నము సేయుటెఱింగి,వాసవుం
డగణిత వంచనాచతురుఁ డా హయరత్నము నిందుఁ దెచ్చినన్
దెగువకుఁ జొచ్చి మత్పితలు నీరుగనై, రదిసైంచి, నాకు నె
మ్మిఁగ గృపసేయు మింకిట గమింతును దేవ!
సస్సైంధవంబుగన్. 267

కం. అని కపిలుఁ దనుమతింపఁగ
మనస్యులను బెద్ద, యంశుమంతుఁడు హయమున్
గొనివచ్చి తాత ముందిడి,
తన పితరుల వితము, గరుడి వాక్యతతియును దెలిపెఁ. 268

కం. ఆ కథ విని సగరుఁడు, తీ
వ్రాకులమతి యగుచు, యజ్ఞమవసితమై, గం
గాకల్లోలిని ధరణికి
నే కతమునఁ దెచ్చుటనుచు; యెల్లన్ బ్రదుకై. 269

ఉ. యోచన చేసి చేసి తనయుల్లము ప్రీలుటెగాని, మార్గమే
దోఁచని రాజు, ధర్మగతిదూషిత మౌనసికాక, భోగ కాం
క్షాచయ తృప్తికై పసిడి గద్దియనెక్కని రాజు, యోగ మా
ర్గాచరణమ్మునన్ దివమునందె, జరాభరమేచి వచ్చినన్. 270

ఉ. ముప్పదివేల యేడులు సమున్నత వైఖరి, ధర్మచక్షువై
యిప్పుడమిన్ వహించి, త్రిదివేశ్వరుఁ డడ్డిన మేటి జన్నముల్
దప్పిక దీర్చి, విప్రులకు దక్షిణలన్ బరితృప్తి సేసెఁ దా
నప్పుడమీశుఁ బోలఁగలరా! మఱియన్యులు ధర్మవారిధీ! 271

కం. అను గాధేయుల పలుకుల
కనూదితము సేయ రాముఁ డానంద ధురా
వినమితములైన కన్నుల
ననియెన్ గౌశికుఁడు కథన మాగుబ్బుగొనన్. 272

తే.గీ. సగరుని యనంతరంబున నగరజనులు
ప్రకృతివర్గంబు దన్ను నృపాలు సేయ
చామరమ్ములు తత్కీర్తి సంగమమునఁ
బెల్లుగా వెల్లలైనట్టు లుల్లసిల్లె. 273

సీ. తనకు దిలీపుఁ డన్దనయుండు గలిగిన
చారు కుంతల పరిష్కార మతని
మస్తకంబున హేమమణి ఘటితంబు ధ
ర్మారాధ్యమైన కోటీరముంచి,
యంశుమంతుఁడు గంగ నవనికిఁ దెచ్చు పూ
నికఁ బూని దేవతాత్మకము తుహిన
శైలంబునన్ దపశ్చరణంబు వట్టి, ము
ప్పది రెండు వేలేండ్లు బహుళ నిష్ఠ

తే గీ. గడిపినను గాని దిగిరాదు గంగ యవని;
కంశుమంతుఁడు యోగవిద్యా రహస్య
వేది, కాలరాహస్య సంవిత్తముండు,
హంసవంశ్యుఁడు హంసైక్యమందె రామ! 274

మ. అవనీరక్షణ దక్షబాహుఁడు, దిలీపాఖ్యాన రాజర్షి, తా
నవతారించుట యెట్లు దేవనది నంచ శ్రాంత చింతారుజా
కవశీభూత శరీరుఁడై, చరిత సత్కర్మములం జెందె, శా
శ్రవ వైవస్వతరోచి, నైకసుఖసారంబైంద్రమౌ లోకమున్. 275

కం. అతని సుతుండు భగీరథుఁ
డతి మానుషకీర్తి, పీవరాంసుఁడు ధరణీ
సతి భరియించి, ప్రజార్థం
బతియతియించియును, కడకు నప్రజుఁ డయ్యెన్. 276

ఉ. ఆతఁడు మంత్రులన్ వినిహితావనిభారుఁడు, దేవగంగ నీ
భూతలి డించు పూన్కి, హితపుత్రులఁ బొందెడు పూన్కిఁజేసి, ని
ర్వాతతలప్రదీప పరిభాసి వినిశ్చల చిత్తవృత్తి, ని
ష్ఠాతత సత్తపోవ్రత పిశంగ జటాపరిణాహి రూపియై. 277

శా. మాసాహారియు, నూర్ధ్వబాహుడు, నికామద్వస్తగాత్రుండు, ని
శ్వాసంబుల్ బిగియించి, పంచహవనాశ గ్రీష్మ ఘోరంబుగా
నా సర్వేశ్వరు, ధాతఁ గూర్చి నిలిచెన్, హాహాకృదత్యాహిత
గ్రాసీభూతులు, దేవతల్ వణక గోకర్ణాఖ్య దేశంబునన్. 278

చం. కడచనె వేయి వర్షములు, కంజభవుండు, తపస్సమాధి తృ
ప్తుఁడు, సురసార్థ సార్థుఁడయి, ముందటనిల్చి, భగీరథా! తపం
బెడఁదకు నెక్కెఁ, జాల శ్రమియించితివోయి! వరమ్ము గోరికొ
మ్మడిగిన నిత్తు నంచనునయామృత శీతలరీతిఁ బల్కెనన్. 279

కం. కనుఁగవ ముదశ్రువు లొలుకన్
దనువున వినయంబు దనుక, తన తపముల రూ
పెనసిన కైవడి నిలిచిన
వనజాసనుతోడ వాఁడు భక్తిన్ బలికెన్. 280

శా. నా తాతల్ సగరాత్మసంభవు, లుదీర్ణంబైన శౌర్యమ్ముతోఁ
జేతోహాని ఘటిల్లి, యాదిపురుషున్ జృంభించి, బాల్యక్రియా
పాతిత్యంబుల చివ్వకీడ్చి, యలుకన్ భస్మమ్ములై, తర్పణా
పేతుల్, నేటికిఁ బారలౌకిక సుఖోపేతిప్రణున్నాత్మకుల్. 281

ఉ. గాంగపవిత్రవారిఁ గడుగన్బడి, పాపము, లెల్లరున్ స్వరు
త్సంగ సుఖంబు గాంతురు పితామహులంచును, మూర్తిమత్తప
శ్చాంగులు, వైనతేయులనినట్టి విధానము పొంటె, గంగ, నీ
గంగ నఘమ్ము, భూమికెసకంబున నంపు మపీచ్యదర్శనా! 282

మ. అతిపూతంబగు సూర్యవంశ మవసానాయాసితంబైన ప
ద్ధతిఁ దోఁచెన్, ప్రభు! నాదుగర్భమున పుత్రప్రాప్తి లేకుంట, నీ
యతిపాతంబు దొలంగ నొక్కసుతు రమ్యాకారు, సాకార స
త్యతపశ్శాంతి మతిప్రణేత, కరుణోదారంబుగా నీయవే! 283

కం. మధురాక్షరమైన భగీఁ
రథు నర్థన విన్న బ్రహ్మ రాజేంద్ర! మనో
రథములు సిద్ధించు మహా
రథ! వగవక యుండుమని తిరంబుగఁ బలికెన్. 284

సీ. ఆ హైమవతి భూమి కవతరించెడు నప్పు
డాయక వేగంబు లవనికెల్ల
ప్రేగౌను; దాని ధరింపంగ నీశ్వరుఁ
డొక్కండ వలఁతి, నీవొల్లబోక

నాతనిఁ బ్రార్థింపు మనిపల్కి దివిజగం
  గకు, భగీరథు పూన్కి కరుణఁజూడు
మని చెప్పి, దేవతలా మరుద్గణములు
  వెంటరాఁ ద్రిదివమ్ము వేధ సేరె;

తే.గీ. నచలుఁడై యొంటికాల నిరాశ్రయుండు,
పవనభక్షుండు, దీర్ఘోరుబాహుఁడగుచు
వరుసఁ దపియించె నొక్క సంవత్సరంబు,
గిరిశు నెదలోన నిల్పి భగీరథుండు; 285

ఉ. అంతట భూతభవ్యభవదాఢ్యుఁడు, యామవతీకళత్ర సీ
మంతిత పల్లవారుణ సమగ్ర జటాపరిణాహి, యాశ్రిత
స్వాంతముదుత్సవమ్ము, ప్రమథాధిపుఁ డక్షిపథమ్ముదోఁప, నా
చాంతవివేకు,ఁడల్లన, ప్రశాంతహృదుండు, భగీరథుం
డనెన్. 286

శా. ఏ నీ దర్శనమెల్ల దుఃఖములఁ దా నింకించునంచున్, గృత
ధ్యానుల్, నిర్మల పంచవర్ణసుమ మంత్రాఽధీన చేతస్కులై
నానాదేవత, లార్ద్రి భక్తిమయసా న్నాయ్యుజ్జ్వలజ్జ్యోతి! నేఁ
డా నీదర్శనమబ్బె నాకునిఁక నేయాతంక మార్యాధవా! 287

శా. గంగానిర్ఝరిణీ జలంబులకునై కావించితిన్ నిష్ఠ, నీ
గంగా గోత్ర మహోఘవహ్నిశిఖ, లా కంజాతజాతుండు, త
ద్గంగావేగసహుఁడు భర్గుఁడనుచు న్దానేఁగె నిన్జూపి, వే
గం గావించి కృపావితీర్ణి, పొసగంగాఁజేయు మత్ప్రార్థనన్. 288

చం. ఎవరు తపంబులన్ దనుప సీశులు, నిన్నుఁ బ్రశంససేయఁగా
నెవరు వలంతు, లాగమ సమిద్ధ మనీషలు నిన్ను నేర, వ
వ్యవహితకాలరూప! నిరపాయముగా భువి గంగఁ దెమ్ము, లో
ద్భవనజటాళిలోచ్చ్రయ నితాంత నిగూఢ వియచ్చతుష్పథా! 289

ఆ వె. అనిన సమ్మతించె నయ్యాదిదేవుఁడు,
స్వర్గపథమునుంచి వచ్చు గంగ
కమలభవునకైన, కడఁపోఁడఁ గనరాని
నిజశిరమ్మునందు నిలుపు కొఁఅకు. 290

మ. తన వేగంబు సహింతునన్న ప్రమథాధ్యక్షున్, తరంగాటవీ
జనితభ్రాంతు నొనర్చి, నాగభువనస్థానంబుఁ జేర్పంగఁ బూ
నిన మౌర్ఖ్యంబున గంగ దూఁకెఁ, బరితోనిష్ఠ్యూత నిశ్వాసతు
ల్య,నభస్సంకుల మత్స్యకచ్ఛప కుళీరారావ ఘోరంబుగన్. 291

మ. సకలప్రాణి హృదంతరాళకృతసంస్థానుండు; గంగావయ
స్సకటాఽహంకృతిఁ దానెఱింగి, కరుణాసంస్పంది, తద్వారణ
ప్రకటోత్సాహవివర్ధితాంగుఁడు, నభఃపర్యస్తపింగాంశుకై
శిక,నీరంధ్ర జటావిశంకటుఁడు, దాక్షిణ్యంబుతో నిల్చినన్. 292

సీ. కోపరక్తచ్ఛటాకుల కపోలయుఁ బోలె
వివిధ విద్రుమకాంతి విసరయగుచుఁ;
బ్రసభనిశ్వాసరంబితాంగియుఁ బోలె,
వితతబంభరమల్లసితిమ యగుచుఁ;
జంద్రికాసదృశ నీశారసంవృతవోలె,
వాస్తరంగవళక్షభాస యగుచు;
గమనత్వరా ముహుః క్వణిత కాంచికవోలెఁ,
జకితచక్రాంగ నిస్వానయగుచుఁ;

తే.గీ. ప్రణయకుపితాఽభిసారికవలె గిరీశు
వెదకికొనివచ్చె మదరసాభ్యుదిత యగుచుఁ;
బురుచలత్పద్మ సంహతి భ్రూవిభంగ,
దర్శితావర్తనాభి, యుద్దామగంగ. 293

తే గీ. శిత గళు జటావిభంగ మోహిత సుపర్వ
నది, మధువ్రత మంజు ప్రణాదవక్త్ర
నళినయై, స్వేదజలకణాకులిత యగుచు
సొలసి, యచ్చోటనే గుడుసుళ్ళు చుట్టె 294

సీ. ఒక యోర నొక్కింత యొయ్యారముగఁ బాఱుఁ,
ద్రపఁ గ్రమ్మినట్టు, లంతటన నిలుచు;
ఒక చెంత హంసకాంశుకము నల్లదెమల్చు,
జంకుదోఁచిన యట్లు సవదరించు;
ఒక చాయ, విలులితోర్మికలచే జంకించుఁ,
గొంకు దోఁచిన యట్లు గుస్తరిల్లు;
ఒక దండ నలిమండలి కలభాషణసేయు,
మానమాఁచిన యట్లు మౌనమూను;

తే.గీ. అనితర ప్రాప్యమైన యా హరశిరః ప
దార్పణోత్సవ దర్ప విహ్వలిత వృత్తి
తక్క సౌఖ్యంబు మఱచి యందంద తిరిగె;
బహుళ హాయనములు దివ్యపథగ గంగ. 295

చం. కరబదరోపమానముగఁ గామితమట్లు ఘటిల్లి, దర్పణాం
తరగతమైన నీడవలెఁ దా నవచేయము గాకపోయినన్
మఱుఁగి భగీరథుండరుణమండల తాపతపమ్ము వట్టినన్
హరుఁడు కరంగి, దేవనది నౌదల దాఁటఁగఁజేసె నిమ్ములన్ 296

వ. పరమపావని యేడు పాయలై యాగంగ భువికవతరించిన, హ్లాదిని, పావని, నళిని యన్న మూఁడు పాయలు, శివస్వచ్ఛ శిశిర శిశిర జల సుందరాంగులు, ప్రాగ్దిశాగామినులయ్యెఁ; సుచక్షువు, సీత, సింధువన్న మూఁడు పాయలు, శుభోదకలు ప్రతీచింబట్టె, నేడవ పాయ భగీరథు ననుసరించిన. 297

శా. ఆ రాజర్షి భగీరథుండరుణవాహోభాసి గంధర్వ హే
షా రమ్యంబయి; కిఁకిణీపతగ నిస్వానప్రియంకారమౌ
మేరుప్రాంశురథంబుపైఁ గదలిపో, మిన్నేఱు దావచ్చెఁ, బ
ద్మా రామాంచితవల్గు చక్రరవకుల్యాకల్పరూపంబుగన్. 2

తే గీ. గగనపథముననుండి శంకరు శిరమ్ము,
హరుశిరమునుండి ధరణికి నవతరించి,
తీవ్ర శబ్ద పురస్కృత దివిజగంగ
సూర్యకులకీర్తివలెఁ బయస్సులను బఱపె. 2

సీ. పతితంబులైనవి, పతమానములు మత్స్య
కచ్ఛపాదులు దృగుత్కంఠ సేసె;
నా దిలీపాత్మజు నర్థిఁ గీర్తించు దే
వర్షిఋగాకార వాక్కు వెలసె,
వీక్షాసమాయాత వితత పారిప్లవ
విబుధ విమానేంద్ర విహృతులొప్పె,
గతతోయదము, దేవకాంతా విభూషణ
చ్ఛవి శతాదిత్యమై దివి వెలింగె,

తే.గీ. శశ్వదావల్గమాన విసార రచిత
చంచలా గుచ్ఛ విక్షిప్త జలదపథము
గాఁగ హంస సంప్లవ పరిష్కారయగుచు
నిల మరుల్లోకధుని ప్రవహించినపుడు. 3

సీ. ఋజు మార్గమునఁ బ్రవర్తించు నొక్కట నచ్ఛ
వారియై స్వాధీనపతిక వోలెఁ;
గూలద్రుమవ్రాత కుసుమమ్ములను బూను
కమిచి, వాసకసజ్జికయును బోలెఁ

సారె సారె తరంగవార బాహులు సాచఁ
దతవిరహోత్కంఠితయును బోలె;
లులితజలౌఘపంకిల పద్మ యౌ కాంత
వంచిత విప్రలబ్ధయును బోలె;

తే.గీ. రేఁగి, మలఁగును కలహాంతరితయుఁ బోలె
ఖండితయుఁబోలె, కోపవేగమ్ము నూను
కలఁగు వెండి, ప్రోషితభర్తృకయును బోలె,
నభిసరించు నిమ్నంబుల నమరగంగ; 301

చం. ఒక యల యొక్కదాని కెదురొత్తినఁ, బైకెగయంగఁ దారకా
ప్రకరములై, దిశాజఘన రాజిత మేఖలలై, దినాధినా
యక పదపూజనార్కకుసుమావళియై, నయనప్రమోద దా
యకములు గాఁగనయ్యె, నమృతాంధసనిమ్నగ
వారి బిందువుల్. 302

ఆ.వె. వాసుదేవ పాదపద్మ సంభూతమై
హరు శిరంబునుండి దొఱఁగుచున్న
దివిజవారిఁ గాంచి దేవర్షులెల్లఁ బ్రో
క్షించికొనిరి తపము సిద్ధికొఱకు. 303

కం. శాపప్రపతితు, లా యమ
రాపగఁ దానంబులాడి, హతకల్మషులై
శ్రీపరివేషవిమాన
ప్రాపితులై, చనిరి దేవపథముల యందున్. 304

చం. అకుటిలుఁడా భగీరథు రథానుగయై వడినేఁగు గంగ, యా
జకుఁడయి జహ్నునామముని యధ్వరమొక్కటి సేయుచున్న, త్రో
వకు, నదియడ్డువచ్చెనని, వారి రయంబున స్రుక్స్రువాదులా
యక యొదిగించుకొన్నది, పరాత్మవిశేషవివేకశూన్యతన్. 305

కం. దాని నదలించి జహ్నువు
మానసమున మచ్చరించి మహనీయతపః
ప్రీణిత సకలామరుఁడపు
డా నిమ్నగలోని జలములన్నియుఁ ద్రావెన్. 306

తే.గీ. వెంటఁ జనుచున్న యమరు లవ్విధముఁ గాంచి,
యా భగీరథు వితథ ప్రయత్నమునకుఁ
జాల గుంది హాహాకార శబ్దముఖరు
లైన, వెనుజూచికొనె దిలీపాత్మజుండు. 307

కం. ఉసిరికకాయలు బాష్ప
ప్రసరము గ్రమ్మంగ జహ్ను పదవనజములన్
వెసఁబడి భగీరథుఁడు త
ద్విషమ, రుషాశాంతికొఱకు వేఁడెన్ బెలుచన్. 308

ఆ.వె. అపుడు కర్ణరంధ్ర మందుండి గంగ వె
లార్చె జహ్ను మౌని, లసితవినయ,
మునిఁ బ్రదక్షిణించి పోయె జాహ్నవి భగీ
రథుఁడు ముందుఁ జనఁగ రథగతుండు. 309

కం. సాగరము జొచ్చి జాహ్నవి
సాగరకృతమైన యా రసాతలిఁబడి, త
న్నాగకుల ఫణాపూగ స
మాగణిత తరంగములను హర్షము సేసెన్. 310

ఉ. ఆ సలిలానుషంగమున నప్పుడ సాగరు లద్వితీయ శో
భాసముపేత తైజస ప్రసన్న శరీరులు, దేవయానముల్
వాసిగ నెక్కిపోవుచు, భవత్కృతపుణ్యము, మా యఘంబులన్
ద్రోసెఁ గృతార్థు లైతిమని, తోడనుతించి రనేక భంగులన్. 311

ఆ.వె. అపుడు బ్రహ్మవచ్చి యా భగీరథు మెచ్చి
సాగరమ్ములందు జలములుండు
వఱకు సాగరులకు, సురభూయ సౌఖ్య సం
సిద్ధి సిద్ధమనుచుఁ జెలఁగి పలికి. 312

కం. ఈ గంగ నీకు దుహితగ
భాగీరథియను సమాఖ్యఁ బరఁగి, త్రిలోకీ
యోగమునఁ, త్రిపథగాఖ్యా
ప్రగీత యగునంచు, వేఱు వరమొక టొసఁగెన్. 313

సీ. సగరుండు ధర్మనిష్ఠా ప్రకృష్ట ప్రవ
ర్తనుఁ డైనవాఁడు, నేరకయ పోయె;
నంశుమంతునకు జోడంశుమంతుఁడు ప్రతి
జ్ఞాపూర్తి లేక, యంగమ్ము వదలె;
మత్తుల్యతపుఁడు, సన్మతి దిలీపుఁడు గంగఁ
దేలేక చింత గతించె, దివ్య
గంగఁ దెచ్చెడు నట్టి ఘనకీర్తి నీకుఁ ద
క్కినది భగీరథా! యనుపమాన
తే.గీ. మింక, పితరులకును దీర్పుమీ హితములు,
సలిల తర్పణములు, ధర్మములు ఫలింప
నని యనుజ్ఞ నొసంగిన యబ్జయోని
నెమ్మి దొల్కాడ సత్యలోకమ్ము సేరె. 314

కం. గంగాస్నాన పవిత్రుఁ డ
భంగురమతిఁ దీర్చెఁ, గ్రమనిబద్ధముగా, శ్రు
త్యంగీకృత విధిగాఁ, బితృ
సంగరమును బూర్తి సేసి సలిలక్రియలన్. 315

తే.గీ. ఆ భగీరథుఁ డంత నాహ్లాదతుంద
పరిమృజుఁడు పట్టణముసేరి ప్రజలనెల్ల
లలిని, బ్రహ్మోత్తరంబు పాలనము సేయ
నవని శుభములు వివిధ నాట్యములు సేసె 316

శా. గంగా శైవలినీ ప్రభూతి యిది, రాకాచంద్ర బింబాస్య! సం
ధ్యాంగంబుల్ వెసఁ దీర్పఁగావలయు హోమాద్యాగమప్రక్రియల్
త్వంగత్తుంగశుభంబు నీకమరుగాఁతన్! రాక్షసానీకినీ
భంగాఽభంగ భుజాఘనూరుచిర! భాస్వద్వంశనిత్యోదయా! 317

సీ. ఇది ధన్యమాయుష్య; మిది యశస్యము; పౌత్ర
మిది నాకవాస సన్నిధికిఁ దెరువు;
బ్రాహ్మణులకు రాజవంశ్యుల కితరుల
కిది పఠించుటఁ బితృహితము సేత;
దేవతలును బితృ దేవత లవ్వాని
కవ్వారిగాఁ బ్రీతు లగుదు, రిదియ
పరమార్థ, మెవ్వఁ డవ్యగ్రుఁడై యిది విను
వాని కామములు సత్వరమ దీఱు

తే.గీ. సర్వ పాపౌఽగ ఖండన శంబమైన
జాహ్నవీధుని గాథ, యే సద్మమంద
నవధి ముఖరితమగుచుండు నట్టి యింట
లేమి యనునట్టి మాట సలిలపు మూట; 318

కం. ఆ విశ్వామిత్రుల గం
గావతరణ గాథ విస్మయావహమై చే
తోవీధి నిలువఁ, బ్రతిమపు
మైవడి శ్రీరాముఁ డట్లె మాపును గడపెన్. 319

వ. అనంతరంబ విమలంబగు ప్రభాతంబునఁ గృతాహ్నికుండగు గాధేయుంజూచి యరిందముండగు రఘువంశ కరీపం డిట్లనియె. 320

కం. భవదఖిలపితము గంగా
సవిత్రిదగు దివ్యగాథ, చర్చించుటతో
నవసితమైనది, భగవతి
యవశులకును రేయి, మాకనన్య చరిత్రా! 321

మ. తమ పాదార్పణ దివ్య భాగ్యమునకై తారాడుచుండెన్ బవి
త్రమనీషానిధి! రేవునందొక తరీరత్నంబు, సాకారదై
వమ! యింకన్నది నుత్తరింతుమన, విశ్వామిత్రుఁడా రామచం
ద్ర మహానీలతనూ విమూర్జితము, నేత్రద్వంద్వమల్లార్చుచున్. 322

మ. అవునోయీ రఘురామ! మేమనినవేరా! సాంగదైవమ్ముల
బ్ధివిలోలత్రపతి తోయబిందువున కబ్ధిఖ్యాతియైనట్టు, లెం
త విచిత్రమ్ముగ మాటలాడెదవు! నీ ధార్ష్ట్యంబు మాపైనరా!
భువనత్రాణవినోద! యంచుఁ బలికెన్ మోదంబు
తూఁగాడఁగన్. 323

కం. నదిని దరియించి రందఱు
గదిసినదే యుత్తరంపు గట్టు, పతాకా
మృదు కింకిణీ నినాదా
స్పదమై యొక పట్టణంబు స్వాగతమొసఁగెన్. 324

తే.గీ. అది విశాలాఖ్యసుమ్ము రామా! యటంచు
నమృతనిష్యంది బ్రహ్మర్షులాడినంత
నొక వినూతన గాథాసుధోదధిప్ర
సంగమై, రామునెడఁద భృశమ్ము దనిసె. 325

కం. ఏ రాజవంశమీపురి
సీరాజత్కీర్తియగుచు నిభృతంబేలున్
నీరజభవనిభ! పలుకు ము
దారరసోక్తుల నటన్న నాముని యనియెన్. 326

సీ. వినవయ్య రఘురామ! వినుత తపోమూర్తి
యైన కశ్యపునకు నతివ లిర్వు
రదితియు దితియు, దిత్యాత్మజు లతి బల
వంతులు, ధర్మవివంచనా ప
రాహతచిత్తు, లయ్యదితిపుత్రులు వీర్య
వంతులయ్యును ధర్మపరిణతాత్మ
లటులుండ వారికి నజరామరత్వంబు
బొందుటే గతియను బుద్ధివొడమి

తే గీ. కలశపాథోధి మథనంబు సలిపి, రసము
లందఁ బాలివియంచుఁ గార్యార్థులగుట
జ్ఞాతిమచ్చరములు విడి, గాఢహితాతి
దోహలులు కూలముద్రజ బాహుబలులు. 327

శా. మంథానంబు నొనర్చి మందరము, భీమంబైన యావాసుకిన్
సంధానించి వటాకరంబుగ, శిరస్సంసక్తులై దానవుల్
సంధాసక్తులు, పుచ్ఛసంగ్రహణ హృష్యద్వ్యక్తులై దేవతల్
కంధిన్ ద్రచ్చిరి, వేయి వర్షములు, లోకవ్రాత మల్లాడఁగన్. 328

ఉ. వాసుకి సర్పరాజ ఫణవాంత విషంబులఁజేసి, రక్కసుల్
మాసిరి గొంద; ఱా భుజగమాసరదంష్ట్రిలు గ్రక్కు వహ్నికీ
లాసమవాయ దగ్ధులు విలాయము నొందిరి కొందఱుద్ధతుల్
కాసరరాజకాయ సమకక్ష్యమలీమసదేహు లాశరుల్. 329

ఉ. అప్పుడు వార్ధి హాలహల మన్విషమొక్కటి పుట్టి, కీలికల్
గప్పికొనంగ, లోకములఁ గ్రచ్చఱఁ గాల్పఁ దొడంగె, నేఁటికి
ముప్పు దొలంగబెట్టెడు సమున్నత దైవతమేది యంచు, తెం
డెప్పులు గ్రమ్ముకొన్న వెఱ, దేవతలాహరుఁ జేరిరందఱున్. 330

చం. మరణజరాభరంబులకు మచ్చరికించి, పయోధిఁ ద్రచ్చుచో
నురుభయదంబు కాలగరళోద్భవమైనది, ముల్లువుచ్చు సం
బరమునఁ గొఱ్ఱువుచ్చికొను పాటిగ మాపనియయ్యెఁ, జంద్రమః
కిరణసుధార్ద్ర! దానినడకింపఁగ నీకతగున్ బురాంతకా! 331

చం. సుకముల కన్నచో మునుము సూచుచువత్తురు, సేఁగియన్న, మి
న్నక వెనుకంజ వేసెదరు, నాకపురీసదులైన, హాటక
ప్రకట విభూషలన్ విడిచి, భస్మధరుండగు నీవుగాక వే
ఱొక దొరయుండునే? జగములోమఁగ, దుఃఖములడ్డి శంకరా! 332

చం. అది యొకడేమి సేయు విస, మార్తజనావన! సర్వమంగళా
స్పదమగు నీ శరీరమును, వహ్ని, హుతంబున కగ్గమౌనె! నీ
వదయతఁ ద్రోచితేని భవదంఘ్రుల చెంతనె మ్రందువారమ
య్యధమగరంబు కంటెను, శివాంతిక మృత్యువు గోరఁ జెల్లదే! 333

చం. అనిన సురవ్రజంబునకు నాత్మఁ గరంగిన శంకరుండు, దా
ననుమతిసేయ సర్వభువనాఽతిగ తీవ్రతపస్య, గౌరి, హు
మ్మని యదలించిత్రావె, నిమిషార్ధ చరాచర భూతజాల శో
షణ కృదమోఘభాసము, విషంబు, ఛటచ్ఛట ఘోర
ఘోషమున్. 334

ఉ. ఆ విషవహ్ని కీలికల నయ్యె గళంబు, తమాల సుందరం,
బా విభుఁడయ్యె సర్వదివిజాసుర సంఘనమస్యుఁ, డెల్ల లో
కావళులున్ దదీయమహిమాఽతిశయప్రణుతి ప్రసంగ రా
గావసథమ్ములయ్యె, మహితాబ్ధితరంగ మృదంగభంగులన్. 335

చం. మఱియొక వేయివర్షము లమర్త్యులు, నద్దితిపుత్రులున్, బర
స్పర పరిణద్ధమత్సరు, లవారితయత్నులు, త్రచ్చఁద్రచ్చ, మం
దర కుధరంబు, రత్నరుచిదంతురశృంగ సహస్రకంబుతో
సరయ వివర్తధూత వివశంబు, రసాతలిసంబెఁ జెచ్చెరన్. 336

ఉ. సారపుయత్నమిట్లు ఫలసంగతికి న్నెఱిగానిదై, యసం
స్కారహతోక్తి యైన, దివిషద్గణ ముత్పలనీలవర్ణు, శృం
గార భుజద్వయీ నిహితకాంచనదాము, నశేషలోక సం
తారణధాముఁగాంచి, తమ దర్పము వీఁగుట విన్నవించినన్. 337

కం. ఆలోక సుందరుండగు
నా లోకాధిపుఁడు సురల నమృతరస స్యం
ద్యాలోకనములఁ జూచి, ప
చేళిమదయ, సమ్మతించె సిలుగు దొలంపన్. 338

ఆ.వె. కామఠంబు రూపుగ్రహియించి, సంద్రంబు
లోనఁ జొచ్చి వెన్నుపైని నిలిపి
కొనియె, విశ్వమూర్తి కుధరంబు ఘనశృంగ
హారిరత్న దీపితాంబరంబు. 339

సీ. ఆ దుగ్ధసాగరంబందుండి ప్రత్యక్ష
మయ్యె నాజానుబాహోఽభిరామ
మూర్తి, విద్యాగంధ పూర్ణదరస్మిత
వ్యాజ వినూత్నచంద్రాతపుండు,
కర్ణకుండలకాంతి కవచితాశాంతుండు
మహనీయ దండకమండలుండు,
ధవళయజ్ఞోపవీత పరిష్కృతాప్యాన
వక్షోవిభాసి, దైవతశిరోధి,

తే.గీ. యతఁడు ధన్వంతరి మహాత్ముఁడతనియాన
నన్వయించును, వైద్యవిద్యాగమంబు
హస్తమస్తక సంయోగమాచరించి,
రఖిల త్రిదశులు నా కేశవాంశమునకు. 340

కం. అచ్చరలు పుట్టిరచ్చట
పచ్చవిలుతు మెచ్చుగొలుపు బలగంబులు, దీ
వ్యచ్చటుల నేత్రకోణ
ప్రచ్ఛాదిత మౌని సముదయాంతర్మతులై. 341

సీ. వరుణుని కన్యక వారుణి జనియించి,
తన్నేలికొమ్మంచుఁ దవిలి వేఁడ,
దైత్యులు మాకువల్దనిరి, దేవతలు త
ద్గ్రహణంబొనర్చి రద్దాన, సురల
టన్న యభిఖ్య యయ్యమరులకయ్యె ది
త్యాత్మజు లసురులై రంతకంత
కధికసంరంభయత్నాభిరాములు, సురా
సురులుమ్మడిగను, సాగరముఁ ద్రచ్చఁ

తే.గీ. బొడమె వెలిమావు, దాని నింద్రుఁడు గ్రహించెఁ
గల్పవృక్షమ్ముతోన నాకమ్ము సేరెఁ,
గౌస్తుభము శస్త విష్ణు వక్షస్స్థల ప్ర
సంగ సార్థకమయ్యె రాక్షసవిరామ! 342

ఉ. శీతల-దృగ్విలాసపరిషక్త దిశావలయంబుగా, జగ
న్మాత జనించి లక్ష్మి, మురమర్దను కౌఁగిలి సేరెఁ, దద్దయా
పాతము, చేతముల్దనుప, భక్తిసుగంధిల మానసుల్, ఋషి
వ్రాతము ఋగ్వచస్తులిత భాషల సారెకు నంజలింపఁగన్. 343

కం. అమృతముపుట్టిన నాశరు
లమరులు తత్సంగ్రహమునకై, రోషస్ఫా
రముగాఁగఁ బెనఁగఁ దొడఁగినఁ
గమలేక్షణుఁడపుడు దేవకార్యార్థముగన్. 344

సీ. మోహిని యను మాయ మొనసి యాపాదించి
యమృతభాండమ్ము దానపహరించి
సురలకిచ్చిన వారు గరమర్థిసేవించి
యధికసత్త్వ జవమ్ము లావహిల్లి
కదనమ్మునందు రక్కసుల మర్దించి య
నన్య లక్ష్మీకులై యఖిలలోక
పాలనంబునఁ బెంపువడుచున్న దితి తనూ
జుల సేఁగి దలచి మిక్కిలియు వగచి

తే.గీ. భర్త మారీచుఁ దరిసి దుర్భర శుగశ్రు
వికలితాక్షియై తన గోడు వెళ్ళఁబోసి
యివ్వకుండినఁ గాదు నా కింద్రహంత
తనుజు నంచను, గట్టి పంతమ్ము సేసె. 345

వ. కాశ్యపుండగు మారీచమహర్షి, పరమ దుఃఖితయగు సతిన్గని, వర్షసహస్రంబులు శుచివై వర్తించిన, శక్రహంత, జన్మించునని, బుత్రార్థంబువలికి, తపింపనేఁగిన, పరమానందభరితయైన దితి కుశప్లవనంబు సేరి, దారుణంబు తపంబు వట్టిన. 346

ఉ. దారుణమైన తత్తపము, తన్ను హరించు నటంచువంచనా
పారగుఁడింద్రుఁ డచ్చమగు భక్తిగలాడును బోలె, తత్సప
ర్యారచనార్థి, తల్లి వినయంబునఁ బ్రార్థనసేసి, నిచ్చలు
న్నారయుచుండె, నా రమణియందలి దోసము వీతశంకుఁడై. 347

కం. పదివర్షమ్ములు గడవఁగ
సుదతి తపము సెల్లె, గర్భసూనుఁడు తేజో
భ్యధికుఁడు, పెరుగుచుసుండెను
పదానతము సేయ, దివిజబలముల నెల్లన్. 348

తే.గీ. ఒక్క మధ్యాహ్నము, నదితి యొర్పు దక్కి
కాళ్ళవైపు తలాడగాఁ గన్నుగూర్క
సంచెఱిఁగి తారకారి, యుచ్ఛ్వాస పథము
వట్టి యంతరమునఁ జొచ్చి బాలిశుండు. 349

ఆ.వె. కందుఁబట్టి యేడు గణుపులుగాఁ గొట్టెఁ
గరశతారమునను, గలుషవృత్తి
పోఁడఁడేడ్చుచుండ 'మా రుదో మారుద'
యంచు ననునయించు నట్లు వోలె;

ఉ. ఆ శిశు రోదనంబు హృదయంబును దన్నిన, తల్లిలేచి, యే
రా శిశుహంత! సౌమనసరాజ్యము నేలు వివేకమిద్దియా!
పాశవవృత్తి బోయలును పాపలఁజంపరు, యేటివాఁడవై
నాశమొనర్చితోయి! కుహనామతి! కన్నులులేని పిండమున్. 350

చం. పురములఁ గూల్పనో! కుధరపుంజము జెక్కలు వ్రక్కలింపనో
తరమగునట్టి నీ కరశతారము, పాపల గొంతుఁగోయ న
క్కఱపడె నేఁటికిన్; అదితిగర్భము సార్థకమైనదోయి!, ము
ష్కరతర శౌర్య నిష్కుటమ! జాల్ముఁడవౌ నినుఁ గన్న
దానికిన్. 351

కం. రా రమ్మ వెలికినిక పవి
ధారకు నెనయైన నాదు దారుణశాపం
బేరీతి నిగ్రహింతువొ
యారడమడఁగింతు వంచనాయత్తమతీ! 352

చం. అన, జననీవచఃకులిశ మాయువుపట్టులు దాఁకినట్టులై
తనువు, మనంబు, భీతి శతధా చలియింపఁగ, వాసవుండు ది
న్నని నడనేఁగుదెంచి, నయనంబుల బాష్పములై పదద్వయిన్
ప్రణుతియొనర్చి, యిట్టులనె బాలిశవృత్తికి నాత్మలోఁగుచున్. 353

తే.గీ. నన్ను గనలేదనుచెదక్క, నన్ను పుత్ర
నిర్విశేషంబుగాఁగ మన్నించు తల్లి!
దొసఁగు సైచి, యాయువు బోయు, మసమ బ్రదుకు
లమ్మ! భోగేచ్ఛ యనివార్యమైనదమ్మ! 354

మ. అను నా వాసవుఁజూచి, తల్లిమనసై యాదేవి, కారుణ్యసం
జనితాశ్రుల్ నయనంబులన్ బొదువ వాత్సల్యమ్ము ప్రేరేచి, నా
మనసున్ నీరుగఁ జేసివైచితివి, సామర్షంబుగానింక ప
ల్కను నోరాడదు పొమ్ము కాశ్యపులబిడ్డా! నాకసుశ్రీకతన్. 355

తే.గీ. తల్లి యను మాట, వనితలకెల్ల వాని
కంటెఁ బ్రియమైన యదిగాన, కాచికొంటి
వసువు, లా కాశ్యపుల వీర్య, మదితియందు
నరయ దితియందు సమమైన యట్టిదాన. 356

కం. జననీ పదపద్మమ్ములఁ
బ్రణతులు గావించి యేఁగె బలసూదనుఁ డా
జననీ శాపాక్షరములు
తను దప్పుటఁజేసి మోదతరళితమతియై. 357

ఉ. 'మారుద' యంచు వాసవుఁడు మాటికిఁబల్కుటఁజేసి, తద్దితి
స్ఫారపిచండపిండములు జన్మముగై కొని యేద్గురాఢ్యులై
మారుతులన్న పేర సురమండలికెక్కి, రనల్పభోగ శో
భారమణీయులై, యుచితపాలకతా, పరితృప్తచిత్తులై. 358

తే.గీ. ఆ దితి తపస్సునకు నెలవైన దిద్ది
యామె యోర్మికి నొౘపిడియైనదిద్ది
రామ! జగదభిరామ! సంగ్రామభీమ!
శమితలోకామయవ్రాత చరణసీమ! 359

సీ. కకుబంత విక్రాంతకాంతయశస్వి, యి
క్ష్వాకుఁడన్వాఁడు నిక్కంపురాజు
బ్రహ్మోత్తరంబుగాఁ బ్రజలఁబాలించు, చ
లంబుసయనునట్టి లలనయందు
సంతానమందె విశాలుఁడన్పేరిటి
వాని, శౌర్యంబు రూపైనవాని
నాతండు గట్టించె నభ్రంకషములు వ
ప్రములతో నీ పట్టణము, తదాత్మ

తే.గీ. జుండు, కృతమతి, హేమచంద్రుండు వాని
తనయుఁడు సుచంద్రుఁ డాతండు గనియె సుతుని
ననఘు ధూమ్రాశ్వు, తత్పుత్రుఁ డవనిపాల
జాల పూజితుఁడైన సృంజయుఁడు రామ! 360

వ. తత్పుత్రుండు, వితతశౌర్యాఽధరీకృత సూర్యకరసహస్రుం డగు సహదేవుండు, పరమధార్మికుండు కుశాశ్వుండు వానికి న్గలిగె, నాతండు సోమదత్తుం గనియె,తత్సుతుండు కాకుత్థ్సుండు, తత్పుత్రరత్నంబు నిరాతంకమతి, సుమతి యను రాజన్యుండు, నేఁడు దీని కధీశ్వరుండు. 361

సీ. అవితథ వచనుఁడైనట్టి యిక్ష్వాకుని
వాక్కునఁజేసి భూపాలవరులు
వైశాలులెల్లరు, వర్తితసద్ధర్మ
పథులయి, దుర్భరబాహువీర్య

పరిణద్ధులయి చిరాయురుపేతులై తపః
ప్రాకట్యమున నాత్మవంతులగుచుఁ
బరగుచునుందు, రీపురమున రాతిరి
గడపుదమని మౌనికాంతుఁడన్న

తే.గీ. భాగ్యమనె రామచంద్రుండు, వార్తలందె
జనపతికి నర్ఘసత్క్రియాస్వాదనీయ
మయ్యె, గురుశిష్యవర్యుల కచటిరేయి
మలయమారుత పోతముల్ మలయువఱకు. 362

చం. తెలతెలవారినంత జగతీధవుఁడర్ఘసమర్చ, భక్తిపి
చ్ఛిలముగ సాఁగనంపిన, సుశీతలమారుత కంప్యమానవ
క్రలలిత నీలకుంతలులు రాఘవులాపయిఁ బోయి, రాత్మవం
తులు, మునిసార్వభౌమ పదతోయజ సాధునిబద్ధ దృష్టులై. 363

కం. కనపడె మిథిలాపురి చి
క్కని యెఱుకయె రూపుగొన్న కైవడి, సందే
హ నితాంత తప్తులగు ముని
జనులకు దాహమ్ము దీర్చు సరసి విధమునన్; 364

ఉ. అమ్మిథిలాసమీపమున నాశ్రమమొక్కటి, నిర్జనమ్ము, ర
మ్యమ్ము, పురాతనమ్మగుచు నక్షిపథంబునఁ దోఁప, రాఘవుం
డిమ్ములఁబల్కె, నెవ్వరిది యీ యుటజమ్ము మునీంద్ర! భర్తృభా
గ్యమ్మును నోచనట్టి సతికైవడి నున్నదటంచు, నమ్రుఁడై. 365

తే గీ. అపుడు మునినాథుఁ డనె వినవయ్య రామ!
గౌతముండను దేవసంకాశుఁ డొకఁడు
ఋషి శపించిన దాన, నిర్వృతికిఁ దలఁగి
యాశ్రమంబయ్యె నిది యాతనాశ్రయమ్ము. 366

మ. అమరప్రస్తుతుఁడైన గౌతమునకున్ హైయంగవీనోపమ
ప్రమదోద్దీపక హావభావమదనప్రత్యగ్రలాపాది దు
ర్దమ సౌందర్య, యహల్యయన్న గృహిణీరత్నంబు రామా! మహ
ర్షి మహానిష్ఠలతోన, వర్షములు తీఱెన్ వేలువేలాదిగన్. 367

ఉ. నాకవిభుం డహల్యపయినన్దలఁ పూని మెలంగుచుండె. న
జ్జాకల; నొక్కనాఁడు, మునిరాజు గృహమ్మున లేనివేళ, సు
స్వీకృత మౌనివేషుఁడయి చెల్వను జేరి, తదంగసంగ సౌ
ఖ్యాకలనంబు సేసెఁ, గుసుమాయుధ్రవేటుల కుమ్మలించు
చున్. 368

మ. ఋతుకాలంబు దొలంగితన్నడుగలేదెన్నండు మౌనీంద్రుఁడు
ద్ధత కాంక్షాపరిశీర్ణ చిత్తుఁడయి, సుత్రాముండు, తద్గౌతమా
కృతి నేతెంచినవాఁడటంచు నెఱిఁగెన్ హృద్యాంగి, పుష్పాయుధుం
డతి గాఢమ్ముగనేసె, మానమయవర్మ గ్రీయమల్లాడఁగన్. 369

ఉ. కోరిక దీరినట్టి సురకుంజరుఁగాంచి లతాంగి, గౌతముం
డారయుకంటె ముందుగనె, యక్షిపరంబు దొలంగుమీ రహ
స్యారచితంబు దెల్పకుమ, యన్యులకంచును వేఁడె, శక్రుఁడున్
దారిని బట్టె, గౌతముఁడు దారసిలెన్ గుశపూతహస్తుఁడై. 370

ఉ. ఆ మునిఁజూచి, పెల్లగు భయమ్మున వెల్వెలనైన మోముతో
బూమెలు వోయె నాకపతి, పూజ్యమహర్షి రహః ప్రవృత్తమున్
దా మది వీక్షసేసి, సురధామసుఖోన్మద! భిన్నధర్మ! నీ
కామము డిందఁగా విఫలకశ్మలుఁడౌదువుగాక! యంచనెన్. 371

సీ. అపు డహల్యను గాంచి, యా ఋషి వల్కె య
నాత్మవై యిటులోఁగినట్టి దాన
బహువర్షములు వాయుభక్షవై, యాహార
తృప్తికిఁ దలఁగి, సంలిప్తభస్మ

దేహవై, భూతముల్ తేఱిచూడఁగరాక
మదినెప్పుడును దప్యమానవగుచుఁ
బడియుందు, వీ నేల పరమపావనుఁడైన
దశరథాత్మజుని పాదములచేతఁ

తే.గీ. బూతమగువేళ తద్దయాపూరగళిత
మోహవై, తదాతిథ్యముల్ పూని సలిపి
పూర్వదేహంబు నొంది, నన్బొందఁ గలవు,
పొమ్మనుచుఁ దీవ్రకోప సంభుక్తహృదుఁడు. 372

వ. తదాది గౌతముండు సిద్ధచారణ సేవితంబును,బుణ్యంబునగు హిమ వచ్ఛిఖరంబు సేరెఁ, దద్విసృష్టంబగు నాశ్రమంబును, గృతాప రాధయగు నహల్యయు, భవదీయ పాదవిన్యాస పుణ్యావిశేషంబు నకై నవయుచున్నవారు విజయం సేయుమనిన. 373

తే.గీ. రామచంద్రుండు ప్రేమాఽభిరామమూర్తి
యెమ్మెలగు నవ్వు పెదవుల నివతళింప
నంగములు గొన్న వైకుంఠమట్లు, గౌత
మాశ్రమమునఁ బదార్పణం బమరఁజేసె. 374

సీ. అపు డహల్యాదేవి యనవరతాయాస
పదమైన భర్తృశాపమ్ము దలఁగి;
పృథుతపోభార గంభీరమౌ మానస
మ్మందంబునకు వింత యందమొసఁగ,
నేతెంచి, తెలిగండ్లనెసఁగు నీరమ్ముల
రఘురామ పాదనీరజ నిబద్ధ
దృష్టియై నిలచిన దేవరూపిణియైన
యామెకు రాఘవులర్థి మ్రొక్కి

తే.గీ. రతుల తపములఁ బరిపూతయైన దాని
నజుని నేర్పుల తలపొలంబైన దాని
దీపశిఖఁబోని లావణ్యదీప్తిదాని
నంత గౌతముఁడర్ధాంగి ననుమతించె. 375

ఆ.వె. అర్ఘ్యపాద్యములను నాతిథ్యముల రాము
నుల్లమునకుఁ బ్రీతి యుల్లసిల్ల
సలిపె మౌనిపత్ని, సకలామరవ్రాత
హర్ష హేతువయ్యె నా సమయము. 376

కం. రాజర్షియైన జనకుని
రాజద్యజ్ఞాయతనము రాఘవుఁ డనుజ
భ్రాజితుఁడై సొచ్చెను ముని
రాజ పదాబ్జాతలగ్న రమ్యనయనుఁడై. 377

మధ్యాక్కర. మునిరాజు వచ్చె నటంచు నెఱిఁగిన భూమీశుఁ డపుడు
తన పురోహితు శతానందు ముందుగాఁ దనరంగ నిల్పి
కొని యర్ఘ్య, పాద్యాదికములు తోడ్తోనఁగొనివచ్చి యొసఁగి
మనమలరఁగఁజేసి యంతఁ గుశల సంప్రశ్నంబొనర్చె. 378

ఉ. ధీరుల, రామలక్ష్మణుల, దీప్తిమదంగులఁ జూచి, వీరలె
వ్వారని మైథిలుండడిగి, భాస్కర వంశ వివర్ధనుల్, జగ
ద్భార నికృంతనావతర పద్మదళాక్షు, లయోధ్యరాజు చి
న్నారి తనూజులం చెఱిఁగి, నందిత మానసుఁడయ్యె
నయ్యెడన్. 379

వ. తదనంతరంబ విశ్వామిత్రుండు, రామలక్ష్మణుల సిద్ధాశ్రమ
నివాసంబును, నిశాచర సంహారంబును, నహల్యా రక్షణంబును

వివరించి, జనకు పాలనున్న ధనూరత్నంబు గాంచుటకై వారి వచ్చుట వినిపించిన నహల్యా గౌతముల జ్యేష్ఠనందనుండగు శతానందుండు, మహాతేజస్కుండు, పులకపటల పరీవృత సకలాంగంబుగా నిట్లయె. 380

సీ. నా తల్లి, తద్దయు నవసినయది భర్తృ
శాపాక్షరముల దుస్సహము, దైవ
దురనుష్ఠితంబున గురులు గౌతములకు
ననుకంప గలిగి సేకొనిరె! యామె!
నవహితమతిఁ బూజ యాచరించెను దల్లి;
యీ రామునకుఁ జేయ కేలయుండు!
తపముల నలఁతియే తన్వి! విద్యయు శ్రుతం
బును లేనియదియె; నెమ్మనము నసదె!

తే.గీ. యాజ్య పరిపూర్ణమైనట్టి యాహుతిని హు
తాశనునిఁ గూర్చినట్టు లహల్యఁ బతికిఁ
గూర్చినట్టి నీ యుపకార గురుత నెంత
యభినుతింతును! విద్యామహఃపయోధి! 381

తే.గీ. అను శతానందు పలుకుల నాదరించి,
కౌశికుండనె కాలపక్వంబులగుచు
సుఖము దుఃఖమ్ము గలిగిన చొప్పెగాక
నా యొనర్చిన దేమున్నదోయి! యనుచు. 382

వ. ఎట్లును భార్గవునితోడ రేణుక భంగి యహల్యాదేవి, దేవరూపిణి గౌతముని జేరె, యూఁఱడిల్లుమనిన సంతోష నిభృత నయనంబుల శతానందుండు రాము నుపలక్షించి యిట్లనియె. 383

చం. పరమ తపః ప్రభావమున బ్రహ్మకునెక్కుడు, దీనరక్షణా
తుర రమణీయ వర్తనుఁడు, తొట్టిన మంట కలంగినన్, సురా
సురలోకమైన గెల్వఁగల చొక్కపు విద్యలవాఁడు, నీకు స
ద్గురుఁడుగఁ జిక్కె, నింక రఘుకుంజర! లేశము దోస
మంటునే! 384

వ. అని వచించి. 385

సీ. మునిపూజితుఁడు వసిష్ఠునితోడి కలుచ కా
రణముగాఁ దపము వట్టిన వితమ్ము;
గురుదూషితుఁడు రాజవరుఁడు త్రిశంకు నిం
ద్రునిగాగ మింట నిల్పిన వితమ్ము;
పితరులకును గాని సుతుఁడు శునశ్శేపు
చేపట్టి యాయువిచ్చిన వితమ్ము;
కలికిపోకల మేనకాదేవి వలచి, యం
తన తెప్పఱిలి పెంపు గనిన వితము;

తే.గీ. చిలిపి రంభకు శాపమిచ్చిన వితమ్ము;
లోని శత్రుల గెల్పుకాఁడైన వితము
నవనవ రసాశ్రితము, మౌనినాథు చరిత
మరుసమున నా శతానందుఁ డభినుతించె. 386

కం. మఱునాఁడు జనకభూపతి
గురుతరమగు ఖండపరశు కోదండము చె
చ్చెఱఁ దేరఁబనిచి, మౌనీ
శ్వరుఁ గనుగొని యనియె విమల సవినయఫణితిన్. 387

చం. అవినయవృత్తి దక్షుఁడు మహామహిముండగు నీశ్వరున్, భవో
ద్భవు నెడ సేసి, తక్కు సురవర్గము నాదృతి సేసి, యధ్వరో
త్సవమొనరించి, దుర్మదకృతం బపరాధము మృత్యువై చెడెన్
శివునకు ద్రోహమెంచు నవిశిష్టుల కెన్నఁడు మేలు గల్గునే! 388

ఉ. అంతననంత సత్త్వుఁడు పురాంతకుఁ డొక్కశరాసమెత్తి, మీ
యంతము నేఁడచూతును, శివార్పణయోగ్యము గాని హవ్యమున్
వంతులకెట్లు బట్టితిరి! ప్రల్లదులార! యటంచు, యజ్ఞభు
క్సంతతి నడ్డగించిన, భృశమ్ము భయమ్ము మనమ్ము లొద్దఁ
గన్. 389

మ. అపరాధమ్ము శమింపుమంచు వినయైకాయత్తులై, దేవతల్
తపసుల్ సారెకు నంజలింప, భవుఁడంతన్ శాంతుఁడై మేరుశృం
గపటిష్ఠంబగు చాపమున్, సురగణాఽకల్పంబుగానిచ్చెఁ ద
త్కృప నగ్గింపఁగ వారు, మస్తముల నాకీర్ణంబులై హస్తముల్. 390

శా. న్యాసంబుంచిరి దేవతల్ గిరిశదత్తాభీల చాపంబు, ధ
ర్మాఽసక్తిన్ దగు దేవరాతున, కనన్యాయత్త సత్కీర్తి శో
భాసౌగంధ్యున, కమ్మహామహుఁడు మద్వంశ్యుండు దానౌట, దే
వా! సిద్ధించిన దిట్టు లీ ధనువు, శైవామేయ కారుణ్యమై. 391

సీ. అధ్వరార్థంబుగా నవని శోధించుచు
నుండ, లాంగలమున నుత్థితయయి
యొక బాల గనుపింప, నుల్లంబు దనిసి సీ
తాభిఖ్య నొసఁగి నే నవహితమతిఁ
బెంచితి, నతిలోక విశ్రుత గుణగణాఽ
భిఖ్యయౌ నా దేవి వీరవరులు
యాచింప, నెవ్వఁడే హరువిల్లు నెక్కిడు
వానికి నిత్తునంచేను వలుక

తే.గీ. చాప మెక్కిడలేని రాజన్యవరులు
మిథిలపయినెత్తి నాసేన మిత్తికంప
నమరవరులను గొలిచి సైన్యంబు వడసి
యటిమితిని శాత్రవులఁ బరాహతి నొనర్చె. 392

తే.గీ. విల్లు బూన్చిన రామునకుల్ల సీత
భార్య యగుఁగాక యన్న నప్పరమమౌని
వత్స! చూడుము శైవచాపంబటన్న
రాఘవుఁడు, గురుపద తామరసములంటి. 393

మ. కరి పంకేరుహనాళమున్ గముచు పొంకంబొప్ప చాపంబు, త
త్పరతఁ జేకొని, లస్తకంబునను హస్తంబుంచి, సజ్యంబు సే
య, రవత్రస్త దిగంతదంతిగణమై యా విల్లు మధ్యంబునన్
విఱిఁగెన్, దేవతలక్కజంబుగ, వియద్వీథిన్ విలోకింపఁగన్. 394

కం. అంతట జనకుఁడు చిత్తము
సంతోషాయత్తమగుచు, సాగించెఁ బురిన్
మంతనము జరపి హితసా
మంతులతోఁ బరిణయంపు మైవడి పనులన్. 395

సీ. కౌశికు నాజ్ఞతోఁ గడఁగి వార్తాహరుల్
దశరథక్షితిపు చెంతకును బోయి
వార్తలు వినిచిన, వార్షక మేఘధా
రలువోలెఁ గన్నుల మెలయు హర్ష
ధారలతో రాజు, దమ కులగురువైన
యవ్వసిష్ఠుల నగ్రమందు నిలిపి
కొని, చతురంగిణి కొనకొని నడువంగ
సైన్యంబు, శుద్ధాంత సహితుఁడగుచు

తే.గీ. నాల్గు దినములు పయనించి నగరమునకుఁ
జేరవచ్చిన విజ్ఞాన నీరరాశి
జనకుఁ డెదురేఁగ వారి భుజమ్ము లెలమి
దమ్మికొన్నవి, పూరుషార్థమ్ము లట్లు. 396

వ. కౌశిక వసిష్ఠులు పరస్పరాలింగనానందితులైరి; మఱునాఁటి ప్రభా
తంబున జనకుండు దశరథాఽవనినాథు సముచితంబుగఁ గాన
వచ్చిన, నుచితాలాపానంతరంబున సూర్యవంశ పురోధ, భగ
వంతుండైన వసిష్ఠుండు, దశరథుండు ప్రార్థింప విశ్వామిత్రాను
మతంబున భాస్కరవంశ ప్రశస్తి, జనకున కెఱిఁగింపఁ గడంగి
యిట్లనియె. 397

సీ. వినవయ్య నరనాథ! వివరింపఁగారాని
ప్రభవంబు గలిగి, యవ్యక్తమగుచు,
నిత్యమై నిభృతమై నిర్మలంబైనట్టి
యది యొక్క తెల్వి, విష్ణ్వాఖ్యమగుచు,
విలసిల్లు నద్దానిఁ దెలియంగ నాద్యులు
మునులు నానావిధమ్ముల యతించి
తెలిసినంతయెకాని, తెలియంగనేరరు
వైష్ణవమాయా వివర్తమాను

తే గీ. లా, వెలుఁగునందు జన్మించె నచ్చుతముఁడు
మును మరీచి మహర్షి తత్తనయుఁడయ్యెఁ
గాశ్యపుం, డామహర్షికిఁ గలిగె లోక
లోచనుఁడు వివస్వంతుఁ డాలోకమూర్తి. 398

కం. వైవస్వంతుఁడు మనువు త
థావిధమహిముండు, వాని తనయుఁ డయోధ్యా
శ్రీ వినుతుం డిక్ష్వాకుఁడు
దీవెలు సాగించెఁ, గీర్తి తేజం బెసఁగన్. 399

ఆ.వె. అతఁడు కుక్షి యనెడు నాత్మజుఁ గనియెఁ, ద
త్కుక్షికిని వికుక్షి కొడుకొకండు
వాని సుతుఁడు బాణుఁ డానటత్కీర్తి చం
ద్రాతప ప్రపుల్లితాంబరుండు. 400

సీ. ఆ బాణునకుఁ గల్గె ననరణ్యుఁ డనువాఁడు
సూనుండు విక్రమస్తూయమానుఁ,
డతనికిఁ బృథువు మహామహిముఁడు వుట్టె,
సరవి నాతనికిఁ ద్రిశంకుఁ డనెడు
నాత్మజుఁ డయ్యె, విశ్వామిత్ర కారుణ్య
దీప్తి విద్యోతిత దివ్యకీర్తి
దుంధుమారుఁడు తత్సుతుఁడు యువనాశ్వుండు
వాని కౌరసుఁడు తేజోనిభృతుఁడు

తే.గీ. ఘనుఁడు మాంధాత వానికిఁ గలిగి భూమి
నెలమి రాజన్వతి నొనర్చె, లలితకీర్తి
తత్సుతుండు సుసంధి, తత్పార్థివునకుఁ
బుట్టి రిర్వురు పుత్రు లుద్భూతయశులు. 401

కం. ధ్రువసంధి యగ్రజుం డు
గ్రవిధాయోధనుఁడు వాఁడు గనియె భరతు, త
ద్భువనాధిపసుతుఁ డసితుఁడు
ప్రవిమలసితకరుఁడు, ప్రజల రక్షించుటలన్. 402

మ. అలఘుస్థామ పరాస్త శత్రుతతులౌ నా హైహయుల్ తాళజం
ఘులు, శూరుల్ శశిబిందువుల్ గలిసి, దిక్కూలంబు లల్లాడ, ని
మ్ముల మార్కొన్నఁ, బ్రవాసితుండసితుఁ డిమ్ముల్దక్కి శీతాచల
స్థల సంవాస మొనర్చుచుండె తన దిష్టంబెంచి
సామాత్యుఁడై. 403

వ. అతని యిర్వురు దేవేరులు గర్భిణులైన, కాళింది యనుదానికి సపత్ని గర్భజిఘాంస గరంబిడిన, నది భార్గవుండైన చ్యవను శరణంబు వేఁడ, నతండు "సగరంబుగ సుతుండు వుట్టి, సగరుండను పేర వంశకర్తయగు నోడకుండు"మని వరంబు సేసిన సగరుండు వుట్టి. 404

శా. ఆ రాజన్యుఁడు రాజవంశములలో నభ్యర్హితుండౌచు, దీ
క్షారమ్యంబుగ వాజిమేధముల వేడ్కన్ జేసెఁ, తద్ధామ్య లా
శారామా రమణీయ వస్త్రతతులై రాజిల్ల, దేవౌఘముల్
ధారావర్షిత తద్ఘృతచ్యుతుల కుల్లంబందు హర్షింపఁగన్. 405

తే.గీ. వాని కసమంజుఁడనువాఁడు సూనుఁ డతని
యౌరసుం డంశుమంతుండు ధీరచరితుఁ
డగు దిలీపుఁడు తత్సుతుం డతని కొడుకు
హారి సత్కీర్తిరథుఁడు, భగీరథుండు. 406

వ. వానికిఁ గకుత్థ్సుండు గలిగెఁ దత్పుత్రరత్నంబు రఘువు; రఘుసూనుండు గల్మాషపాదుండు, వానికి శంఖణుండు, వానికి సుదర్శనుండు గలిగిరి; తత్పుత్రుఁ డగ్నివర్ణుండు; వానికి శీఘ్రగుండు వుట్టెఁ; దదుద్భూజానికి మరుత్తుండు గలిగెఁ; దత్సుతుండు ప్రశుశ్రుకుండు; వాని కొడు కంబరీషుండు; తత్సూనుండు నహుషుండు; వాఁడు యయాతింగనియెఁ; దదర్భకుండు నాభాగుండు; నాభాగునకు, రసికతామయ జీవనుం డజుండు సుతుండు. 407

ఉ. చారు సువర్ణహాసిని, విశాల విలోల వినీలనేత్ర, శృం
గార రసాధిదేవత, సుకమ్మలఁ దెప్పలఁ దేల్పఁగా నజుం
డా రుచిరాంగి, యిందుమతి యందు సుఖించె నిరంతరమ్ము, లా
క్షా రమణీయ తత్పదవిసారి రసార్ద్రవిలోచనంబుగన్. 408

చం. ఆతని సుతుండు సూ! దశరథాఽవనినాథుఁడు, కేకయాత్మజా
హిత లలితాత్ముఁ డీతనికి నింద్రుఁడు నెచ్చెలి, దేవతార్థమై
యతుల బలప్రతాపముల నాశరులన్ బడఁగూల్చె నీతఁ డా
స్తుతులె యొనర్తు రచ్చరలు, శోభితరాగ కదంబకంబులన్. 409

సీ. అతని పుత్రులు నల్వు రమరోపములు పెద్ద
వాఁడు శ్రీరాముండు భద్రమూర్తి
సౌవర్ణ దేహుండు, చటులప్రతాపి ల
క్ష్మణుఁడు రెండవవాఁడు వినయశీలి
సౌశీల్య సురభిత జగతీతలుఁడు భర
తుండు మూఁడవవాఁడు చండశౌర్యుఁ
డతనికిం బిన్నవాఁడభియాతి భీకరుం
డైన శత్రుఘ్నుఁ, డత్యమృత హృదయుఁ

తే.గీ. డాదివంశవిశుద్ధు లీయవనిపతులు
వారి బుడుతండు శివునిచాపంబు ద్రుంచె
నతనికొఱకు నీ పుత్రిక నడుగుచున్న
వారమో మిథిలేశ! దివ్యత్ప్రభావ! 410

ఆ.వె. అను వసిష్ఠపలుకు ననుసరించియె కౌశి
కుండు, రాజుఁజూచి కొసరిపలికె;
లక్ష్మణునకు నూర్మిళాదేవి నీవెఁ
గన్నపుత్రినని సకౌతుకముగ. 411

కం. 'ధన్యోఽస్మి' యనుచు విద్యా
మాన్యుఁడు మిథిలేశుఁ, డంత మస్తము వంచెన్
గణ్యాఽమర పుణ్యాశీ
ర్జన్యము, నిర్ఘోష మంబరమ్మున నలమెన్. 412

మధ్యాక్కర. అంతట జనకుండు తమదు వంశంబు నభినుతింపంగ
స్వాంతంబునందెంచి వినయమధురుండు చక్షువులందు
సంతోషబాష్పముల్ గ్రమ్మ, పులకలు జాదుకో మేన
పంతుకెక్కిన రాజఋషుల పితరుల వందించి పలికె 413

సీ. నిమి యను రాజర్షి నిస్తుల ధర్మ సం
కలితుండు మాకైన కొలముసామి;
యతని గర్భమ్మునందవతరించిన వాఁడు
మిథిలాపురంబు నిర్మితి నొనర్చెఁ;
దత్సూనుఁ డాశాంతదంతి సంకాశుండు
తొలివాఁడు జనకాఖ్య నెలమిఁ దాల్చె
వాని పుత్త్రుండుదావసుఁడు దివ్యజ్ఞాన
గంధిలమతి; ధైర్యకంధిసముఁడు

తే.గీ. వాని యనుఁగుకొడుకు నందివర్ధనుండు
వాఁడు గనియె సుకేతుఁడన్వాని: వికచ
కైతకస్ఫూర్తికీర్తి, దిక్కామినీ క
చాంతరంబుల సొబగుల నవఘళింప. 414

వ. తత్సుతుండు దేవరాతుండు, వానికి బృహద్రథుండు గలిగెఁ; దత్పు
త్రుండు సార్థకనాముండు మహావీరుండు; వాని కొడుకు సుధృతి
తత్క్రమంబున మద్వంశంబు లామర తంపరయై పెరుగం
దొడంగె మజ్జనకుండు హ్రస్వరోముండను రాజర్షి; 415

శా. ఆ రాజర్షి ధరిత్రినేలె నిగమాంతాసీన ధీయుక్తుఁడై
పారంపర్యము రాజ్యభోగము తపఃప్రస్థానమై, వైరిరా
ట్పారాతిక్రమ శశ్వదుచ్ఛలిత చండస్థేముఁడై; కర్మవి
ద్యారాహస్యపయోధి; నిర్జరగణవ్యాహార చారిత్రుఁడై. 416

ఆ.వె. అతని పుత్రులందు నగ్రజుఁడను నేను
శాంతచిత్తుఁడగు కుశధ్వజుండు
తమ్ముఁ డొకఁడు నాకు; దాన మానంబుల
మేలివాఁడు; పాడి నేలువాఁడు. 417

వ. మజ్జనకపాదులు నాకుఁ బట్టంబుగట్టి వనంబుల కేఁగిన, మిథిల
యందున్న మమ్ము, సాంకాశ్యాఽధిపుండు సుధన్వుండను రాజర్షి
యెదురించిన, నతని వధియించి, కుశధ్వజునకు సాంకాశ్యంబు
పట్టంబు గట్టితి, వానికిర్వురు దుహితలు గలరని పలికిన. 418

తే.గీ. కౌశికుం డానతిచ్చె నా కన్నియలను
భరత శత్రుఘ్నులకు నివ్వఁ బాడియనుచు
సవిధమున నున్నయట్టి కుశధ్వజుండు
స్వాంతమునఁ బొంగి హర్షబాష్పములు రాల్చె. 419

కం. వచ్చెడు నుత్తర ఫల్గుని
పొచ్చెము లేనట్టి తార, పొనరింపఁదగున్
ముచ్చటగ వివాహంబని
సచ్చరితాగ్రీయుఁడైన, జనకుఁడు వలికెన్. 420

సీ దేహాంతరంబు నొందిన పద్మవాసిని
సీతను రఘురాము చెంతఁజేర్చి,
మేరుశృంగ సమానధీరతాధార, నూ
ర్మిళ లక్ష్మణస్వామి మేళవించి,
యవిగీతవృత్తి మాండవి యను కొమరిత
భరతుని గారాబు పడఁతిఁ జేసి,
శ్రుతకీర్తి, సుగుణనిస్తులభూష వంశ వి
వర్ధను శత్రుఘ్ను వనితఁ జేసి,

తే.గీ. యిర్వురు మహోజ్జ్వలులు బ్రహ్మఋషులు నిండు
మనసులను, వెలలేని దీవెనలు గురిసి,
నడిపిరి వివాహములు జగన్నాథులకును
హవ్యవాహుని సాక్షిగా ననుమతించి. 421

కం. ఇలకెల్ల వెలుఁగు భాస్కర
కులమును వెలిఁగించి తనువుగొన్నట్టి తపం,
బలయక, విశ్వామిత్రుఁడు
వలిమలకున్ జనియెఁ దపమువట్టి చరింపన్. 422

శా. ఆ వైదేహుఁడు సాఁగనంపిన, యయోధ్యాభర్త సానందుఁడై
త్రోవన్ బోయెడువేళ, హుంకృతులు చేతోహాని గల్పింప, రో
షావిష్కార మశేషరాజహవనంబైనట్టి రాముండు, తే
జోవిభ్రాజితమూర్తి, భార్గవకులస్తుత్యుండు వచ్చెన్ వడిన్. 423

కం. వచ్చి, పురారి శరాసము
నచ్చలమునఁ ద్రుంచినట్టి యధముఁ డెవఁడొ రా
వచ్చును ముందుకు సితిగళు
చిచ్చఱక, న్నొక్కపొడవు సేకొని నిలిచెన్. 424

మ. అని ధట్టించిన రాఘవుండు వినయం బాస్యంబునన్ దొంగలిం
ప, నిశాంతమ్ము శిరమ్మువంచి పలికెన్ బ్రాజ్ఞాని; యీశాను జు
ల్కనగాఁ జూతుమె! భాస్కరాన్వయుల నిక్కమ్మైన దైవమ్ము, మీ
యనుమానమ్ము దొలంచి, యర్భకుని నన్నాశీర్వదింపన్
వలెన్. 425

కం. ఎక్కడఁ బోయితి చాప
మ్మక్కజముగఁ జాపమధ్య మల్లన విఱిగెన్;
జిక్కని దయ భక్తుని యశ
మెక్కింపఁగ హరుఁడె, తునుగ నిచ్చిన భంగిన్. 426

మ. అనినన్ రాముఁడు పెల్చనవ్వి, భళిరా! వ్యాహారశౌండీర! చే
సిన తప్పున్ గుణవృత్తిఁ జెప్పెద, విదే చేకొమ్ము, మా విల్లు శం
భుని చాపంబు సమానసారమిది; యేపున్ జూపి దీనన్ శరం
బును సంధించిన, మెత్తు, కానిదయినన్ బోకార్తు దంభాకృతీ! 427

సీ. చతురుండు దైవత స్థపతి మున్నొకనాఁడు
రెండు చాపములు నిర్మించి యొకట
శాంభవతేజంబు సంధించి, వేఱొకం
టను వైష్ణవము తేజమనునయించి,
త్రిపురంబులను గాల్పఁ దివిరిన విషమాక్షు
నకు శాంభవమ్ము కార్ముకము నొసఁగి
తక్కిన ధనువు దుర్ధర్షమ్ము విష్టర
శ్రవున కిచ్చెను, భక్తి జాదుకొనఁగ

తే గీ. వారు నా రెంట దానవవ్యథలు మాన్పి
సురల నోముచు నుండి రెచ్చరిక గలిగి
పాకరిపు నీలనిభ వపుఃప్రభుఁడొకండు
తుహినగోత్ర సదృక్తనుద్యుతి యొకండు; 428

కం. కాలము సెల్లిన శౌర్యా
భీలురు వీరిర్వురందుఁ బెద్దటికంబే
వేలుపునకు యుక్తంబని
వాలాయం బమరులందు వాదు సెలంగెన్. 429

వ. అక్కౌతుకంబు దీర్ప నొక్కనెపంబున చతురాననుండు శివ కేశ
వులకు వైరంబు పుట్టించిన, శైవ వైష్ణవ ధనుర్ధారులైనవారు దల
పడిన. 430

కం విషమశర వహ్నికీలా
గ్రసిత నభోమండలంబు; కల్పాంత మతి
త్రసదఖిల భూతగణమై
ప్రసృమర మాత్సర్యమైన రణమొప్పారెన్. 431

ఉ. ఆ రణమందు, శంభుధనురాతతవిక్రమ మడ్డగింప, హుం
కారమొనర్చెఁ గేశవుఁడు గన్నులఁ గావులుగ్రమ్మ; పూర్వగ
ర్వారభటిన్ దొలంగి నతమయ్యెఁ బురారిశరాస, మంత దు
ర్వారునిఁగాఁగ నెంచిరి; సురల్ మురఘస్మరు శౌర్య
సంపదన్. 432

శా. వైకుంఠుం డపుడాత్మనామకము నిష్వాసమ్ము దానిచ్చె, సు
శ్లోకుండైన ఋచీకుఁడన్మునికి, నుచ్చానప్రభారాశికిన్
శ్రీకఁ బౌనది, మాదు తండ్రికడ నుండెన్, నిత్యపూజావిధి
శ్రీకాంతమ్మయి, భార్గవాన్వయ తపశ్శ్రేయోనిధానంబుగన్. 433

శా. బాహావిక్రమ గోష్పదీకృత దిశాపాలప్రభావుండు, తీ
వ్రాహంకారుఁడు హైహయాన్వయుఁడు, తానై కార్తవీర్యార్జునుం
డీహన్వచ్చి, నిరీహు మజ్జనకుఁ దాదృక్సత్తపస్సక్తుఁ, బ్ర
జ్ఞాహీనుండయి చంపె,భూతగణ మాకంపింప;దుఃఖంబునన్. 434

శా. ఆ ధార్ష్ట్యంబున రోషముజ్జ్వలితమై, యత్యర్కతేజః కుఠా
రాధఃపాతిత సర్వరాజకముగా, నాక్రోశమున్ దీర్చి కొం
చీ దృక్పాపము ద్రోవ నేది తెరువంచీక్షించి, యజ్ఞక్రియా
సాదిన్, దక్షిణగాఁగఁ గాశ్యపునకై సర్వంబు నర్పించితిన్. 435

కం అది మొదలు మహేంద్రాద్రియె
సదనంబై యుందు, శైవచాప విమథనా
స్పదమౌ నీ శౌర్యము విని
యిది దెప్పరమంచు వచ్చితిటకున్ జూడన్. 436

సీ. ఇదె! వైష్ణవము చాప మిరవుగ దీని నె
క్కిడుమంచు నిచ్చిన, కీలితాంజ
లుఁడు, రఘురాముండు, నిడుదచాపము వట్టి
తెగనించి, శరము సంధించి, యలఁతి
కోపమ్ము కన్నులఁ గూరఁ, గించి ద్రక్త
మైన స్మితమ్ముతో, "ననఘ! బ్రహ్మ
వంశ్యుండ వగుట విశ్వామిత్రు నను(గు వౌ
టను, నిన్నుఁ జంపుట యనుచితంబు;

తే.గీ. కాదు నా శరమెపుడు మోఘమ్ము, గాన
చిరతపంబున నీ సమార్జించినట్టి
భువనముల ద్రేతు"నని శరమ్మును విడిచిన
భార్గవు నహంత కార్పాస పటలియయ్యె. 437

చం. కరములు మోడ్చి, ధర్మమును గావ,నధర్మముఁ ద్రోవ, పుట్టువున్
ధరఁగొనినట్టి నీవు మురదానవభేదివి నిక్క; మస్మదు
చ్చరితము లెల్ల సైచుమని సాఁగిలి మ్రొక్కి, ప్రదక్షిణించి, స
త్వరముగ నేఁగె, నానగొని, భార్గవరాముఁడు లుప్తతేజుఁడై. 438

వ. వైష్ణవంబగు ధనువు వరుణున కిచ్చి, రఘురాముండు వసిష్ఠా
దుల కభివందించి, తల్లిదండ్రులఁ దేర్చి, యయోధ్యకు వచ్చి
సుఖంబుండెఁ; గర్ణేజప పలితకేశుండగు దశరథాఽవనీ నాథుండు
రామభద్రు యువరాజుఁ జేయ నభిలషించుచున్నంత; మంధర
యను దుష్టదాసి వచనంబులంజేసి నృపాలునిచేఁ బూర్వదత్త వర
యైన కేకయాత్మజ, యాత్మసూనుండగు భరతునకుఁ బట్టంబు
గట్టను; రామునిఁ బదునాలుగేండ్లు వనంబులఁ ద్రోవను వేఁడిన,
పూర్వదత్త వరబద్ధుండైన మనుజరాజు వగచుచున్నంత. 439

చం. జనకుని పూన్కిఁ దీర్పను, నిశాచర బాధిత మౌనిసంఘమున్
మనుపను, వెంటరా విమల మానస జానకి, లక్ష్మణుండు, ప్రే
మనిభృత చిత్తవృత్తియయి మార్గము సూపఁగ, దండకాఖ్య చి
క్కణ వనభూమికేఁగె, గుణకంధి, రఘూత్తముఁ
డాత్తచాపుఁడై. 440

కం. మాతుల గతుఁడగు భరతుఁడు
భ్రాతృవియోగమ్ము, జనకు పంచత విని, శు
గ్ప్రీతాత్ముఁడగుచు మాతృస
మేతుండై దండకమ్ము మేరలఁ జేరెన్. 441

కం. వచ్చిన తమ్ముని ప్రేమం
బచ్చుపడఁగఁ గౌగిలించి, యాడినమాటన్
లొచ్చుపఱుపరాదని తన
యిచ్చఁదెలిపె రాముఁ డమరులెల్ల నుతింపన్. 442

తే.గీ. భరతుఁడంతట భ్రాతృసేవారతుండు
పాదుకలు గొనియేఁగె, నప్పంకజాయ
తాక్షుఁడగు రామభద్రుఁ డయ్యడవులందు
మగువతో నొక్క రుచిరాశ్రమమున నుండె. 443

ఉ. చారుశరీరు, మండలితసౌమ్య జటాభరుఁ, బీనబాహు, గం
భీర మదేభయానుఁ గని బిమ్మిటినొందిన కన్నులౌచు, దు
ర్వార మనోజతాపమున రావణుచెల్లెలు, కామరూప శృం
గార మనోజ్ఞయై గదిసెఁ, గమ్మని కౌఁగిలి కాసఁజేయుచున్. 444

ఆ.వె. దానిఁబట్టి, రోషదందహ్యమానుండు
లక్ష్మణుండు, కోపలాలసుండు
ముక్కు చెవులు గోసెఁ, జిక్కని నెత్తురుల్
కడలివెంట కింశుకములఁ జిమ్మ. 445

సీ. అది విని ఖరదూషణాదులు పదునాల్గు
వేలు వచ్చిన రామవిభుఁడు, తీవ్ర
బాణానలంబున భస్మంబు గావింప
జనకజ తిరుమేని చక్కఁదనము
విన్న దశగ్రీవుఁ, డన్నువఁబొందంగ
తొరపడి మాయ నుత్కోఁచుఁ డైన
మారీచుఁ బంచిన నా రక్కసుఁడు పసి
డిజింకయై చరియింప నేఁగె రాముఁ
తే.గీ. డంటి యద్దాని వధియింప, నంతలోన
రావణుఁడు చూడనొప్పిన శ్రమణుఁడగుచు
విగత శమ దమ ధనుఁడు శ్రీవిద్యఁబోలు
సీతఁ జేకొంచుఁ బయనించె శీఘ్రగామి. 446

ఉ. ఆ యసురాధినాథుఁడు రయంబున చిక్కని మింటఁ బోవుచో
నాయక రామ! రామ! యని యద్రిగుహల్ ప్రతిశబ్దమీన వా
పోయినఁ, దద్రవంబు శ్రవముల్ వెససోకి, తుషారశైల ప
క్షాయత మా జటాయువు కదధ్వమునడ్డె మహోద్యమంబునన్. 447

ఉ. అప్పుడు విప్పు కన్నుగవ హాలహలం బొలుకంగ, వేడియూ
ర్పుప్పతిలంగ నయ్యసుర, "యోరి! పురందరధైర్యహంత, నా
చొప్పున కడ్డువచ్చితివి సుమ్మ"ని కాలునిదున్న యట్టునం
దొప్పెడు గంటపెన్నులివులొల్లని ఘల్లులలీను ఖడ్గమున్. 448

కం. కైకొని విసరిన కెవ్వను
కేకలుగాఁ బుడమి, పులుఁగు క్రిందఁబడెన్, సీ
తాకురరీకలరోదన,
మా కోనల కొండలందు నలుగులు వాఱెన్. 449

తే.గీ. విరహి యగు రామచంద్రుండు, వెలఁది వెదకి
కొనుచు నజ్జటాయువుఁ జూచి, మనసు కదలి
తీర్చి పారలౌక్యమ్ములు, నేర్చు విరుల,
కంతు నెలవైన ఋశ్యమూకమ్ముఁ జేరె. 450

వ. ఆ శైలంబున సుగ్రీవుండను వానరరాజు, భ్రాత్రపహృత భార్యుండు హనుమంతుండను సచివుండఁ దనకు సహాయంబుగాఁ ద్రిమ్మరుచుండి, వాయుసూను సాహ్యంబున రాము దరిసించి, స్నేహం బగ్నిసాక్షికం బొనర్చి, జానకి రావణాపహృతయని యెఱింగించి, వాని వధియింపఁ దనతోడు వలికి, తనసూడు దీర్చుమన్న, భూమండలంబున నెవ్వరికంటె బలశాలియైన వాలి వధియించి సుగ్రీవునకుఁ గిష్కింధఁ బట్టంబుగట్టిన యనంతరంబ 451

క. సీతను వెదుకఁగఁ బోయిరి
యాతత బలులైనయట్టి యగచరు లుగ్ర
స్ఫీత ముహుర్హుంకారో
ద్ఘాత నికంపద్వ్రదావదగుహాంతరులై. 452

ఉ. చిచ్చఱకన్ను డాచి భువిఁజేరిన రుద్రుఁడు, చిన్ననాఁడ దీ
వ్యచ్ఛటుల ప్రతాపమున భాస్కరు నుల్లసమాడినట్టి వాఁ
డచ్చలమార నిల్చిన సురాసురలోకకోటిఁ గూడివచ్చినన్
మెచ్చని జోదు, వాయుజుఁడు నీరధి దాటెను దక్షిణంబునన్. 453

తే.గీ. నీరనిధి దాటి సౌందర్య సారమైన
లంకఁ జొచ్చి యా జానకి పంకజాక్షి
నెల్లకడలను రోసి చింతిల్లి గళిత
నాకఖండ మశోకవనమ్ము సొచ్చి. 454

సీ. మలినముల్వ్రేడి యూర్పులచేత, చెంతల
నున్న తీవెలఁ గాల్చుచున్నదాని.
పాంసుజాలమ్ములు పైఁబ్రాకి ధూమమ్ము
వాదిలిన శిఖిశిఖ వోనిదాని
ఆవహిల్లిన లేశమపకీర్తిచే దీన
దీనమౌ, సత్కీర్తి వోనిదాని,
వానకాఱులు గొన్న బాష్పంబులను జేసి
ప్రావృషేణ్యాభ్రమ్ము వంటిదాని

తే.గీ. జనకజను జూచి, రాముని యునికిఁ దెలిపి,
యుంగరమొసంగి రావణుండొల్లఁబోవ
వాలవహ్ని లంకాపురీ వైభవమ్ము
లెడలఁగాలిచి, హనుమంతుఁ డేఁగుదెంచె. 455

కం. వచ్చిన హనుమను గని నీ
మెచ్చుగ నేమిత్తునను చు మేను నిమిరి, ప్రే
మోచ్చలిత వక్త్రశీతల,
మచ్చపుఁ గౌగిలినొసంగె, నవనిపుఁడంతన్. 456

మ. కదలెన్ సేనలు దిగ్దిగంతముల హుంకారమ్ము లాగుబ్బలై
మెదలన్, బన్నగరాజు కోటితలలన్ మేంఢ్రించు భారమ్ములై
పదనిర్ధూత రజోవ్రజమ్ము లరుణ ధ్వాంతములై, వింతల
న్గదియింపన్ జకితాఽమరీగణ నిరీక్షాఫుల్ల కాశంబులన్. 457

సీ. నల్లరేగడిమట్టి మొల్లమౌచోటఁ గ
సీసపున్ వలువ దాల్చిన విధాన
జతురసారక్తముల్ స్థలముల, శుకతుంద
మునుబోని రైకదాల్చిన విధాన

సుమ పాండురములైన చోటుల, యుతకంబు
వెలిపట్టు గట్టి శోభిలువిధాన
హారిద్ర కాంతితో నలరు పట్టులను, ప
చ్చని మేలిముసుగు ధాల్చినవిధాన

తే.గీ. మేరు శిఖరాయమాణ గంభీర గాత్ర
కాళగళ వహ్నిదృకన్దృకక్రిమణశీల
గహనచర వీరయాత్రలో గగనలక్ష్మి
క్రొత్త సింగారముల నెఱకోపు నెఱపె. 458

సీ. గోడివడగ నేల కోటి సహస్ర వా
నరుల గవాక్షుండు బిరుదు మెఱసె
విస్ఫురమర ఋక్షముల్ ద్విసహస్రములు వెంట
నంట ధూమ్రుఁడు కాలుఁడై చెలంగె
భాస్కర శౌర్యుండు పనసుండు ముక్కోటి
తరు చరులను వెన్నుదన్ని నడచె
నీలాచలంబును బోలించు నిలువుతో
నీలుండు బలముల హేల నెఱపె

తే.గీ. మఱియుఁ జేయంగ గల దొరల్బరవసమున
నగ్గలింపంగ బ్రహ్మాండమైన కడిమి
కహకహారావ ప్రతినదత్కంధి యగుచు
సేతువెత్తిన గతి మహాసేన నడచె. 459

సీ. ఒకవంక నంగదుం డుగ్రరూతలూగంగ
దితిజుల నిట్లు మర్దింతు ననుచు,
నొకచెంత దధిముఖుం డుల్లసంబాడంగ
రేద్రిమ్మరులు నిల్తురే యటంచు,

నొక యొర, లారుండు వికసితవక్త్రిండు
బూమెలువల్కఁ, గర్బురుల గుఱిచి
యొక క్రేవరంభుఁ డాత్మోన్నతిఁ జాటి, త
ద్దయును బీరంపుఁ బొత్తములు విప్పి

తే.గీ. వీరకేదారమును దాల్చి, వీరగంధ
వాసనలు బిట్టు ఘ్రాణతర్పణము గాగ
కరము వెలుఁగొందు వెల్ల సీవిరుల తోడ
నడచె సుగ్రీవుఁ డొక గంధనాగమగుచు. 460

చం. తలఁచిన సర్వలోకములఁ దానొకఁడే యడఁగింపఁజాలు పి
చ్ఛిలమగు శౌర్యపున్ మగఁడు, శ్రీపతికెక్కిన మేటిభక్తుఁ, డి
ష్టులఁతులఁ బోవరాదనుచు నచ్చలమారిన కన్నుఁగోనలై
వెలలెను జాంబవంతుడుఁ డతివేల బలంబు హసాదటంచనన్. 461

తే.గీ. సకల దైవత బలములు సంగ్రహించి
కరువు బోసిన మూర్తి, సాకారవినయ
మనిలసూనుండు, రామ నామామృతప్ర
వర్షణాభ్రమ్ము విజయ తత్పరత తనద. 462

మ. కపిసేనా శరధామ సంభ్రమము వీక్షా తర్పణంబైన, మూ
ర్తపరబ్రహ్మము, రామచంద్రుఁడు; జటారమ్యంబు, ఫుల్లాబ్జ ప
త్రపరీవాద సితాంబకంబయిన శీర్షంబల్ల నల్లార్చి, చా
పప్పుదాకు ప్రభు సాహ్యుఁడై కదలె, దేవవ్రాత
మగ్గింపఁగన్. 463

తే.గీ. ఆతని వెన్వెంట లక్ష్మణుం డతినిభృతుఁడు
కపిశకేశుఁడు, తూణీరకలిత తనుఁడు
సజ్యచాపుఁడు సంగరోత్సవము గుఱిచి
ప్రతిపదోత్పులకితుఁడు, శీఘ్రమ్ము నడచె. 464

సీ. సకలాగమాంత వాసనలు గల్గినచోటు,
సురలు పక్షులుగాఁగఁ దిరుగుచోటు,
వరములు క్రోక్కొల్ల వక్కాణించెడు చోటు,
జ్ఞానామృతము కాల్వలైనచోటు,
తపసులే తరువులై తనరెడు చోటు, కై
వల్యమే తేనెలై పాఱుచోటు,
వీణామునికి నిత్య విశ్రాంతి యగు చోటు,
శంభుని ధ్యానలక్ష్యమగు చోటు,

తే.గీ. పొసఁగ భగవంతుఁ డను నామమునకు రూఢి
యైన పరతత్త్వ మాదినారాయణుండు
క్రుమ్మరుచునున్న దివ్య వైకుంఠపురము
లలిత విభవమ్ము శేషాచలమ్ము దోఁచె. 465

కం. తోఁచిన యంతటఁ గపులు స
మీచీనము భక్తిపొదల, మిన్నుగదల, శి
ష్టాచారపరులు పొగడిరి
వాచంయమరిక్థ శ్రీనివాసుని గుణముల్. 466

ఉ. కోకిల శోక షట్చరణ కోమల కాకు కలస్వనాంచితం,
బాకలితాబ్జగంధము; సమంచిత నిర్ఝర వారి మౌక్తిక
స్వీకృత శైత్య, ముల్లసిత చిత్తము, వీచె, రమాభృదంఘ్రి సే
వాకమనీయమైన వనవాతము, సానులతాఽనుపాతమై. 467

సీ. ఆ మారుతమ్ముల కలకలు చలియింపఁ
జాపాఽభిరామ సౌజన్యమూర్తి
రఘుపుంగవుఁడు వోవ రాజీవనయన ని
స్తుల సత్తపోవిభా చుళుకితాంగి
యంజనాదేవి యన్నతివ యొక్కతె వచ్చి
యతిభక్తి నర్ఘ్యపాద్యముల నొసఁగి,
చిర,ముపోషితములౌ చెలువున తెగ విచ్చి
కొన్న కన్నుల రఘుకులశిరోధి

తే.గీ. చెలువమును గ్రోలు పెద్దప్రొద్దులకుఁ దెలిసి
హర్షబాష్ప పరీవృతమైన దేహ
యష్టితో, బ్రేమసిక్త ముగ్ధాక్షరములు
పలికె నీ గతి నయమునఁ దలను వంచి. 468

శా. ఏ వేషంబును వేసినప్పుడు నరుండేకాగ్రమౌవృత్తిఁ దా
నా వేషంబు నటించుకైవడిని, మత్స్యాద్యాకృతుల్ సెంది, త
త్తావచ్చేష్టల లోకమోమితివి; విద్యా సత్తపోవృద్ధులే
నీ వైశారదియైన మాయగడువ న్నిర్విణ్ణు లాత్మేశ్వరా! 469

కం. జననంబని, యైశ్వర్యం
బని, ధనమని తెచ్చికొన్న యహములతో వే
దనఁ బడెడువారు నిన్నున్
గనుగొందురె! కానదగిన కైవడి నృహరీ! 470

మ. హనుమంతుండనువాఁడు నా సుతుఁడు దేవా! వాఁడు నీ సేవలో
మునిఁగెన్,సార్థకమయ్యె నా బ్రదుకు,నిన్ ముప్ప్రొద్దుఁ బూజించుకో
ననువౌ, నాశ్రమమొక్కటే గిరులలో నాసక్తితోఁ గట్టితిన్
నను మన్నించి, భవత్పదాబ్జయుగ విన్యాసమ్ము గావింపవే. 471

తే.గీ. అనిన రాముండు గన్నుల నామతించి,
పదము పొందమన మాతృపద్వనజములకు
శీర్షమును వంచి, హనుమ(డు సేన(జూచి
చేయివీచె నంతన శేషశిఖరి దెసకు.

సీ. ఈ దారి(బయనింత, మెలమి నిచ్చట రాలి
నవి పూలు స్వామి, రానయ్యె ననుచు
నీ కోన(దిలకింత మిట బర్హిణములకే
దెల్పితి దైవమేతెంచు ననుచు
నీ సరసిని జూతమిట వారిదేవత
లెల్ల(గాచిరి ప్రణమిల్లు కొఱకు
నావైపు బోవుద మహిరాజులున్మ స్త
కములతో మణిదీపికా సహితులు

తే.గీ. పరమ పదనాథ! భ క్తేష్టకరణ నిత్య
జాగరూక! లక్ష్మీకాంత! శరణ మనుచు
నంజనాదేవి హృదయంబు నవని బఱచి
భావనాఽతీతమూ ర్తికి(ద్రోవ సూపె.

సీ. అదె పోవుచున్నవా(డబ్జపత్రమ్ముల(
దెరువుల నిండుగా(బఱవరమ్మ,
దాటిపోయెడు నేమొ! దైవతమౌళి పే
శల పుష్పరజములు చల్లరమ్మ,
అలసెనో! యేమొ! యీ నళినీదళపు తాళ
వృంతమ్ములను మెల్ల వీవరమ్మ,
విరహమ్ము రెచ్చునో నరరూప హరికి మీ
సెలయు తావులు మాటు సేయరమ్మ

తే.గీ. అనుచు, వనదేవతలు సమదాళిదృశలు
కీరవాణులు సుమపరిష్కారకలిత
లెయిది యెయిది పరస్పర మెచ్చరించి
కొనఁగ రఘుపతి చిత్రవర్తనుఁడు నడచె. 474

సీ. వేదాధ్యయనశూర విమల వటువ్రాత
వాఃపరిపూరితావాల జాల
మై; శౌక పైక కృతాహ్నికమై జంతు
జాల పరస్పర సతత సఖ్య
దర్శనీయంబయి; దమ శమ నిరత సం
యమి ముఖపద్మ నిధ్యాన నిరత
చిత్రార్పితారంభశీల గోసంచయం
బై మనోభవ విక్రమాఽవిపన్న

తే.గీ. మై, కుసుమఫలగణ సంతతాభిరామ
తరు సమావృతమై, నాకచర కృత ప్ర
ణామమై, యొక్క యుటజంబు నయనయుగ్మ
గమ్యమయ్యె మనోజ్ఞ సాకార తపము; 475

ఉ. ఆ మహనీయ మాశ్రమమునందు వసించు మహాఃపయోధి ని
ర్లోముఁడు, రాము రాకవిని, లోచనముల్ పరితః ప్రఫుల్లముల్
రామమయమ్ములై, పృథు జరాభర భుగ్నశరీరుఁ డార్ద్రిబా
ష్పామలకావృతాక్షుఁడు విహాయసలోక నిరీక్షమాణుఁడై. 476

కం. చనుదెంచి రఘూద్వహు పద
వనజమ్ముల శిరము నుంచి, బహుళ పులక దీ
ప నితాంత దీప్తతనుఁడై
ఘనుఁ డాముని పలికె నిట్లు గంభీరముగన్. 477

కం. అనహంకృతిమత్సాత్త్విక
జనసంయమ గమ్య! జన్మజాడ్య హరణ! పా
వన పావన! వన పవనా
శన శయ్యాసుఖత! వేదసౌధ నివాసా! 478

తే.గీ. నన్ను నిర్లోముఁడందురే నలువ గుఱిచి
సలిపితి తపమ్ము దివ్యవర్షములు పెక్కు
లతఁడు గరుణించి, ప్రత్యక్షమవతరించె
హంసఘోట్టాణమున సరోజాసనుండు. 479

సీ. ఏ తేజమునఁజేసి యెల్ల వెల్గులు శివ
బ్రహ్మాదికము లనారతము వెలుఁగు
నే మూలతత్త్వంబు నెల్ల ధీమంతులు
కొలుతురు బుద్ధిమేరలకుఁ దలఁగి,
యతిచంచలములయ్యు నవిగతములుగ శాం
త్యాదు లెందేని యింపై చెలంగు
కల్పకోటి శతంబుగా నించియైన వీ
ణాముని దేని వర్ణనము నేరఁ

తే.గీ. డట్టి మూలమ్ము, దేహమ్ము ననుమతించి,
పుట్టువందును బుడమిపై, పున్నెమలర
నతని దరిసించి, ననుఁ జేరుఁడని వచించె
జలజగర్భుడు, నిగమ గంధిల తనుండు. 480

కం. దరిసించితి నినుఁ గన్నుల
కఱవులు దీరంగ నింక కైతవహరి! నా
శిరమున కరముంచుము నా
దరమున సెలవిమ్ము సత్యధామము సేరన్. 481

ఆ.వె. అనిన రామభద్రుఁడక్షుల నమృత సే
చనము సేసె, భక్తిధన వశుండు
కలఁతఁ జిక్కినట్టి కరిరాజు కాయమ్ము
దడవినట్టి కరము తలగదించి. 482

కం. విన్నారము నీ తపములు
గన్నారము నిన్ను ధన్య, ఘనముని! కొఱ యే
మున్నది! తపముల ఫలిచిన
సన్నుత లోకములు గొమ్ము శాశ్వతములుగన్. 483

ఆ.వె. అని వచింప నప్పు డగ్ని యందాఋషి
దేహయష్టి వేల్చి, దివ్యతనుఁడు
సురలు విరులుగురియ వర విమానంబున
నెక్కి జేరె, బ్రహ్మలోకములకు. 484

సీ. ఆ యాశ్రమమునుండి యలఁతి నవ్వులతోడఁ
గదలె రాముఁడు ధీరముదిర తనుఁడు,
గిరిదరీ కుహరమ్ము లురువృక్షచర వీర
కోలాహలముల గగ్గోలు వడఁగ
నతని పోయెడు నప్పుడామూర్తి కన్నుల
నాకళించిన జీవలోకములకు
ననితర ప్రాప్య బ్రహ్మానంద సౌఖ్య స
మాధి నిర్బాధమై మక్కళించె;

తే.గీ. శాపహతు లౌచు వివిధ రూపాపఘనము
లంది యుండిన యక్ష సిద్ధాదులపుడ
వాని బాసి, హొరంగగు మేను లమర
మింట నిల్చిరి ముత్సమున్మిషిత మతులు. 485

కం. ఆకాశగంగ చెంగట
నాకౌక స్సేవ్యమాన నగమై, భక్తి
ప్రాకట్యమున, వికుంఠం
బాకారంబైన యుటజ మంజన దరిసెన్. 486

ఉ. ఆదిమ యోగుసెవ్వని పదాబ్జ మరందము గ్రోలి, తన్మదా
పాదిత సర్వభోగులయి, పాటన సేయరౌ, తక్క సౌఖ్యముల్
సాదిత షట్సపత్నములు, సాధిత లోక శుభంబులైన త
త్పాదములందు వ్రాలినది భామిని, పావిత గాత్రయష్టిగన్. 487

ఉ. ఆయక పూజలందికొని, యార్ద్రహృదంతరుఁడైన రాముఁ డా
మ్నాయ శిఖావతంసము, వినాకృత భిన్నపథంబు, ఊన ని
శ్శ్రేయసమైన, భక్తిసుధఁ జిందె వరంబున, పారమేష్ఠ్య మీ
పాయని భక్తికిన్ సవతు వచ్చునె? యంచు సురల్
దలంపఁగన్. 488

ఆ.వె. ఆత్మ తృప్తిఁ గన్న యంజనాదేవి, ని
ర్మల కటాక్ష పుష్పములను జల్లి
సాఁగనంప రామచంద్రుండు వానర
సేనతోడ నడువఁ బైనమయ్యె. 489

మధ్యాకర. 'ఓన్నమో నారాయణాయ!' యని నిచ్చలున్నిద్రమతిని
పన్నుగాఁ బాడెడు భృంగపటలిచేఁ బరివేష్టితమ్ము
కన్నుల ముందటఁ దోఁచె, రమ్యంబు కమలాధినాథు
ప్రసన్నని దేహంబువంటి జలముల స్వామి పుష్కరణి. 490

సీ. అఖిలాభ్యుదయ మూలమైన తత్తీర్థ జ
లమ్ములఁ గ్రుంకిడి తమ్ముతోడ
లోకశిక్షార్థమ్ముఁ లోకేశుఁడపుడు ఫ
లమ్ములు దెప్పించి సమ్మదమునఁ
దత్తీర్థజనులకు దానము సేసె శా
స్త్రానుమతమ్ముగా, నతని చేయు
దానమ్ము వట్టిన ధరణీసురులు యజ్ఞ
మూర్తులు, ధరణిపైఁ బొడమినట్టి

తే.గీ. హవ్యవాహనరూపు, లాప్యానభుజము
లంత జోడించి రాఘవుం డర్థిమ్రొక్కె
మనుజవేషమ్ము సేకొన్న మాధవుండు
శ్రీనివాసుని దివ్యవిమానమునకు. 491

వ. తదనంతరంబ, సుగ్రీవాంగద నల నీల జాంబవ త్సుషేణ పవన
సుతాది మహాకపులు, స్వామితీర్థంబున గ్రుంకులిడిరి; కృతాహ్ని
కుండైన సౌమిత్రి వెంటరా రఘువీరుండు సప్తకక్ష్యాంతరంబులు
దాటి వేంకటేశ్వరు దరిసించి, యిట్లని వినుతించె. 492

మ. అవిధేయుండయి రావణుండు మునిజాయా దుఃఖకృద్వృత్తియై
దివిజాఽలంఘ్య పరాక్రమైక ఖనియై, ధేనువ్రతోత్పాదియై
యవనీభారము సేసె, వాని వధకీ యత్నంబు, మత్కార్ముక
చ్ఛవి; నీవై, విదళింపు మాశరుల, వీక్షామాత్రతేజోనిధీ! 493

చం. అలఁతులఁ బోఁడు వాఁడు, హరునంతటి దైవము, వాని సత్తపో
బలమున నిర్జితుండు, మునిపత్నుల బాష్పములెన్ని రాల్చనన్
గలన జముండువాఁడు, మురఘస్మర! చక్రము నీవు నొంచు, నా
కెలఁకుల నిల్చి, వాని నడగించి జగమ్ముల సేఁగి దీర్పుమీ! 494

కం. అని వినుతించిన రాఘవు
వినయమునకు మునిజనంబు వింతగఁ జూడన్
గనుఁగవల వెల్లఁదనమున
కనువుగ నర్చావతార మల్లన నవ్వెన్. 495

తే.గీ. అంత నైరృతి దిగ్భాగమందు నొక్క
కుటి వినిర్మించికొని రఘుకుంజరుండు
స్వామి తీర్థాఽవగాహ, తత్స్వామి చరణ
కమల మధుసేవ దినములు గడపుచుండె. 496

కం. సముదగ్ర శిరోగ్రీవులు,
సమ విషమ స్థల విశంక సంచారులు, దు
ర్దములై తిరుఁగఁగఁ దొడఁగిరి,
సమీరజుని దొట్టి కపులు శైలవనమ్ముల్. 497

సీ. భక్షింతు రొక్కచో ఫలములు సామిద
        ష్టమ్ము లభ్రమ్మునఁ జిమ్మికొనుచు
గుడిచెద రొకచోటఁ గ్రొత్తేనియలు జుం
        జుమ్మను తేటుల జోపికొనుచు,
విదళింతురొకచోట విరుల గుత్తులు ధరా
        సతికిఁ గ్రొత్తొడవులు సవదరించి,
శబ్దింతు రొకచోట సలయమ్ముగ, నసంఖ్య
        ములు మృదంగమ్ములు మ్రోసినట్లు

తే.గీ. దివ్య రత్నదరీ సమాధిస్థ యోగి,
ధనపరానందమునకు బాధకము గాఁగ
కిలకిలారావముల దిశల్గలంతు రతుల
గహన శౌర్యులు, శ్లథిత దిక్కరులు, హరులు 498

మ. మొనగాఁడై, రఘురాము సీతఁ గొని, లాఁబోయెన్ దశాస్యుండు,త
ద్ఘన గర్వంబు దలంగ నాహవమునన్ ఘట్టించి, వైదేహిఁ దే
ర్పను జేకొంటి ప్రతిజ్ఞ, మామకము విక్రాంతమ్ము లోకోత్తరం
బనుచున్ గంతులు వేసె నొక్కహరి బాహాస్ఫాలనో
        దగ్రుఁడై. 499

కం. జలనిధి నొక గోష్పదమున
సలీలముగ నుత్తరించి, శతమఖ ముఖ ది
వ్యులకుఁ జొరఁగాని లంకను
గలఁచెదనని యొక్క క్రోతి గమకము వలికెన్. 500

కం. రావణుఁ డటె! వాఁడెంతటి
చేవలు గలవాఁడొ! వాని జీవాళము నా
చే విధి దప్పించు నటం
చా విష్కృత శౌర్యుఁడొక్క హరి గర్జించెన్. 501

సీ. ఒకదాని పైకెక్కి యొరిమతోఁ బల్లటీ
ల్గొట్టె నొక్కటి సారెఁ గొక్కిరించి,
ఒకదాని చెవి గోకి కికురించి దేవమా
ర్గము సూపె వేఱొక్క గండుక్రోతి,
వాలమ్ము పైకెత్తి కోలమ్ము సేసె హుం
కారధీరుం డొక్క కపివరుండు,
కదలఁ జల్లించి చిక్కని నవ్వు లాళవా
ద్యము సూపె నొక హరి దర్పమెనసి,

ఆ.వె. ఒకటి విరులు రాల్చెఁ, జకితంబుగాఁ బక్షి
నివహ, మొకటి తరులు నేల డుల్చె,
నొకటి చెంగలించె నొక్కటి బిరుసాడె
హరుల యందు శత్రుహరుల యందు. 502

సీ. గజుఁడు గవాక్షుండు, గవయుండు శరభుండు
గంధమాదనుఁడు విక్రమ జితారి
మైంద ద్వివిదు లాజి మంథాన శైలమ్ము
లా సుషేణుఁడు మనీషా సగర్వుఁ
డంజనానందనుం డాదిగాఁ గపివీరు
లరవింద నేత్రు పుష్కరిణి గడచి,
యీశాన్య దిక్కునందేలమిఁ జరించుచుఁ
గానన ద్రుమ పుష్పగంధ సుంద

తే.గీ. రంబయిన యొక్క గుహఁ గాంచి రభసవృత్తిఁ
జొచ్చి రందు కాళీసముచ్ఛ్రాన నయన
విచ్ఛదిత దృక్కుడుంగము ల్మచ్చరించు
చీఁకటులు లెక్కఁగొనక బాహీక కుమలు. 503

మ. ఒకచే తేజము కోటి సూర్యనిభమై, యుద్దామమై తోఁచినన్
జకితాక్షుల్ కపివీరు లోటువడియున్, జంచన్మహా సాహసో
త్సుకులై, సాఁగిరి ముందు ముందునకు, శత్రువ్రాతగర్వాంధకా
ర కచగ్రాహి కృశానుతేజులు, ముహుర్గర్జా కరాళంబుఁగన్. 504

కం. విమలాంబు నవాంబర, దృఢ
కమనీయాట్టాల జఘన, కనుపించిన ద
గ్గమునఁ బ్రియ సాహసికులకుఁ
గమలాశ్రిత మొక్క పురము కపివీరులకున్. 505

ఉ. అందఱు శంఖచక్రధరు, లందఱు శుక్ల సుగంధ మాలికా
సుందరు, లందఱున్ విమల సూనృత వాగ్విదు, లప్రధృష్యు, లా
నంద సుధాతరంగిత మనస్కులు, పీవరబాహు, లచ్ఛతా
సింఘులు, పద్మజావర వశీకృత చిత్తులు పట్టణంబునన్. 506

కం. గిలకొట్టు లేఁతనగవులు
కులుకు నడలు పద్మనాభ గుణగాన సుగం
ధిల చిత్తమ్ములు, మరు మం
గళదీపములైన యచటి గరితలకెల్లన్. 507

మ. త్రిజగన్మోహనమైన తన్నగరి మధ్యేవీథి హేమాద్రిశృం
గ జఘన్యమ్మయి, మర్దలధ్వనితమై కారుణ్య దృక్సంయమి
వ్రజపద్రేణు విభూషితమ్మయి, రసప్రస్విన్న దేవాంగనా
భజనస్ఫీత విమాన మొక్కటమరున్ బాపాపహ ప్రక్రియన్. 508

సీ. తద్విమానమ్మందు దళితాబ్జ నేత్రుఁ డా
ప్యాన చతుర్బాహు భద్రమూర్తి,
శంఖ చక్ర ధరుండు, శ్లక్ష్ణపీతాంబర
చ్ఛవిమదంగుఁడు, ఫణిస్వామి విపుల

తర ఫణామణికాంతి తారకితోరస్కుఁ
డబ్ధిజా ధరణీదృగంత దృగ్వి
తాన చంద్రకితాంఘ్రి, తరుణారుణోదీర్ణ
కౌస్తుభాపీత దిగ్వలయతలుఁడు,

గీ. ప్రాంశు వనమాలికా విభూషాంశుఁడమర
కామినీ చామరానిల గ్లసిత కైశ్యుఁ
డొక్క పురుషుండు మువ్మూర్తులొకటి గాఁగ
గండరించిన యట్లు సాక్షాత్కరించె. 509

ఉ. ఒకమా టెవ్వని రూపు చిత్తమునయందుద్భిన్నమైనన్, మహో
ఘ కదంబంబులు కల్లలౌచు విరియున్, గంజాక్షు, నా చక్రిఁ జూ
చి కపివ్రాతము విస్మయాకులిత దృష్టిస్నిగ్ధమై యుండె, మ
స్తకముల్వంచి, యవర్ణనీయ మహిమ స్వచ్ఛందమ జ్యోతికిన్. 510

ఆ.వె. అంతలోన నొక్కఁడాపీన భుజ చతు
ష్టయుఁడు దండధారి సరగ వచ్చి
కపులఁ దొలఁగుఁడంచు గద్దించె బొమముడి
మాత్ర, దీప్తి భాసమాన తనుఁడు. 510

కం. ఆ తేజమ్మున మనసుల
పాఁతగిలిన, ధృతి యడంగి పరువెత్తి, ముదా
పేతులు గుహఁ గడచిరి కపు
లీతటి జీవింపఁ గలదులే! శుభమనుచున్. 512

సీ. పాఱుతెంచిన కపీశ్వరు, లంతలోనన
తేర్కొని యెడలకు దీమసంబు
లెక్కించుకొని, రాక్షసేశుండు రావణుం
డొడ్డిన చెర్ల గాకున్నె యంచు

తలపోసి క్రమ్మఱి తలపడవలెనంచు
గర్జా మహాభీల గాత్రులగుచు
గుహఁజొచ్చి చూడ నగ్గుహయందుఁ బట్టణం
బున్నట్టి చాయ లేదొక్క ప్రాణి

తే.గీ. యును గనంబడ, దచ్చెరువొంది హరులు
గహ్వరంబెల్ల, బలుమాఱు గలయఁ దిరిగి
తమ విమోహంబ యంచుఁ జిత్తములఁ దనిసి,
మగిడి వచ్చిరి లోకసమ్మాన్య యశులు. 513

కం. ఆ కతవిని శ్రీరాముఁ డ
నాకులమతి సెలవివాఱ నల్లన నవ్వెన్
నాకౌకస్సముదయ మ
స్తోకుఁడు నారాయణునకు జోతలు వెట్టెన్. 514

కం. అటనుండి గదలి రాముఁడు
పటు రాక్షసబలము గూల్చి బాహాగర్వో
త్కటు, దశకంధరు మాలిచి
కటువయి పొరిగొన్న జగముకలుచ దొలంచెన్. 515

మ. పవిధారా పతనంబు గీడ్పఱచు నప్పౌలస్త్య వక్షస్సము
ద్ర విశోషంబొనరించినట్టి జగతీధానుష్కుఁ డా రాఘవుం
డవనీభారము మాల్చినట్టి హరి, మిథ్యాభూతముల్, తద్గుణ
స్తవనోత్కర్షిత చిత్తులౌ నరులకున్ సంక్రాంత
పాపౌఘముల్. 516

కం. అని పలికిన సూతుని గని
మనములు హర్షమున బొంది మాన్యులు ఋషు లి
ట్లనిరి శ్రవణావతంసం
బమపమ మీ గాథ పాలితాన్వయ! సూతా! 517

కం. గుహ యెట్టి? దందుఁ గనపడి
విహరించిన వీరుఁ డెవఁడు? విస్మయకర స
న్నహనంబగు పురి యెట్టిది?
మహామతీ! వింగడింపు మాకెల్లఅకున్. 518

ఆ.వె. అనిన సూతుఁడనియె నబ్జాక్షుఁ డావీరుఁ
డాపురమ్ము తుంగ గోపురమ్ము
కాపురమ్ము నిత్య కల్యాణములకు వి
కుంఠ నగరి, జన్మలుంఠన కరి. 519

సీ. ఆ పట్టణమ్మున నగపడినట్టి పౌ
రులు శంఖ చక్ర చిహ్నాలు గలారు
కంబుకంఠులు, గజగమనులు, మాంసలి
తాంసులు సంవిన్మయాపఘనులు
నిత్యముక్తులు, శేషనిలయు నర్చింపనై
వైకుంఠమున నుండి వచ్చినట్టి
వార లవ్వీరుండు, వాసవాద్యమర భ
ద్రంకర మూర్తి, నారాయణుండు

ఆ.వె. బ్రహ్మ దొట్టి సురలు వందారులై కొల్వఁ,
గొల్వుదీర్చు శేష కుధరమందు;
కలియుగంబువారి కన్నులు వైకుంఠ
గుహను గాంచు వెరవు కుండలింపు. 520

తే.గీ. వారిజాక్షుండు దా కపీశ్వరుల కెల్ల
వేడుకలు సేసెఁ దన రూపు విస్తరించి
మనుజుఁడై వారితోఁ గూడి మాడి మెలఁగె
కపులు శాశ్వతానందలోకపులు గారె ! 521

కం. ఇది వైకుంఠ గుహా సం
కథనం బాముష్య, మతుల కల్యాణ కరం
బిది పఠియించినచోఁ బా
ప దరిద్రాణంబు భరము పఱచల కైనన్.

మ. అవితాశేష దిగీశ! యీశ ధనురంత్యాటోప! తాపాపహ
స్తవనీయాఽ ప్రతిమ ప్రభావ! భవకాంతా మానసానంద!
ద్రవికాస ప్రతిషేధి సుస్మిత! తపోధర్మిష్ఠ! వల్మీకభూ
శ్రవణ ప్రాహుణికీకృతాఽమృత కథాసంరంభ! శుంభచ్ఛ

కం. జనన మృతిరూప బాధా
వినివర్తన నామ! వేదవిద్యా పార
ప్రణవపద! వల్మకీముని
మనస్తరణి! రామచంద్ర! మాయాతరణీ!

మాలిని. పరమపద విహారా! భవ్య కారుణ్య పూరా!
విరతివన మయూరా! వేదవీణా ప్రచారా!
గురుజఘనమృగాక్షీ కుంచితాపాంగ దూర
స్ఫురదనుపమ రూపా! సూర్యవంశ ప్రదీపా!

గద్యము. ఇది శ్రీపరమభాగవత పాదరజః పుంజమలీకృత మనో
పితృభూత శ్రీనివాస హృదయతర్పణ, లక్ష్మీదేవీ గర్భ
ముక్తాఫల, నిరంతర నిరంతరాష్టాక్షరీ మంత్ర మనన
స్నాత గంగాజల, భక్తిరసైక జీవన, శఠమర్షణ
గోత్ర పావక, నారాయణదాస ప్రణీతంబైౖ
శ్రీనివాస ప్రబంధంబున, పంచ
మాశ్వాసము
సంపూర్ణము.